

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 226

సోమవారం 6-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గిరిజనులకు చేసిందేమీ లేదు

గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ చేసిందేమీ లేదన్న మోదీ -6లో



నడిపినోళ్లకు నడిపినంత!

కారు నడిపిన దూరానికే బీమా రక్షణ 25% వరకు తగ్గనున్న భారం -15లో

న్యూస్‌రీల్

ఏటా కొత్త వ్యాధి కారకం!



వందల ఏళ్లుగా వ్యాధి కారకాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రస్తుతం వాటి సంఖ్య ఎక్కువవుతోంది. గత 3 దశాబ్దాల్లో 30 రకాల వ్యాధి కారకాలు ఉద్భవించినట్లు డబ్ల్యూహెచ్‌వో పరిశోధనలో తేలింది. ఏటా సగటున ఒక వ్యాధి కారకం వెలుగులోకి వచ్చింది.

- వివరాలు 3లో ▶

ఢిల్లీలో జనం ఉక్కిరిబిక్కిరి



ఢిల్లీలో వాయు కాలుష్యం బెంబేలెత్తిస్తోంది. వరుసగా ఆరో రోజు సైతం పొగ మంచు దట్టంగా కమ్మేసింది. కాలుష్యం మరోసారి 'అత్యంత తీవ్రం' కేటగిరీలోకి చేరింది. ప్రాథమిక పాఠశాలలకు సెలవులను ప్రభుత్వం మరో 5 రోజులపాటు పొడిగించింది.

- వివరాలు 6లో ▶

కాషాయ దళం.. కారాలు మిరియాలు!



బీజేపీపై పార్టీ పాతకాపులు మండిపడుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకున్న వారికి అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. వలస నేతలకు పెద్దపీట వేశారని, కష్టపడి పనిచేస్తున్న వారికి గుర్తింపు లేకుండా పోయిందని వాపోతున్నారు.

- వివరాలు 5లో ▶

కూతురు ముందే పిస్టల్‌తో కాల్చుకుని..

రాచకొండ ఏఆర్ ఎస్సై మహ్మద్ ఫజల్ అలీ (59) పిస్టల్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎస్కార్ట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న అలీ, తన చిన్న కుమార్తెతో కలసి ఆదివారం డ్యూటీలో చేరడానికి వచ్చి, ఆమె సమక్షంలోనే ప్రాణం తీసుకున్నారు.

- వివరాలు 12లో ▶

ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి పువ్వాడ



ఇక ప్రాంతీయ శకమే

ఎక్కడివారు అక్కడ ఉంటేనే ఆ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడతారు

ఖమ్మం, కొత్తగూడెం ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

ప్రజల చేతిలో ఉన్న ఏకైక వజ్రాయుధం ఓటు

అభ్యర్థుల గుణగణాలు, వారి పార్టీ చరిత్ర చూసి ఓటేయాలి

మీ నిర్ణయాధికారాన్ని సరిగా వాడకపోతే ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది

అధికారం ఇచ్చినప్పుడు ఎవరు ఏం చేశారనే విచక్షణతో ఓటు వేస్తే ప్రజలు గెలుస్తారు

సాక్షిప్రతినిధి, ఖమ్మం/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:

'ఎవరు గెలిస్తే ఈ రాష్ట్ర ప్రయోజనాలకు మంచిదో.. ఎవరి చేతుల్లో ఉంటే తెలంగాణ సురక్షితంగా ఉంటదో మీ అందరికీ బాగా తెలుసు. ఎన్నికలు వస్తుంటాయి.. వివిధ పార్టీల అభ్యర్థులు నిలబడతారు.. ఇప్పుడు కూడా నిలబడ్డారు. మనిషి గుణం, గణం చూడాలి. సేవ చేస్తాడా.. గెలిచిన తర్వాత టాటా చెబుతాడా..? అన్నవి పరిశీలించాలి. అంతకన్నా ముఖ్యమైన అంశం.. అభ్యర్థి వెనకాల ఒక పార్టీ ఉంటుంది. గెలిచే అభ్యర్థి ద్వారా ప్రభుత్వం ఏర్పడుతుంది. ఆ ప్రభుత్వమే రాబోయే ఐదేళ్ల రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. మన తలరాత రాస్తుంది. కాబట్టి ఏ పార్టీ చరిత్ర ఏమిటి?..అధికారం ఇచ్చినప్పుడు వారి నడత, సరళి ఏమిటి? ఏం చేశారనేది ఆలోచించి మీ విచక్షణతో ఓటు వేస్తే ఎన్నికల్లో ప్రజలు గెలవడం ప్రారంభం అవుతుంది. ప్రజల చేతిలో ఉన్న ఒకే ఒక వజ్రాయుధం మీ సొంత ఓటు. మీ నిర్ణయాధికారాన్ని సరైన పద్ధతిలో వాడితే మంచి భవిష్యత్తు ఉంటుంది. లేకపోతే ఇబ్బందులు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. రాబోయేది ప్రాంతీయ పార్టీల యుగమే. ఎక్కడి వాళ్లు అక్కడ ఉంటేనే ఆ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడతారు..'అని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం, కొత్తగూడెంల్లో

మిగతా 2వ పేజీలో ▶

కోహ్లి = సచిన్

ప్రతిష్ఠాత్మక ఈడెన్ గార్డెన్స్ మైదానం.. దాదాపు 70 వేల మంది ప్రేక్షకుల హోరు.. తమ మొబైల్ ఫోన్లలో అరుదైన ఘట్టాన్ని చిత్రీకరించేందుకు సిద్ధమైన తరుణం...రబడ వేసిన బంతిని బ్యాక్‌ఫుట్‌పై కవర్స్ దిశగా ఆడి సింగిల్.. అంతే స్టేడియం మొత్తం కోహ్లినాదంతో హోరెత్తిపోయింది.. అభిమానులు ఎన్నాళ్లుగానో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మైలురాయిని 'బర్త్‌డే బాయ్' అందుకున్నాడు. వన్డేల్లో 49వ సెంచరీతో దిగ్గజం సచిన్ రికార్డును సమం చేసిన కోహ్లి తన పుట్టిన రోజున తనకే ప్రత్యేక కానుక ఇచ్చుకున్నాడు. తన 289వ మ్యాచ్‌లో కోహ్లి ఈ రికార్డును చేరుకొని ఆల్‌టైమ్ గ్రేట్ సరసన నిలిచాడు. విరాట్ శతకానికి తోడు శ్రేయస్ అయ్యర్ సమయోచిత బ్యాటింగ్‌తో భారత్ 243 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది.



వన్డేలు **289**

రన్స్ **13,626**

సెంచరీలు **49**

14 లో

ఎన్నికలు అనగానే గుంపులుగా వస్తున్నారు

బీజేపీ, కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ ధ్వజం

- కేసీఆర్ సింహం.. సింగిల్‌గానే వస్తాడు.. తోడేళ్లే మందలుగా వస్తాయి
- రాష్ట్రంలో పోటీ చేయడానికి బీజేపీ నేతలు భయపడుతున్నారు
- ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ కేసీఆర్ సీఎం
- రంగారెడ్డి జిల్లా ఆమనగల్, షాద్‌నగర్‌లలో ఎన్నికల ప్రచారం



ఆమనగల్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ''సీఎం కేసీఆర్ సింహంలాంటి వాడు. సింహం సింగిల్‌గానే వస్తుంది. తోడేళ్లే మందలు మందలుగా వస్తాయి. ఎవరెన్ని కుట్రలు చేసినా.. చివరికి తెలంగాణలో గెలిచేది కేసీఆరే..'' అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం షాద్‌నగర్ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్య యుద్ధం కొనసాగుతోందన్నారు. ''బీజేపీ నుంచి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులను మోహరిస్తే.. కాంగ్రెస్ నుంచి సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే,

మిగతా 2వ పేజీలో ▶



గాజా సిటీలో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో తన బంధువులను కోల్పోయి రోదిస్తున్న వ్యక్తిని ఓదారుస్తున్న పాలస్తీనియన్లు

6 లో

శరణార్థి శిబిరాలపై భీకర దాడులు

గాజాలో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం

మూడు శిబిరాలపై దాడులు

24 గంటల్లో 73 మంది మృతి

మెజారిటీ.. మ్యాజిక్ ఫిఫ్టీ పంచ్

33 చోట్ల అరలక్ష ఓట్ల కంటే ఎక్కువ ఆధిక్యత.. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీలు

బీఆర్‌ఎస్ బహుముఖ వ్యూహం 50 మంది ఓటర్లకో లీడర్

ముక్కోణపు మిజోరంలో... గెలుపెవరిదో!

కాంగ్రెస్, ఎంఎన్‌ఎఫ్ హోరాహోరీ

జంగ్ తెలంగాణ

వివరాలు 7,8 పేజీల్లో



కాంగ్రెస్ వస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే!

అవినీతి, అక్రమాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కవల పిల్లలే

మీట్ ది ప్రెస్‌లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

- ఒక కుటుంబం చేతుల్లో ప్రజాస్వామ్యం బందీ అయింది
- కేసీఆర్ పాలనను గాలికొదిలేశారు
- గజ్వేల్, కామారెడ్డి రెండు చోట్లా ఆయన ఓటమి ఖాయం
- దమ్ముంటే తొమ్మిదేళ్ల అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్.. తెలంగాణలో బీసీలకు రాజ్యాధికారం అందించే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు వెల్లడి
- కవిత అరెస్టు, సోనియాగాంధీ అరెస్టు వంటివి విచారణ సంస్థల బాధ్యత.. బీజేపీకి సంబంధం లేదని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మార్పు అంటే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు కాకూడదని, బీఆర్‌ఎస్ పోయి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిస్థితి అంతేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ రెండు పార్టీల డీఎన్‌ఏ ఒక్కటేనని.. అవినీతి, అక్రమాల్లో కవల పిల్లల వంటివని విమర్శించారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తొమ్మిదిన్నరేళ్లలో దళిత సీఎం నుంచి దళితబంధు దాకా, ఉద్యోగాల భర్తీ మొదలు నిరుద్యోగ భృతి దాకా.. ఇళ్లు, విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా చాలా రంగాల్లో కేసీఆర్ సర్కార్ పాలన తూతూమంత్రంగానే సాగిందని ఆరోపించారు. గత తొమ్మిదేళ్లలో కేంద్రంలో, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై సీఎం కేసీఆర్ తనతో బహిరంగచర్చకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేయాలన్న నిర్ణయానికి అనుగుణంగానే తనను అసెంబ్లీకి పోటీచేయొద్దని జాతీయ

మిగతా 12వ పేజీలో ▶

న్యాయ నిపుణులతో చర్చిస్తున్నాం..

మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలుకు భారత్ జాగృతి న్యాయపోరాటం: కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల చట్టం తక్షణ అమలు కోసం భారత్ జాగృతి న్యాయపోరాటం చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ మేరకు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని, వారి సలహా మేరకు సుప్రీంకోర్టులో ఈ అంశంపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లో భారత్ జాగృతి తరఫున ఇంప్లీడ్ అవుతామని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తాము పోరాడి సాధించిన మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయించడానికి కూడా మరో పోరాటానికి సిద్ధమైనట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టం తక్షణ అమలుకు పలు రాజకీయ పార్టీలు, సంస్థలు డిమాండ్ చేస్తున్నాయని, ఈ మేరకు ఇప్పటికే పలు సంస్థలు కోర్టుకు వెళ్లాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి, 2024 సార్వత్రిక ఎన్నికల నుంచి రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పాలేరు నుంచి తమ్మినేని

మిర్యాలగూడ అభ్యర్థిగా జూలకంటి



- 14 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం
- మరో మూడు స్థానాల్లో త్వరలో ప్రకటిస్తామన్న తమ్మినేని
- అభ్యర్థుల ప్రకటనతో తమ్మినేనికి ఫోన్ చేసిన భట్టి, జానారెడ్డి
- కాంగ్రెస్‌తో పొత్తు ఉండే అవకాశం ఉందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం పోటీ చేసే అభ్యర్థుల స్థానాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ, మల్లు లక్ష్మి, టి. సాగర్, ఎండీ అబ్బాస్‌తో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధానంగా మూడు నినాదాలతో సీపీఎం ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తుందని వెల్లడించారు. ''మొదటిగా.. సమాజంలో అన్ని వర్గాల హక్కుల కోసం చట్ట సభల్లో పోరాడేందుకు సీపీఎంకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఇవ్వాలని అడుగుతాం. రెండో అంశంగా వామపక్ష అభ్యర్థులను బలపర్చాలని విజ్ఞప్తి చేస్తాం. మూడో అంశంగా.. దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్న బీజేపీకి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు గానీ.. గెలవగలిగే రెండు మూడు స్థానాల్లో కూడా అడ్డుకోవాలని కోరతాం.''అని ఆయన వివరించారు.

పొత్తుపై కాంగ్రెస్‌కు స్పష్టత లేదు

వామపక్షాలతో పొత్తుల విషయంలో కాంగ్రెస్‌కు స్పష్టత లేదని, ఆ పార్టీ తీరు సరిగా లేదని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క సీటు ఇస్తామనీ, ఆ తర్వాత ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పినట్టు సీపీఐ ద్వారా తెలిసిందన్నారు. వామపక్ష ఐక్యతను దృష్టిలో ఉంచుకుని సీపీఐకి కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ ఆ పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో సీపీఎం తమ అభ్యర్థులను పోటీ పెట్టబోదన్నారు.

తమ్మినేనికి భట్టి, జానారెడ్డి ఫోన్

కాగా, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సీనియర్ కాంగ్రెస్ నేత జానారెడ్డిలు తమ్మినేని వీరభద్రానికి ఫోన్ చేసి పొత్తుల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం చర్చిస్తుందని చెప్పారు. పొత్తు ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. మరోవైపు పొత్తుల విషయంపై సీపీఐ.. కాంగ్రెస్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తోంది.

ఎవరెవరు ఎక్కడెక్కడంటే

సీపీఎం తరఫున భద్రాచలం నియోజకవర్గంలో

మిగతా 5వ పేజీలో ▶

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ

5 లో

సీపీఎం మేనిఫెస్టో విడుదల

క్లుప్తంగా...

నామినేషన్ ఫారాల్లో సవరణలు

- తప్పులపై ఎన్నికల సంఘం స్పందన
- మార్పులు చేయాలని ఆదేశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులు దాఖలు చేస్తున్న నామినేషన్ ఫారాల్లో తప్పులు రావడంపై ఎన్నికల అధికారులు స్పందించారు. తెలుగు, ఆంగ్ల నామినేషన్ పత్రాల్లో (2బీ), 3వ భాగంలో సరిచేయాలని ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నామినేషన్ పత్రాల్లో తప్పులు రావడంపై మంచిర్యాలకు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నయీం పాషా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. తప్పులపై ఆదివారం 'సాక్షి'లోనూ కథనం ప్రచురితమైంది. కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం స్పందించింది. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల ఆర్వోలు నామినేషన్ పత్రాల్లో మార్పులు చేయాలని సూచించింది. దీంతో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఇబ్బందులు తొలగనున్నాయి.

నిరంకుశ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

ప్రొఫెసర్ హరగోపాల్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): భూస్వామ్య అహంకారంతో ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన కొనసాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం కూటమికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత్ బచావో తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం 1,200 మంది బలిదానాలు చేశారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో ఆంధ్ర పాలకులు అన్యాయం చేశారని, బంగారు తెలంగాణ నిర్మించుకుందామని వాగ్దానాలు చేస్తూ నమ్మబలికిన నేటి సీఎం కేసీఆర్ యువత, ఉద్యమకారుల త్యాగాలను మరిచి ఉద్యమద్రోహులను అందలం ఎక్కించారని మండిపడ్డారు. భారత్ బచావో కన్వీనర్ గోపీనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పగలు విమర్శలు, చీకట్లో విందులు చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ 'బీసీ సీఎం' ప్రకటన చేయాలి: జాజుల



నాంపల్లి (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కేటాయింపులో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు పోటీపడి రెడ్లు, రావులకు టికెట్లు ఇచ్చి, బీసీలకు అన్యాయం చేశాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'బీసీల రాజకీయ మేథోమధన'సమావేశం జరిగింది. శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జాజుల, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, 20 బీసీ సంఘాల అధ్యక్షులు, వివిధ కుల సంఘాల నేతలు, మేధావులు అన్ని జిల్లాల బీసీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, బీజేపీ 33 టికెట్లు ఇవ్వడంతో పాటు బీసీని సీఎం చేస్తానంటోందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా బీసీని సీఎం చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీలలో కులతత్వం, కుటుంబతత్వం తప్ప సామాజిక న్యాయం ఉండదని, బీసీలు ప్రాంతీయ పార్టీలను నమ్ముకుని ఆగం కావద్దని బీసీలే ఒక రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని ముందుకు పోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు.

నేటి భవితలో..

- బ్యాంక్ జాబ్స్: క్రెడిట్ ఆఫీసర్.. కొలువు అందుకుంటారా! ఎంబీఏ, సీఏ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేశారా.. లేదా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పాటు ఏదైనా బ్యాంకులో పనిచేసిన అనుభవం ఉందా..! అయితే.. బ్యాంకింగ్ రంగంలో మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. వంద క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా.. నియామకాలు ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో..బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల వివరాలు.. ఎంపిక విధానం, వేతనాలు, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..
- గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం– కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం, ఎకానమీ, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు వంటి తాజా పరిణామాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



ఆదివారం కొత్తగూడెంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

ఇక ప్రాంతీయ శకమే

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అభ్యర్థులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

మీ కళ్ల ముందే అభివృద్ధి

'బీజేపీ, కాంగ్రెస్ ఎప్పుడైనా తెలంగాణ జెండా ఎత్తాయా? తెలంగాణ ఉద్యమాన్ని ఎప్పుడైనా భుజాన వేసుకున్నాయా? మనం ఎత్తుకున్నప్పుడల్లా మనల్ని అవమాన పరిచారు. కాల్చి చంపారు..జైళ్లల్లో పెట్టారు. వీళ్లకెందుకు ప్రేమ ఉంటుంది? కాంగ్రెస్ నాయకులకు సొంతం ఉండదు కథ. ఢిల్లీలో స్విచ్ వేస్తేనే ఇక్కడ లైటు వెలుగుతుంది. ఈ ఢిల్లీ గులాముల కింద ఉండి మనం కూడా గులాం అవుదామా? తెలంగాణ రాకముందు 70 ఏళ్ల క్రితం 'నా తల్లి తెలంగాణ రా.. వెలలేని నందనోద్యానమురా'అని ఖమ్మం జిల్లాకు చెందిన కవి రావెళ్ల వెంకటరామారావు పాట రాశారు. ఖమ్మం, కొత్తగూడెం నాడు ఎలా ఉండేవి? ఐదారేళ్లలో ఎలా చేశాం? ఖమ్మం పట్టణం చూస్తే ఇప్పుడు గర్వపడుతున్నా. ఒకనాడు ఇక్కడ పాదయాత్ర చేశా. గోళ్లపాడు ఎట్లా మురికిగా ఉండేది.. ఎన్నేళ్లు ఆ మురికి కంపు భరించాం? లకారం చెరువు ఎంత వికారంగా ఉండేది.. ఇవ్వాళ ఎంత సుందరంగా తయారైంది. అభివృద్ధి మీ కళ్ల ముందే ఉంది..'అని కేసీఆర్ అన్నారు.

సింగరేణిని గాడిలో పెట్టాం.. లాభాలు పెంచాం..

'అప్పట్లో రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి పేరు చెప్పి కేంద్రం నుంచి వేల కోట్ల అప్పులు తెచ్చాయి. వాటిని సకాలంలో చెల్లించలేదు. దానికి బదులు సింగరేణిలో కేంద్రానికి వాటా ఇచ్చారు. ఫలితంగా సింగరేణి సంస్థలో 49 శాతం వాటా కేంద్రానికి వెళ్లింది. తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణిని గాడిలో పెట్టాం. లాభాలను పెంచడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి కూడా సంస్థను తీసుకువచ్చాం. రాష్ట్రంలో కరెంటు కష్టాలు, మంచినీటి వెతలు తీరాయి. గురుకులాలతో విద్యావ్యవస్థ మెరుగైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దళితులను ఓటు బ్యాంకుగానే చూశారు. కానీ మేం ప్రతి దళిత కుటుంబానికి సాయం అందే వరకు దళితబంధు పథకం కొనసాగిస్తాం. ఇవన్నీ విచారించి.. ఆలోచించి మీ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావును గెలిపించాలి..'అని సీఎం విజ్ఞప్తి చేశారు.

మైనార్టీలకు పెట్టిన ఖర్చు చూడండి..

'మనకన్నా ముందు పదేళ్లు కాంగ్రెస్ పాలించింది. మైనార్టీల అభివృద్ధి కోసం కేవలం రూ.900 కోట్లు ఖర్చుచేసింది. ముస్లింలను ఓటు బ్యాంక్‌గా మార్చి ఓట్లు దండుకుంది. మనం తొమ్మిదిన్నరేళ్లలో మైనార్టీల సంక్షేమం కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాం. దీన్ని చూస్తే ఎవరు ఏవిధంగా పనిచేస్తున్నారో అర్థమవుతుంది. మేం అందరినీ కలుపుకొని వెళ్లాలని భావిస్తున్నాం. కేసీఆర్ బతికి ఉన్నంత వరకు ఈ రాష్ట్రం లౌకిక రాష్ట్రంగానే ఉంటుంది. అజయ్‌కుమార్‌ను ప్రేమతో అజయ్‌ఖాన్ పేరుతో పిలుస్తారు. అజయ్‌ను ఆశీర్వదించండి. ఖమ్మంకు న్యాయం చేస్తాడు..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

ఖమ్మంకు వాళ్లిద్దరి పీడ వదిలింది..

'ఖమ్మం జిల్లాలో ఇద్దరు కరటక దమనకులు ఉన్నారని మొన్న సత్తుపల్లి సభలో చెప్పా. పరవస్తు చిన్నయసూరి కథ చదివితే వాళ్లెవరు ఆ కథ ఏంటో తెలుస్తుంది. లేకపోతే మీ తెలుగు మాస్టర్‌ని అడగండి. ఖమ్మానికి వీళ్లిద్దరి పీడ వదిలించాం. ఇవ్వాళ ఖమ్మం శుభ్రంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో మంచి రిజల్ట్స్ రాబోతున్నాయి. ఒకాయన అజయ్ చేతిలో ఓడి మూలకు పడి ఉంటే.. నేను పిలిచి అందరినీ సమన్వయం చేద్దామని మంత్రిని చేసి జిల్లాను అప్పగిస్తే ఆయన సాధించిన ఫలితం గుండుసున్నా. బీఆర్ఎస్ పార్టీ వారిని ఒక్కరినీ అసెంబ్లీ గడప తొక్కనీయనని ఒక అర్భకుడు మాట్లాడుతున్నాడు. ఖమ్మంను గుత్తకు పట్టినవా.. ఖమ్మం జిల్లాకు జిల్లానే కొనేశావా.. ఖమ్మం జిల్లా ప్రజలు దీన్ని సహిస్తరా?..'అంటూ పరోక్షంగా తుమ్మల, పొంగులేటిపై కేసీఆర్ ధ్వజమెత్తారు. ఈ సభల్లో పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావుతో పాటు ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, లింగాల కమల్‌రాజ్, రేగా కాంతారావు, బానోతు హరిప్రియ, బానోతు మదన్‌లాల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వనమా

నేడు పాలమూరుకు కేసీఆర్

4 సభల్లో ప్రసంగించనున్న సీఎం

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ మరోమారు పాలమూరులో పర్యటించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల, అచ్చంపేట, వనపర్తి ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్న ఆయన తాజాగా సోమవారం నాలుగు నియోజకవర్గాల్లో సభలకు హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి తొలుత దేవరకద్రకు చేరుకోనున్నారు. అక్కడి సభలో మాట్లాడిన తర్వాత గద్వాల, మక్తల్, నారాయణపేట సభల్లో ప్రసంగించనున్నారు.

కేసీఆర్ హెలికాప్టర్, వాహనం తనిఖీ

కొత్తగూడెం టౌన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఆదివారం భద్రాద్రి జిల్లా కొత్తగూడేనికి చేరుకోగా ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రకాశం స్టేడియంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు బయలుదేరారు. అ సమయంలో ప్రగతిపథం వాహనాన్ని సైతం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి.రాకేష్, ఐటీ అధికారులు రాజేష్, ఆనంద్, పోలీస్ అధికారులు రమణ, బాలు, గణేష్ తదితరులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.



కొత్తగూడెంలో సీఎం ప్రగతిపథం వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారి



యుద్ధభేరి సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు


ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

మంత్రి హరీశ్‌రావు

కవాడిగూడ (హైదరాబాద్): ఎస్సీవర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఎంఆర్‌పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో ఆర్థిక, రాజకీయ రంగాలలో మాదిగలకు సమానవాటా కోసం డిమాండ్ చేస్తూ ధర్నా చౌక్ వద్ద యుద్ధభేరి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధాని మోదీకి పంపినా కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ, ఎస్సీ వర్గీకరణపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల తరువాత జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని, అప్పుడు ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం రాష్ట్రవ్యాప్తంగా 33 దళిత స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశామని, 50 మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో సదాలక్ష్మి విగ్రహం ఏర్పాటు చేసి, మాదిగ భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖలోని శానిటేషన్, డైట్ విభాగాలలో దళితులకే కాంట్రాక్ట్ కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్(టీఎస్) జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సువర్ణరాజు, మాదిగ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్, ఎంఆర్‌పీఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను జైలుకు పంపడం ఖాయం

పెద్దపల్లి ప్రజా ఆశీర్వాదసభలో బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



పెద్దపల్లిరూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కోట్లాది రూపాయలు దిగమింగిన సీఎం కేసీఆర్‌ను, ఆయన కుటుంబసభ్యులను జైలుకు పంపడం ఖాయమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. రూ.లక్షన్నర కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంగిపోతోందని, అందుకు కల్వకుంట్ల కుటుంబసభ్యులే కారకులని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు అందుబాటులోకి వస్తాయని చెప్పిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావంతులైన నిరుద్యోగ యువతశక్తిని నీరుగార్చారని ఆరోపించారు. ఇప్పుడు ఏం చేయాలో తెలియక విద్యావంతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ ప్రతి ఏటా రంజాన్ పండుగకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసుడే తప్ప మైనారిటీలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించలేనిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇఫ్తార్ విందులు కావు.. న్యాయం కావాలని మైనారిటీలు అడుగుతున్నారని పేర్కొన్నారు. సభలో పార్టీ నాయకులు ఈర్ల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

6 నెలలు... రూ.1.18 లక్షల కోట్లు

- 2023–24 బడ్జెట్ అంచనాల్లో 46 శాతం సమకూరిన ఆదాయం
- పన్ను ఆదాయం రూ. 66 వేల కోట్లపైనే... 74 శాతం మేర లభించిన పన్నేతర ఆదాయం
- అప్పులు రూ.31వేల కోట్లు... రెవెన్యూ ఖర్చు రూ. 91 వేల కోట్లు



సాక్షి, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1.18 లక్షల కోట్ల మేర నిధులు సమకూరాయి. వివిధ వనరుల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 87,207.22 కోట్లుకాగా బహిరంగ మార్కెట్‌లో రూ. 31,333.72 కోట్ల మేర రుణాలను ప్రభుత్వం సేకరించింది. 2023–24 బడ్జెట్ అంచనాల్లో మొత్తం రాబడులు రూ. 2.59 లక్షల కోట్లుకాగా అందులో 46 శాతం మేర అర్ధ వార్షిక కాలంలో వచ్చాయి. ఇందులో పన్ను ఆదాయం రూ. 66,691.49 కోట్లు ఉండగా పన్నేతర ఆదాయం రూ. 16,896.29 కోట్లు వచ్చినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు ప్రభుత్వం ఇచ్చిన ఆరు నెలల నివేదికలో వెల్లడించింది.

ఖర్చు రూ. 1.14 లక్షల కోట్లు

తొలి ఆరు నెలల కాలంలో రూ. 1,18,558.96 కోట్ల మేర రాబడులురాగా అందులో రూ. 1,14,151.39 కోట్లు ఖర్చయిందని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం ఖర్చులో రెవెన్యూ వ్యయం రూ. 91,315.21 కోట్లుగా నమోదవగా ప్రణాళికా వ్యయం కింద రూ. 22,836.18 కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తం వ్యయ అంచనాల్లో ఆరు నెలల కాలంలో జరిగిన ఖర్చు 61 శాతం కావడం గమనార్హం. ఇక సమకూరిన పన్ను ఆదాయాన్ని శాతాలవారీగా పరిశీలిస్తే ఎక్సైజ్ ఆదాయం ఎక్కువగా వచ్చింది. ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ఆదాయ అంచనా రూ. 19,884 కోట్లుకాగా అందులో 62 శాతం అంటే రూ. 12,255.95 కోట్లు మొదటి ఆరునెలల్లోనే వచ్చింది. రానున్న ఆరు నెలల కాలంలో కలిపి అంచనాలను మించి ఎక్సైజ్ ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్ర ఆదాయ వివరాలు

ఆదాయ వనరు	రూ. కోట్లలో
జీఎస్టీ	22,643.80
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	7,006.24
అమ్మకపు పన్ను	14,910.81
ఎక్సైజ్	12,255.95
పన్నుల్లో వాటా	6,102.10
ఇతర పన్నులు	3,772.41
పన్నేతర ఆదాయం	16,896.29
గ్రాంట్ ఇన్ ఎయిడ్	3,619.44



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు

అభివృద్ధి, సుస్థిర పాలనకే మా మద్దతు

- సీమాంధ్రుల పేరుతో తెలంగాణలో కొందరు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు
- 15 అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని పలు పార్టీలను బెదిరిస్తున్నారు
- అలాంటి వారితో మాకు సంబంధం లేదు
- గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: సీమాంధ్రులమని చెప్పుకుంటూ కొందరు తెలంగాణలో కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆరోపించింది. తెలంగాణలో స్థిరపడిన సుమారు 15 లక్షల మంది సీమాంధ్రులు 40 నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేయగలరంటూ తమ పేరుతో కొందరు స్వార్థ రాజకీయాల కోసం వివిధ పార్టీలను 15 అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నారని దుయ్యబట్టింది. అలాంటి వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ. హనుమంతరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, సుస్థిర పాలనకే తమ మద్దతు ఉంటుందన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో విద్వేషాలు రెచ్చగొట్టే వారికి తాము పూర్తి వ్యతిరేకమని తేల్చిచెప్పారు. సెటిలర్స్ అనే పదమే లేదని.. తామంతా తెలంగాణావాసులమేనన్నారు.

విద్య, వైద్యం, ఉపాధి కోసమే తెలంగాణకు..

గ్రేటర్ రాయలసీమ ప్రాంతం (నెల్లూరు, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం) నుంచి తెలంగాణలో దాదాపు 15 లక్షల మంది స్థిరపడ్డారని హనుమంతరెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ఉప్పల్, అంబర్‌పేట్, ముషీరాబాద్, సనత్‌నగర్, నాంపల్లి, రాజేంద్రనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఉప్పల్ నియోజకవర్గాలతోపాటు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ చాలా మంది వ్యాపారాలు, వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని ఆయన వివరించారు. రాష్ట్రం విడిపోయాక అన్నదమ్ముల్లా కలసిమెలసి ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన, కరువుపీడిత ప్రాంతమైన రాయలసీమ నుంచి విద్య, వైద్యం, ఉపాధి కోసం ప్రజలు హైదరాబాద్ సహా తెలంగాణకు వస్తుంటారన్నారు.

మాకూ ఓ భవన్ కట్టివ్వాలి...

గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంస్థ స్థాపించి పదేళ్లు అయ్యిందని... ఇందులో 40 వేల మంది సభ్యులు ఉన్నారని హనుమంతరెడ్డి చెప్పారు. సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొనేందుకు వీలుగా ఇతర ప్రాంతవాసులకు కేటాయించినట్లుగా తమ అసోసియేషన్‌కు సైతం ఒక భవనం తెలంగాణ ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి రాఘవ్, బద్రీనాథ్, నిరంజన్ దేశాయ్, చంద్రశేఖర్‌రెడ్డి, కులేశ్వర్‌రెడ్డి, రాజేష్, రాజశేఖర్ రెడ్డి, రామకృరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.35 లక్షలు పట్టివేత

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం గుంటూరుపల్లిలో ఆదివారం కరీంనగర్ రూరల్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రాజీవ్ రహదారిలోని గుంటూరుపల్లిలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. స్విఫ్ట్ డిజైర్ కారుపై అనుమానం రావడంతో తనిఖీ చేయగా కారు డోర్ల పక్కన దాచిపెట్టిన రూ. 35 లక్షలు పట్టుబడ్డాయి. నగదు తరలిస్తున్న వ్యక్తిని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లికి చెందిన దుగ్యాల సంతోష్‌రావుగా గుర్తించారు. సిమెంట్ బ్రిక్స్ వ్యాపారం కోసం కరీంనగర్ నుంచి నగదు తీసుకెళ్తున్నట్లు సంతోష్‌రావు తెలిపారు. సంతోష్‌రావు పెద్దపల్లి అసెంబ్లీకి పోటీ చేస్తున్న ఓ జాతీయ పార్టీ అభ్యర్థి బంధువు అని తెలిసింది. సంతోష్‌రావుపై కేసు నమోదు చేసి నగదును ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్‌కు అప్పగించినట్లు రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

ఎన్నికలు అనగానే గుంపులుగా వస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తిరుగుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు గుంపులు గుంపులుగా వస్తున్నారు. ప్రజలకు జూటా మాటలు చెప్తున్నారు. ఒక్క బక్కపల్చని కేసీఆర్‌ను ఓడించేందుకు ఇంత మంది రావాల్నా? ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడబోతోంది. కేసీఆరే తిరిగి ముఖ్యమంత్రి కాబోతున్నారు..''అని చెప్పారు. కేసీఆర్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ వాళ్లు డబ్బు సంచులతో తిరుగుతున్నారని.. వాళ్లు పంచే డబ్బులు తీసుకుని, ఓటు మాత్రం కారు గుర్తుపై వేయాలని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని.. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో వారి జీవితాల్లో వెలుగులు నింపిందని చెప్పారు. గత పాలనలో రెండు, మూడు గంటలకు మించి కరెంట్ ఉండేది కాదని.. తెలంగాణ వచ్చాక 24 గంటలు ఇస్తున్నామని వివరించారు.

బీజేపీ నేతలు పోటీకి భయపడుతున్నారు

రాష్ట్రంలో బీజేపీ ఎత్తిపోయిందని.. ఎన్నికలకు ముందే అస్త్ర సన్యాసం చేసిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పోటీకి భయపడుతున్నారన్నారు. ఓటు వేసే ముందు ఒక్క నిమిషం ఆలోచించాలని.. అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే కేసీఆర్ కావాలో, బతుకులను చీకట్లోకి నెట్టే కాంగ్రెస్, బీజేపీ వాళ్లు కావాలో తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కల్వకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్, షాద్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


అమెరికాలో 'వియ్‌వాంట్ కేసీఆర్'..

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని డెలవేర్ రాష్ట్రంలో 'వియ్‌వాంట్ కేసీఆర్'నినాదంతో టెస్లా షో నిర్వహించారు. వరుసగా మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ.. బీఆర్ఎస్ ఎన్నారై యూఎస్ విభాగం సమన్వయకర్త తన్నీరు మహేశ్ ఆధ్వర్యంలో 'గులాబీ జెండాలే రామక్క'పాటతో ఈ టెస్లా లైట్‌షోను ఈగ్రైస్ మెమోరియల్ పార్కులో నిర్వహించారు. పలువురు ఎన్నారైలు మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ప్రశంసించారు.

ఆ వృత్తం.. ఓ వి'చిత్రం'!

అది ఏడున్నర మీటర్ల వ్యాసంతో ఉన్న భారీ వృత్తం.. ఎక్కడా వంకరటింకరగా లేకుండా వృత్తలేఖినితో గీసినట్టు కచ్చితమైన రూపం.. పెద్ద బండరాయి మీద 30 అంగుళాల మందంతో చెక్కటంతో అది ఏర్పడింది.. కానీ అది ఇప్పటిది కాదు, దాదాపు 3 వేల ఏళ్ల నాటిది కావడం విశేషం.

- మేడ్చల్ సమీపంలో గుట్టపై 3 వేల ఏళ్లనాటి భారీ జియోగ్లిఫ్
- ఏడున్నర మీటర్ల వ్యాసంతో కచ్చితమైన గుండ్రని రూపు
- ఇనుప యుగానికి చెందినదిగా భావిస్తున్న పరిశోధకులు



గుట్టపై ఉన్న భారీ వృత్తాన్ని పరిశీలిస్తున్న పరిశోధక బృందం

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగర శివారు ప్రాంతాల్లో కొన్ని గుట్టల్లో ఆదిమానవులు గీసిన రంగుల చిత్రాలు నేటికీ కనిపిస్తాయి. కానీ వాటికి భిన్నంగా ఇప్పుడు గుట్ట పరుపుబండ మీద ఆదిమానవులు చెక్కిన పెద్ద వృత్తం (జియోగ్లిఫ్) చరిత్ర పరిశోధకులను ఆకర్షిస్తోంది. మేడ్చల్ సమీపంలోని మూడు చింతలపల్లి శివారులోని గుట్ట మీద ఇది వెలుగు చూసింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు కె.గోపాల్, మహ్మద్ నజీరుద్దీన్, అన్వర్ బాషా, అహోబిలం కరుణాకర్‌లు ఇచ్చిన సమాచారం మేరకు చరిత్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆ బృందంతో కలసి దాన్ని పరిశీలించారు. 'తక్కువ ఎత్తున్న గుట్ట పరుపుబండపై ఈ వృత్తం చెక్కి ఉంది. ఏడున్నర మీటర్ల వ్యాసంతో భారీగా ఉన్న ఈ వృత్తం మధ్యలో రెండు త్రిభుజాకార రేఖా చిత్రాలను కూడా చెక్కారు. అంత పెద్దగా ఉన్నప్పటికీ వంకరటింకరలు లేకుండా ఉండటం విశేషం. దీనికి సమీపంలో కొత్త రాతియుగం రాతిగొడ్డళ్లు నూరిన గాడులు (గ్రూవ్స్) ఉన్నాయి. ఇప్పటి వరకు తెలంగాణలో ఈ తరహా చెక్కిన రేఖా చిత్రం వెలుగుచూడకపోవటంతో దీనిపై మరింతగా పరిశోధించాల్సి ఉంది'అని శివనాగిరెడ్డి పేర్కొన్నారు.

సమాధి నమూనా అయ్యుండొచ్చు..

ఈ చిత్రం ఇనుప యుగానికి చెందిందిగా భావిస్తున్నాం. అప్పట్లో మానవుల సమాధుల చుట్టూ వృత్తాకారంలో పెద్ద రాళ్ల వరుసను ఏర్పాటు చేసేవారు. ఆ సమాధి నిర్మాణానికి నమూనాగా ఈ వృత్తాన్ని గీసి ఉంటారన్నది మా ప్రాథమిక అంచనా. గతంలో కర్ణాటకలో ఇలాంటి చిత్రం కనపించింది. దాని మధ్యలో చనిపోయిన మనిషి ఉన్నట్లు చిత్రించి ఉంది. ఈ చిత్రాన్ని మరింత పరిశోధిస్తే కొత్త విషయాలు తెలుస్తాయి.

– రవి కొరిశెట్టార్, పురావస్తు నిపుణుడు

క్లుప్తంగా...

ఫేస్‌బుక్ యాడ్స్‌లో ఫేక్ లోన్‌యాప్స్

నమ్మి మోసపోవద్దని సైబర్ భద్రతా నిపుణుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ మోసాలకు తెరతీసేందుకు సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. తాజాగా ఫేక్ లోన్ యాప్‌లను ఫేస్‌బుక్‌లో యాడ్స్ రూపంలో పంపుతున్నట్లు సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో వచ్చే ఆన్‌లైన్ లోన్‌యాప్‌లలో నిమిషాల్లోనే మీ బ్యాంకు ఖాతాల్లో రుణం మొత్తం జమ చేస్తామంటూ నమ్మబలుకుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఫేస్‌బుక్ వినియోగదారులను టార్గెట్ చేస్తూ ఈ తరహా ప్రకటనలు ఇస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణానికి వడ్డీ కూడా అతి స్వల్పం అని ఊదరగొడుతున్నారన్నారు. ఇలా వారి వలకు చిక్కే అమాయకుల నుంచి ప్రాథమిక వివరాల కోసం అంటూ ఆధార్‌కార్డు, పాన్‌కార్డుల వివరాలు సేకరిస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దీపావళి సందర్భంగా హైదరాబాద్–కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు హైదరాబాద్–కటక్ (07165/07166) ప్రత్యేకరైలు ఈ నెల 7, 14, 21 తేదీల్లో రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మర్నాడు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 8, 15, 22 తేదీ ల్లో రాత్రి 10.30 గంటలకు కటక్ నుంచి బయల్దేరి మర్నాడు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

బంగారు తెలంగాణ కాదు..'బార్ల' తెలంగాణ

బీఆర్‌ఎస్ పాలనపై టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం వ్యాఖ్య



సైదాపూర్ (హుస్నాబాద్): కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా అభివృద్ధి చేస్తామన్న బీఆర్‌ఎస్ పాలకులు 'బార్ల'తెలంగాణగా మార్చారని, బడులు మూసి, బార్లు తెరుస్తున్నారని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సబ్బండవర్గాల పోరాటం, 1,200 మంది విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబంలో బందీ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు బైబై చెప్పి, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం జాగీర్‌పల్లిలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. కేసీఆర్ తానే ఇంజనీర్ అని, కాళేశ్వరం ప్రాజెక్టు తన మానసపుత్రిక అని రూ.లక్షల కోట్లతో నిర్మాణం చేస్తే.. మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని భావించి వందలమంది విద్యార్థులు ఉద్యమ సమయంలో బలిదానాలు చేశారని, పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని అన్నారు. తెలంగాణలో పకడ్బందీగా అమలవుతున్న పథకం లిక్కర్ మాత్రమే అని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, ప్రొఫెసర్ వీరన్ననాయక్, జిల్లా సాధన కమిటీ సభ్యులు పి.వెంకట్రాజం, కొత్త మధుసూదన్‌రెడ్డి, వేల్పుల రత్నం, సదానందం, శేఖర్ పాల్గొన్నారు.

ఏటా కొత్త వ్యాధికారకం!

మూడు దశాబ్దాల్లో 30 వ్యాధికారకాల ఉద్భవం


వాటిలో ఎక్కువ శాతం వ్యాధికారకాలు జంతువుల నుంచి వచ్చినవే

ఏకీకృత కార్యాచరణతోనే అరికట్టవచ్చంటున్న డబ్ల్యూహెచ్‌వో

సాక్షి, హైదరాబాద్: మానవాళికి అంటువ్యాధుల ముప్పు క్రమంగా పెరుగుతోంది. కోవిడ్–19 వైరస్ వ్యాప్తి కారణంగా యావత్ ప్రపంచమంతా దాదాపు మూడేళ్లపాటు అతలాకుతలమైంది. వందల ఏళ్లుగా ఈ వ్యాధికారకాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రస్తుతం వాటి సంఖ్య మరింత ఎక్కువవుతోందని శాస్త్రవేత్తలు ఆందోళన చెబుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో ఏకంగా 30 రకాల వ్యాధికారకాలు ఉద్భవించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పరిశోధనలో తేలింది. ఈ లెక్కన ఏటా సగటున ఒక వ్యాధికారకం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ వ్యాధికారకాల ఉద్భవంలో అత్యధికం జంతువుల నుంచే కావడం గమనార్హం.

అడవుల నరికివేత, జంతువుల వలసలు...

అంటువ్యాధుల కారకాలపై డబ్ల్యూహెచ్‌వో ఎప్పటికప్పుడు పరిశోధనలు చేస్తూనే ఉంది. ప్రధానంగా జంతువుల నుంచే వ్యాపిస్తున్నవి 60 శాతంగా ఉంటున్నట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అడవుల నరికివేత వల్ల జంతువుల వలసలు పెరగడంతోపాటు అటవీ జంతువులను ఆహారంగా మార్చుకోవడం, జంతు ఉత్పత్తుల వాడకంతో ఈ పరిస్థితులు ఎదురవుతున్నట్లు డబ్ల్యూహెచ్‌వో గుర్తించింది. మనుషుల ఆహార జాబితాలో గతంలో శాకాహార జంతువులే ఉండగా క్రమంగా మాంసాహార జంతువులూ చేరాయి. శాకాహార జంతువులతో పోలిస్తే మాంసాహార జంతువుల జీర్ణవ్యవస్థ పూర్తి భిన్నంగా ఉంటుంది. ఆహార అరుగుదల కోసం ఉపయోగపడే బ్యాక్టీరియా, ఇతరత్రా మానవ శరీరానికి ప్రమాదకారిగా మారుతున్న సందర్భాలు



న్నాయి. కోవిడ్–19 వైరస్ ఇదే తరహాలో ఉద్భవించిందనే వాదనలు సైతం ఉన్నాయి. ఎబోలా, రేబిస్ మొదలైన వైరస్‌లు ఈ కోవకు చెందినవే.

కట్టడి కోసం 'వన్ హెల్త్'..

డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం 2003 నుంచి ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధుల కారణంగా కోటిన్నరకుపైగా మరణాలు సంభవించాయి. అలాగే ప్రపంచ దేశాలు 4 ట్రిలియన్ డాలర్ల నష్టాన్ని మూటగట్టుకున్నాయి. జంతువుల నుంచి వచ్చే వ్యాధికారకాలను ఎదుర్కొనేందుకు, వాటిని నిలువరించేందుకు డబ్ల్యూహెచ్‌వో వన్‌హెల్త్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ, జంతు సంరక్షణ సంస్థలు, వైద్య నిపుణులు, వెటర్నరీ నిపుణులు కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ కార్యక్రమాల వల్ల జంతు వ్యాధికారకాలను నిలువరించవచ్చని డబ్ల్యూహెచ్‌వో చెబుతోంది. అంతేకాకుండా ఆర్థికపరమైన భారం కూడా తగ్గుతుందని భావిస్తోంది.

> **కోవిడ్‌పై పోరులో 28 విభాగాల కృషి**
>
> 
>
> కోవిడ్–19 వ్యాప్తి తర్వాత ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెరిగింది. కోవిడ్ టీకాల కోసం దేశంలో 28 విభాగాలు సమన్వయంతో పనిచేసి అద్భుత ఫలితాలు సాధించాయి. పర్యావరణం, మొక్కలు, జంతువులు, మానవాళి మధ్య సంబంధాల్లో సమతౌల్యం ఎప్పుడూ పాటించాలి. దాని అమలుకు సంబంధించినదే వన్ హెల్త్ విధానం. డబ్ల్యూహెచ్‌వో రూపొందించిన ఈ విధానం వల్ల ఆర్థికంగా కలిసిరావడంతో పాటు ఎక్కువ ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న ఈ అంశం అన్ని దేశాలు పూర్తిస్థాయిలో అమలు చేసే స్థాయికి చేరుకుంటాయని ఆశిస్తున్నా.
>
> – డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కమిటీ కన్వీనర్

సందడిగా హైదరాబాద్ హాఫ్ మారథాన్



బహుమతులు అందించిన సచిన్ టెండూల్కర్

గచ్చిబౌలి: ఏజీఎస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో హాఫ్ మారథాన్ (21.1 కి.మీ)ను జెండా ఊపి క్రికెట్ దిగ్గజం, ఏజీఎస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాండ్ అంబాసిడర్ సచిన్ టెండూల్కర్ ప్రారంభించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ జంక్షన్, విప్రో జంక్షన్, గచ్చిబౌలి స్టేడియం వరకు రన్ సాగింది. హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో బోడుపల్లి రమేష్ చంద్ర, మహిళల విభాగంలో ప్రజక్త ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సచిన్ టెండూల్కర్ మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా రన్నింగ్ చేస్తే ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ, రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, ఏజీఎస్ ఫెడరల్ సంయుక్తంగా 10 వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 50 కి.మీ రన్...

ఈ సందర్భంగా నగరంలో దేశంలోనే మొదటి సారిగా నిర్వహించిన ఐఏయూ 50 కి.మీ ప్రపంచ చాంపియన్‌షిప్ 2023లో చాకిబ్ లచ్గర్ లాట్రేచే (2:48:20), మహిళా విభాగంలో కార్లా మోలినారో (3:18:23) ప్రపంచ ఛాంపియన్‌లుగా నిలిచారు. పురుషుల విభాగంలో అలెజాండ్రో జిమెనెజ్ వైసెంటె (2:49:30), జీసస్ ఏంజెల్ (2:50:12) ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రపంచ చాంపియన్‌లుగా నిలిచారు. మహిళా విభాగంలో ఆండ్రియా పోమరన్స్కి (2:19:07), సారా వెబ్‌స్టర్ (3:20:07) తర్వాత స్థానాల్లో విజేతలుగా నిలిచారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

ఘట్‌కేసర్: హిందూ, ముస్లింల పండగలు ఒకే రోజు వచ్చినా ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవడం సీఎం కేసీఆర్ సమర్థవంతమైన, శాంతియుతమైన పాలనకు నిదర్శనమని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని కరీంగూడ చౌరస్తాలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ చేస్తున్న కృషిని గుర్తించి బీఆర్‌ఎస్ అభ్యర్థికే ఓటేయాలని కోరారు. కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి తను ఎంతగానో కృషి చేశానన్నారు.

విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

ఉప్పల్: విశ్వకర్మల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి ఆత్మగౌరవ భవన నిర్మాణ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనా చారి మాట్లాడుతూ విశ్వకర్మ బంధు పథకం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ విశ్వకర్మలకు ఆధునిక పరిజ్ఞానం అందిస్తే చైనా బజార్‌లు ఇండియా బజారులుగా మారుతాయన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం విశ్వకర్మల కోసం ఐదు ఎకరాల విలువైన స్థలాన్ని కేటాయించడం గొప్ప విషయమన్నారు. విశ్వకర్మల హక్కుల సాధన కోసం తన వంతుగా అండగా నిలుస్తానన్నారు. విశ్వబ్రాహ్మణ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్



సభలో అభివాదం చేస్తున్న నేతలు

ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలని, 50 సంవత్సరాలు నిండిన విశ్వ బ్రాహ్మణులకు పెన్షన్ స్కీం వర్తింప చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షులు వేముల వాడ మదన్‌మోహన్, తల్లోజు ఆచారి, రాళ్లబండి విష్ణు చారి, చొల్లేటి కృష్ణమాచారి, బీసీ కమిషన్ సభ్యులు చిట్టనోజు ఉపేంద్రాచారి, అమరవాది ప్రభాకర చారి, నర్సింహాచారి, కుందారం గణేశ్‌చారి, రవీంద్రా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలంటే వ్యాపారం కాదు.. సేవగా భావించాలి

మాజీ ఎమ్మెల్యేల సత్కార సభలో వక్తలు

సనత్‌నగర్: గత 20 సంవత్సరాల క్రితం రాజకీయం అంటే ఒక సేవగా, నిరంతరం ప్రజల కోసం పనిచేసే ఒక మహోజ్వల కార్యంగా ఉండేదని పలువురు వక్తలు అన్నారు. కానీ నేడు రాజకీయం అంటే ఒక వ్యాపారంగా మారిందని, డబ్బున్న వారే రాజకీయాల్లోకి వస్తున్నారన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో నీతి, నిజాయితీగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యేల ఆత్మీయ సత్కార కార్యక్రమం ఆదివారం బేగంపేట హరితాప్లాజా హోటల్‌లో జరిగింది. రామాయంపేట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే సురేందర్‌రావులను సన్మానించారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌లు అతిథులుగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు రాజకీయం అంటే పవిత్రమైన కార్యంగా ఉండేదని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నీతిగా, నిజాయితీగా పనిచేసేవారన్నారు. యువతీ యువకులు, మేధావులు, చదువుకున్న వాళ్లు రాజకీయాల్లోకి రావాలన్నారు. ఇప్పుడు ఉన్న పార్టీలు కూడా వారికి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, సెలక్షన్ కమిటీ చైర్మన్ దన్నపునేని అశోక్‌కుమార్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటరు చైతన్యమే పరమావధి.. అదే మా ప్రధాన విధి!

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 30న జరగనున్న నేపథ్యంలో ఓటర్లను చైతన్యం చేసే దిశగా ఎన్నికల సంఘం నగరంలో ప్రచారం ముమ్మరం చేసింది. 'అందరం తప్పక ఓటు వేద్దాం.. తోటివారిని కూడా ఓటు వేసేలా ప్రోత్సహిద్దాం' అనే స్లోగన్ రాసి ఉన్న పోస్టర్లను ఆదివారం ఆటోల వెనక భాగంలో సిబ్బంది అంటిస్తూ కనిపించారు.

మీరే మా అతిథులు!

- నగరంలో జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు నేతల ఫీట్లు
- కార్నర్ మీటింగ్‌లు, విందు, వినోదాలతో సభలు
- ఆదివారం కిటకిటలాడిన ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు




సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో ఇరువై నాలుగు రోజుల్లో ఓటరు తన తీర్పును వెలువరించేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో వివిధ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. గల్లీ సభలు, ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లతో కిర్రాక్ పుట్టిస్తున్నాయి. ఫంక్షన్ హాళ్లలో విందులు, వినోదాలతో వేడుకలను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం నగరంలోని పలు ఫంక్షన్ హాళ్లలో పార్టీ సమావేశాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు, విందులు ఏర్పాటు చేశారు. మరోవైపు త్రీస్టార్ హోటళ్లు, రెస్టారెంట్‌లు, బిర్యానీ సెంటర్‌లు సైతం కిటకిటలాడాయి. సాధారణ ప్రజలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అనుచరణ గణాలతో అన్ని చోట్లా రద్దీ నెలకొంది. నాయకులు, అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఎక్కడికక్కడ కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ఆశల పల్లకిలో...

ప్రస్తుత ఎన్నికల వేళ ఓటర్లు కోరిందల్లా ఇచ్చేందుకు తాము సిద్ధమని నాయకులు ప్రకటిస్తుండగా.. ఎన్నో ఏళ్ల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తే తప్ప ఓటు వేయబోమంటూ ప్రజలు భీష్మించుక్కూర్చుంటున్నారు. దీంతో ఓటర్లను బుజ్జగించే కార్యక్రమాలు కూడా జోరుగా సాగుతున్నాయి. డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఏళ్ల తరబడి పడిగాపులు కాసిన జనం రాతపూర్వకమైన హామీ ఇస్తే తప్ప ఓటేయబోమంటూ నాయకులకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. మరోవైపు కొండమీది కోతినైనా తెచ్చి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసానిస్తున్న నాయక మహాశయులు కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, కులాల వారీగా వివిధ సంఘాల నాయకులతో రాతపూర్వమైన హామీ పత్రాలను తీసుకుంటున్నారు. ఇరువైపులా ఎన్నికల క్రీడ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇంచుమించు మరో ఇరువై మూడు రోజుల పాటు సాగనున్న ఈ వినోదభరితమైన ఆటకు కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్‌హాళ్లు, స్థానిక నేతల ఇళ్లు వేదికలవుతున్నాయి. యథావిధిగా అన్ని చోట్ల గుట్టుచప్పుడు కాకుండా మద్యం గుప్పుమంటోంది.

ఓటరు ఎటు వైపో...

నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్ని వర్గాల ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అనుచరులు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు.ఏ పార్టీ నాయకులు పలకరించినా తన ఓటు మీ పార్టీకే అంటూ చల్లగా సెలవిస్తున్న ఓటర్లు చివరి నిమిషంలో ఎటువైపు మళ్లుతారోననే ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది. తమ గెలుపు నల్లేరు మీద బండి నడక అనే ధీమాతో ఉన్న నాయకాగ్రేసరులు సైతం కొద్ది రోజులుగా సందిగ్ధావస్థలో ఉన్నారు. ఇప్పటి నుంచి ఎంత ప్రచారం చేసినా, గల్లీలు, బస్తీలు వడపోసినా చివరి సమయం కీలకం కావడంతో చాలామంది 'పోల్ మేనేజ్‌మెంట్'పై ఆశలు పెట్టుకొని ప్రచారానికి బయలుదేరడం గమనార్హం.



మనకు రెండు చెవులు, ఒక నాలుక ఎందుకున్నాయంటే – ఎక్కువ విని, తక్కువ మాట్లాడటానికి!

– డైయోజినీజ్

సాక్షి

సోమవారం, 6 నవంబర్ 2023

కాలాన్ని గెలిచినవాడు

గతం అనేది ఎక్కడుంది? గతంలో జీవించిన మనుషులు కాలపు పొరల్లో ఎక్కడ చిక్కుకుని ఉన్నారు? గత సంఘటనలు ఏ కాలగర్భంలో వెచ్చగా దాగి ఉన్నాయి? గతం తాలూకు ఆలంబన అంటూ లేకపోతే మనిషికి వర్తమానంలో ఉన్నదేమిటి? గతం అనేది మనిషి యావజ్జీవితపు ధ్రువపత్రం. కానీ గతాన్ని వర్తమానంలోకి లాగే మంత్రదండం ఎక్కడుంది? జ్ఞాపకం ద్వారా మాత్రమే గతాన్ని చైతన్యవంతం చేయగలం. కానీ ఆ జ్ఞాపకం స్వచ్ఛందంగా మనసులోకి దూకాలి. అలా దూకాలంటే ఇంద్రియాలను ఏదో కదిలించాలి. అది 'బలమైనదే' కానక్కరలేదు. బలంగా ముద్ర వేసినదైతే చాలు. అనుకోకుండా ఒక చలికాలం పూట వెచ్చదనం కోసం అమ్మ ఇచ్చిన టీ కప్పులో 'మడలీన్' అనే చిన్న గుండ్రపాటి కేకును అద్దుకోగానే, ఆ మొదటి రుచి అంగిలికి తాకగానే, ఎప్పుడో చిన్నతనంలో తాము నివసించిన 'కోంబ్రే'లో అనుభవించిన అదే రుచి మార్సెల్ ప్రూస్ట్‌కు చప్పున గుర్తొస్తుంది. ఆ వెనువెంటనే బాల్యంలో తిరగాడిన ఆ ఊరు, ఆ మనుషుల తాలూకు జ్ఞాపకాలు జలజలా రాలుతాయి. ఇక కాలంలో వెనక్కి ఈదుకుంటూ వాళ్ల కుటుంబీకుల పుట్టుపూర్వోత్తరాలు ఏకధారగా వల్లెవేయడానికి కూర్చుంటాడు. అలా గతాన్ని స్వగతంగా మార్చుకోవడం ద్వారా ఇరవయ్యో శతాబ్దపు అత్యంత విస్తారమైన ఆత్మకథాత్మక నవలారాజం 'ఇన్ సెర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్' సాహిత్యలోకానికి అందింది. సుమారు నాలుగు వేల పేజీలున్న ఈ నవల 1913 నుంచి 1927 మధ్య ఏడు భాగాలుగా ప్రచురితమైంది.

ఏ రచయితకైనా గతమే పెట్టుబడి. కానీ ప్రత్యేకించి ఆ గతంలో జీవిత పరమార్థాన్ని అన్వేషించడంలోనే ప్రూస్ట్ రచనా వైభవం దాగివుంది. కాలం అనే విధ్వంసక శక్తిని కళ అనే సాధనంతో ఆయన ఎదుర్కొన్నాడు. కాలంలో కలిసిపోయిన వారిని సాహిత్యం ఊతంగా సజీవ మూర్తులుగా నిలబెట్టాడు. సమకాలీన ఫ్రెంచ్ సమాజపు రీతులు, బాధలు, భయాలు, తపనలు, ఒంటరితనాలు, సరదాలు, సంతోషాలు, నిర్దయలు, క్షమలు, ఇంకా ఆయన సంక్లిష్ట లైంగికేచ్ఛలు అన్నీ అక్షరాల్లోకి తెచ్చాడు. కిటికీలోంచి సముద్రం మీద కనబడే సూర్యోదయాన్ని చూస్తూ అనుభవించే తన్మయత్వంలా రాతను మలిచాడు. చరిత్రకారుడు, తాత్వికుడు, మానసిక శాస్త్రజ్ఞుడు, రాజకీయాంశాల వ్యాఖ్యాత, ఇంకా 'పర్వర్ట్', ఇంకా ఒక కవి– ఇలా ఆరుగురు ప్రూస్టులు ఇందులో కనబడతారంటారు ఆడమ్ గోప్నిక్. సంగీతం, సాహిత్యం, యుద్ధం, సమాజం, పెయింటింగ్, శృంగారం, కళలు, అసూయ, ఫ్యాషన్లు– ఇలా ప్రూస్ట్ అభిప్రాయానికి చిక్కకుండా మిగిలిపోయేది ఏదీ ఉండదు. 'తన జీవితపు మెటీరియల్‌ను ఇంత బాగా ఏ రచయితా వాడుకోలేదు' అంటారు టెన్నెస్సీ విలియమ్స్. 'ఒక రచయిత ఒకసారి చదివితే పూర్తయ్యేట్టయితే ఆ రచయిత పెద్దగా ఏమీ చెప్పనట్టు! హోమర్‌లాగా జీవితకాలం వెంటతెచ్చుకోగలిగే రచయిత ప్రూస్ట్' అంటారు డేనియల్ మెండెల్‌సన్.

కలిగిన ఫ్రెంచ్–యూదు కుటుంబంలో పుట్టాడు మార్సెల్ ప్రూస్ట్ (10 జూలై 1871– 18 నవంబర్ 1922). ఐఫిల్ టవర్‌ను నిర్మించిన ఇంజినీర్ గుస్తావ్ ఐఫిల్... ప్రూస్టులకు సన్నిహితుడు. తొమ్మిదో ఏట నుంచే ప్రూస్టుకు ఉబ్బసంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలుండేవి. ప్యారిస్ ఉన్నత సమాజంలో ముందు కలియ తిరిగినప్పటికీ రానురానూ ఏకాంతంలోకి వెళ్లిపోయాడు. బయటి నుంచి వచ్చే పెద్ద శబ్దాలను కూడా భరించేవాడు కాదు. హైపర్ సెన్సిటివ్. అందుకే పగలు పడుకొని రాత్రుళ్లు రాయడం అలవాటు చేసుకున్నాడు. 'నిశాచర సరస్వతి!'. కల్పనతో కూడిన తన ఆత్మకథలోని మొదటి భాగమైన 'స్వాన్స్ వే'ను ఎవరూ ప్రచురించడానికి ముందుకు రాలేదు. దాంతో సొంత డబ్బుతో అచ్చు వేయించుకున్నాడు. దాన్ని తిరస్కరించినవారిలో అప్పటి ప్రఖ్యాత రచయిత ఆంద్రే గిదె కూడా ఒకరు. 'నా జీవితంలో నేను చేసిన అత్యంత పెద్ద తప్పిదం' అని ఆయన తర్వాత పశ్చాత్తాపపడ్డారు. తన మృత్యువు సమీపంలో ఉందని ప్రూస్ట్‌కు తెలుసు. తన రచన ఎక్కడ పూర్తవ్వదో అనే ఆందోళన ఉండేది. నాలుగు భాగాలు ప్రూస్ట్ బతికి ఉన్నప్పుడే వచ్చాయి. ఆయన రాసుకున్న డ్రాఫ్టుల ఆధారంగా తర్వాతి మూడు భాగాలు ఆయన తమ్ముడు రాబర్ట్ ప్రూస్ట్, రచయిత జాక్వెస్ రివియేరీ సంపాదకులుగా వచ్చాయి. ఇందులో ఐదో భాగం అయిన 'ద ప్రిజనర్' సరిగ్గా నూరేళ్ల కింద 1923లో వచ్చింది. ఇది అనారోగ్యంతో ప్రూస్ట్ చనిపోయాక విడుదలైన మొదటి భాగం.

ఇప్పుడు ఆంగ్లంలో ప్రామాణిక అనువాదంగా పరిగణిస్తున్నది బ్రిటిషర్ అయిన సి.కె.స్కాట్ మాంక్రీఫ్ చేసినది. ఆయన పెట్టిన పేరు 'రిమెంబ్రన్స్ ఆఫ్ థింగ్స్ పాస్ట్'. చాలా ఏళ్లు ఈ పేరుతోనే వ్యాప్తిలో ఉన్నప్పటికీ, ఈ అనువాదానికి తర్వాత మెరుగులు దిద్దినవారిలో ఒకరైన డి.జె.ఎన్‌రైట్ నవల పేరును 'ఇన్ సెర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్'గా మార్చారు. ఈ శీర్షికే ప్రూస్ట్ మానసిక ప్రపంచానికి దగ్గరగా ఉండి, స్థిరపడిపోయింది. ప్రూస్ట్ ఇల్లియర్స్ అనే చోట తన చిన్నతనం గడిపాడు. దాని ఆధారంగానే 'కోంబ్రే'ని సృష్టించాడు. 1971లో ప్రూస్ట్ శతాబ్ది సందర్భంగా దానికి 'ఇల్లియర్స్–కోంబ్రే'గా నామకరణం చేసి రచయిత పట్ల గౌరవం చాటుకున్నారు. జీవితం లోంచి సాహిత్యంలోకి వచ్చిన పేరు, మళ్లీ సాహిత్యం లోంచి జీవితంలోకి వచ్చింది. ఒక కొత్త మనిషిని అర్థం చేసుకోవడానికి పాత్రికేయులు 'ప్రూస్ట్ ప్రశ్నావళి'(ప్రూస్ట్ క్వశ్చనెయిర్) అని అడుగుతుంటారు. మన జీవితానికి దగ్గరగా వెళ్లాలంటే– నేనెవరు? ఈ జీవితంతో ఏం చేసుకోవాలి? అనే ప్రశ్నలను అన్వేషిస్తూ జీవిత సాగరాన్ని అన్వేషించిన ప్రూస్టియన్ ప్రపంచంలోకి వెళ్లాలి.

మంకుపట్టుకు మనస్సాక్షి విడుపు

కామెంట్



కరణ్ థాపర్

గాజాలో చిక్కుకుపోయిన 23 లక్షల మంది పాలస్తీనియన్‌ల పట్ల ఇజ్రాయెల్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వేలాది మంది లండన్ వీధులలోకి రావడం చూసినప్పుడు ప్రజాస్వామ్యంలోని మిక్కిలి 'సుందరమైన' దృశ్యాలలో ఇది ఒకటి అనిపిస్తుంది. ప్రదర్శనకారుల సంఖ్య భిన్నంగా ఉండొచ్చు కానీ, ఇదే విధమైన ర్యాలీలు ప్యారిస్, బెర్లిన్ లాంటి నగరాలలోనూ జరిగాయి. యు.ఎస్.లో జరిగిందైతే ఎంతో హృదయగతమైనది. 'జూయిష్ వాయిసెస్ ఫర్ పీస్' సంస్థ ఆధ్వర్యంలో అమెరికన్ కాంగ్రెస్‌లోనూ, గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లోనూ స్థానిక యూదులు భారీ ప్రదర్శన చేపట్టారు. అంతస్సాక్షి శక్తికి అదొక ధ్రువీకరణ. ఈ నిరసనలు దేనినైనా మారుస్తాయా? జరగబోయే అకృత్యాలను ఆపగలవా? ఏమో! అయినప్పటికీ నిరసనలు అవసరమైనవి.

ప్రజాస్వామ్యంలోని మిక్కిలి సుందరమైన దృశ్యాలలో ఒకటి – ఈ 'సుందరమైన' అనే విశేషణాన్ని నేను ఉద్దేశపూర్వకంగానే ఉపయోగిస్తున్నాను – పదులు లేదా వందల వేలమంది తాము సహించరాని అన్యాయంగా భావిస్తున్న దానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసనను వ్యక్తం చేయడం. ఆ నిరసనకు మీ సొంత ప్రభుత్వం దారి ఇచ్చిందా లేక ప్రపంచంలోని మరొక చివరన అది మలుపు తిరిగిందా అన్నది విషయమే కాదు. అదొక మూకుమ్మడి నైతిక వివేచనను రేకెత్తించిందన్నది, మానవుల ఆత్మను కదిలించిందన్నది ముఖ్యం. నిజానికి అది వారి ఉనికి యొక్క లోతు. అందుకే వారి స్పందన మానవత్వానికి సహేతుకమైన సమర్థన. అది మానవులను జంతువుల కన్నా ఉన్నతంగా ఉంచుతుంది.

గాజాలో చిక్కుకుపోయిన 23 లక్షల మంది పాలస్తీనియన్‌ల పట్ల ఇజ్రాయెల్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వందల వేల మంది లండన్ వీధులలోకి రావడం చూసినప్పుడు నాలో ఈ ఆలోచన మెదిలింది. ప్రదర్శనకారుల సంఖ్య భిన్నంగా ఉండొచ్చు కానీ, ఇదే విధమైన ర్యాలీలు పారిస్, బెర్లిన్, అమెరికా నగరాలలోనూ జరిగాయి.

వాస్తవానికి యు.ఎస్.లో జరిగిందైతే ఎంతో హృదయగతమైనది. 'జూయిష్ వాయిసెస్ ఫర్ పీస్' ఆధ్వర్యంలో అమెరికన్ కాంగ్రెస్‌లోనూ, అలాగే గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లోను స్థానిక యూదులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. అంతస్సాక్షి శక్తికి అదొక ధ్రువీకరణ. ఈ సందర్భంలోనైతే అది విశ్వాసాల వెన్నుదన్నులను కలుపుకున్న మతం పట్టు కంటే గట్టిది.

నన్ను తప్పుగా అనుకోకండి. అక్టోబర్ 7న హమాస్ ఏదైతే చేసిందో అది అనాగరికమైనది, క్రూరమైనది, ఏమాత్రం క్షమార్హం కానిది. అయితే ఒక నెల తర్వాత అది అర్ధసత్యం మాత్రమే. హమాస్ దాడికి ప్రతిచర్యగా ఇజ్రాయెల్ 9,200 మంది ప్రాణాలను బలి తీసుకుంది. 22,000 మందిని గాయపరిచింది. మృతులలో సలభై శాతం మంది చిన్నారులే. విద్యుత్తు, నీరు, ఇంధనం, ఆహారం అందకుండా చేస్తూ వస్తున్న కొన్ని వారాల దారుణమైన వైమానిక దాడుల తర్వాత ఇప్పుడు రెండవ దశ భూతల దాడులు ప్రారంభమయ్యాయి.

నిరసనకారులు అడుగుతున్నది చాలా సరళమైనదనీ, సూటి అయినదనీ నేను ఊహించగలను. శిక్ష, ప్రతీకారం సమర్థనీయం అయినప్పటికీ ఇది చాలాదూరం వెళ్లలేదా? చాలాకాలం అయిపోలేదా?

ఉత్తర గాజాలో ఉన్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండటం కోసం దక్షిణం వైపునకు తరలి వెళ్లాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. కానీ అలా వెళ్లినవారు తలదాచుకున్న దక్షిణ ప్రాంతాలైన ఖాన్ యూనిస్, రాఫాల పైన కూడా బాంబులు కురిపించడం మొదలుపెట్టింది. 'అల్ జజీరా' ప్రతినిధి కుటుంబం నుసిరత్ శరణార్థి శిబిరంపై జరిగిన దాడిలో మరణించింది.



పాలస్తీనాకు అనుకూలంగా న్యూయార్క్ 'గ్రాండ్ సెంట్రల్ స్టేషన్'లో యూదుల ప్రదర్శన

గాజా నగరంలో 600 మంది మాత్రమే పట్టే సామర్థ్యం గల షిఫా ఆసుపత్రి ఇప్పుడు బాంబు దాడుల నుంచి తప్పించుకోడానికి అక్కడికి చేరిన 20,000 మందితో కిక్కిరిపోయిందనీ; శిథిలాలు, మురుగు నీరును మాత్రమే తాము చూడగలుగుతున్నామనీ అక్కడి వైద్యులు చెబుతున్నారు. మత్తుమందు లేకుండానే ఆసుపత్రి కారిడార్ నేలపైన శస్త్రచికిత్సలు జరుగుతున్నట్లుగా కూడా నివేదికలు అందుతున్నాయి. అదే నగరంలోని అల్ ఖుద్స్ ఆసుపత్రికి – నేరుగా వైమానిక దాడులకు గురి అయ్యే ప్రమాదం ఉన్నందున రోగులను ఖాళీ చేయించవలసిందిగా ఆదేశాలు అందాయి. మరి ఇంక్యుబేటర్‌లలో, అత్యవసరంగా వెంటిలేటర్‌ల పైన ఉన్న శిశువులను ఎక్కడికి తరలించాలి?

గాజాకు అయిన వర్ణనాతీతమైన గాయం గురించి ఒక పాలస్తీనా వ్యక్తి గుండెను పిండేసే మాటలను 'బీబీసీ'తో అన్నారు: ''సురక్షితంగా ఉండేందుకు మనం ఎక్కడికి వెళ్లాలి అని ప్రజలు అడగడం లేదు. మనం చనిపోయేటప్పటికి ఎక్కడ ఉండాలి అని అడుగుతున్నారు.''

నిజం ఏమిటంటే ఇజ్రాయెల్ అంతరాత్మ కూడా ఈ భయానక స్థితికి చలించింది. ఆ స్థితిని వ్యక్తీకరించడం అంత తేలిగ్గా కనిపించకపోవచ్చు. హమాస్ కంటే ఎక్కువ అని కాదు, హమాస్‌తో సమానంగా అణచి వేసే ప్రయత్నాలతో ఇజ్రాయెల్ ఏమీ సౌకర్యంగా ఉండకపోవచ్చు. కనుక నెమ్మదిగా, కానీ స్థిరంగా మాటలను కూడబలుక్కుంటోంది.

'హారెట్జ్'... ఇజ్రాయెల్‌లో పేరున్న వార్తా పత్రిక. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిగిన మరుసటి రోజు, అక్టోబర్ 8న తన సంపాదకీయ వ్యాసంలో... 'దాడి వల్ల ఇజ్రాయెల్‌కు సంభవించిన విపత్తుకు బాధ్యత వహించవలసిన ఒకే ఒక వ్యక్తి బెంజమిన్ నెతన్యాహూ' అని రాసింది. పాలస్తీనా ఉనికిని, హక్కులను నెతన్యాహూ విస్మరించారని ఆరోపించింది. 9వ తేదీన ఆ పత్రిక 'ప్రతీకార ఉద్యమాలకు, యుద్ధ నేరాలకు ఆస్కారం ఉండొచ్చు' అని హెచ్చరించింది. ఆ పత్రిక వ్యాసకర్తగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన గిడియన్ లెవీ 19వ తేదీన 'ఎనఫ్' (చాలు) అనే శీర్షికతో సంపాదకీయం పేజీలో రాసిన వ్యాసాన్ని 'ఈ రక్తపాతాన్ని తక్షణం ఆపి తీరాలి, వినాశానికి హద్దులు ఉంటాయి' అని ప్రారంభించారు.

ఇజ్రాయెల్ గురించి మీరేం అనుకున్నా, స్థానిక యూదు పౌరులకు అది ప్రజాస్వామ్య దేశం అనేందుకు 'హారెట్జ్' ఒక కాదనలేని రుజువు. భారతదేశంలో ఈ విధమైన పరిస్థితుల్లో పత్రికలు రాసే సంపాదకీయాలు, అభిప్రాయాలు తీవ్రవాదం, దేశద్రోహం అభియోగాలను ఆహ్వానించవచ్చు. అంటే ఇజ్రాయెల్‌లోనూ ఇప్పుడు నిరసనల సౌందర్యం కనిపిస్తూ ఉంది.

అయితే ఈ నిరసనలు దేనినైనా మారుస్తాయా? మరింత దారుణంగా జరగబోయే అకృత్యాలను అవి ఆపగలవా? చెప్పలేను. బహుశా ఆపలేవేమో! అయినప్పటికీ నిరసనలు అవసరమైనవి. అందుకు ఒకే కారణం అవి జరగవలసి ఉండటం. నిశ్శబ్దంగా ఉండలేని స్వరాలు అవి. కనుక మాట్లాడటాన్ని మన మనస్సాక్షి కొనసాగిస్తూనే ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎలా గెలుస్తారు?



అత్యంత సక్సెస్ అయిన తల్లితండ్రులు తమ పిల్లల నుంచి లాగేసుకునే ఒక విలువైన బహుమతి ఏమిటో తెలుసా? అసలంటూ తాము విజయపథంలో నడవడానికి కారణమైనదే అది. పోరాటం!

– కునాల్ షా, పారిశ్రామికవేత్త

ఊరికే ఉండరా?



ఎవరికైనా లక్ష్యాలు లేకపోతే నేను దాన్ని అంతగా పట్టించుకోను. అది ప్రతి ఒక్కరూ తమకు తాము నిర్ణయించుకోవాల్సిన విషయం. కానీ లక్ష్యం ఉన్నవాళ్లను కిందికి లాగాలని చూస్తారు చూడు, అది నాకు ఆందోళన కలిగిస్తుంది.

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

అదే విధానం



విదేశాంగ విధానం అనేది నువ్వు మంచి బాలుడు అని సంకేతం ఇచ్చే ఉపకరణం కాదు. ఏది ఏమైనా స్వీయ ప్రయోజనాల కోసం చేసే యత్నం. అది మన యుద్ధం కాదు. రెండు పక్షాలతోనూ మనకు సంబంధాలున్నాయి. ఇండియా తీవ్రవాదాన్ని ఖండించింది. సహాయాన్ని అందించింది. పాలస్తీనా గురించి తన చారిత్రక వైఖరి నొక్కిచెప్పింది. ఇక తర్వాత జరిగేదేమిటో చూస్తూ ఉండటమే!

– హార్దిక్ రాజ్‌గోర్, వ్యాఖ్యాత

దీన్నెలా ఓడిద్దాం?



మన జనం ఎక్కడి యుద్ధాన్నో నిరసించడంలో బిజీగా ఉన్నారు. కానీ మన ఇంట్లోనే ఒక యుద్ధం కొనసాగుతోంది. హమాస్, ఐసిస్, టీటీపీ లాంటివన్నీ ఒకే రాక్షసుడి భిన్న తలలు. (పాకిస్తాన్‌లో జరిగిన మరో బాంబు దాడి నేపథ్యంలో.)

– మన్సూర్ అఫ్రిది, ఫ్రీ థింకర్

దారుణ వైఖరి



నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాన్ని పేల్చేస్తామని ఖలిస్తానీ తీవ్రవాది 'పన్ను' హెచ్చరిస్తున్నాడు. ఇదే ఇజ్రాయెలీ విమానం గురించి ఒక పాలస్తీనియన్ అనివుంటే ట్రూడో ఇప్పటికే ఆ సంస్థను నిషేధించేవాడు. కానీ ఇండియా లక్ష్యంగా కెనడాలో ఏమైనా అనొచ్చు.

– వీర్ సింఘ్వీ, జర్నలిస్ట్

రొటీన్... రొటీన్



ప్రతి సంవత్సరం ఇవే వరుసగా జరుగుతాయి: 1. 'దేవుడా! ఢిల్లీలో ఊపిరాడటం లేదు.' 2. 'టపాకాయలు కాల్చొద్దు. సేవ్ ఢిల్లీ.' 3. ఏం ఫర్లేదు కాల్చమని సద్గురు చెబుతారు. 4. ప్రతి ఒక్కరూ రెండింతల టపాకాయలు కాల్చుతారు. 5. ప్రభుత్వం ఏదో చేసినట్టుగా నటిస్తుంది. 6. ఫిబ్రవరి వస్తుంది. ఢిల్లీ మళ్లీ ఊపిరి పీల్చుకుంటుంది.

– కాజోల్ శ్రీనివాసన్, కమెడియన్

సినీ గీత సమాచార గని

సమాచారం, విజ్ఞానమే పెద్ద సంపద. ఆ సంగతి తెలిసిన ఓ ఇంజనీర్ సినీ సమాచార గనిని తవ్వడం మొదలుపెడితే? డాక్టర్ వి.ఎస్. ఊటుకూరిగా పాపులరైన పేరొందిన మైనింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఊటుకూరి వెంకట సత్యనారాయణ ఆ పనే చేశారు. ఆస్ట్రేలియాలోని ఆయన సినిమాపై ప్రేమతో సినీ సమాచారగనిని తవ్వి తీస్తున్నారు. 5 వేలకు పైగా తెలుగు సినిమాలు, 32 వేల పైగా పాటల వివరాలు సేకరించి, క్రోడీకరించి, విశ్లేషించి ఇప్పటికే రెడీ రెకానర్ గ్రంథాలందించారు. వాటిలో 1932 నుంచి 2000 వరకు వచ్చిన సినిమా వివరాల 'తెలుగు ఫిల్మోగ్రఫీ' ఉంది. నిర్మాతలు, దర్శకులు, మాటల రచయితల 'డైరెక్టరీ'ల పేరిట వారి సినిమాల సంఖ్య, వివరాల పుస్తకాలున్నాయి. ఇవికాక ఏ సినిమాలో, ఏ పాటెవరు రాశారు, ఎవరు సంగీతమిచ్చారు, ఎవరు పాడారో చెప్పే తెలుగు సినీ గీతకోశముంది.

కొత్త పుస్తకం



తాజాగా మరో 14 పుస్తకాలతో ఊటుకూరి ముందుకొచ్చారు. సినీ సమాచార తెలుగు సినీ గీత రచయితలు (4భాగాలు), సంగీత దర్శకులు (3 భాగాలు), గాయకుల (6భాగాలు), అలాగే ప్రత్యేకంగా ఘంటసాలపై ఒక పుస్తకం... ఇలా సినీ ప్రముఖుల సృజనాత్మక కృషిని పుస్తకాల్లో అందిస్తున్నారు. 7 వేల పేజీల్లో సమాచారం మొత్తాన్నీ బయటకు తెస్తున్నారు. హిందీ, మరాఠీల్లో సినీ గీతకోశాలు కొత్త కాదు. మొత్తం సంవత్సరాలు, సినిమాలు, గాయకులు, సంగీత దర్శకుల వారీగా శ్రమించి, శ్రద్ధతో చేయాల్సిన ఈ సినీ గీతకోశాల కూర్పును తెలుగులో చల్లా సుబ్బారాయుడు, స్వర్గీయ గోలి సాయిబాబు లాంటి ఒకరిద్దరే తలకెత్తుకున్నారు. అదీ ఘంటసాల లాంటి కొందరి కృషే పుస్తకాలుగా వచ్చింది. గాయకుల, లేదా రచయితల పాటల సమగ్ర వివరాలతో సినీగీత కోశాలు తెలుగులో రాలేదు. వచ్చినవీ క్రాస్ రిఫరెన్స్ చేసే వీలు లేనివి. ఇక మొత్తం సినీ గీత సమాచారమైతే ఒకచోట గుదిగుచ్చలేదు.

ఈ నేపథ్యం నుంచి చూస్తే డాక్టర్ ఊటుకూరి ఏళ్ళ తరబడి శ్రమించి, పట్టుదలతో ఈ సినీ గీత కోశాలు ప్రత్యేకమైనవి. ఏటా తెలుగులో విడుదలైన నేరు, డబ్బింగ్ చిత్రాలు చూడవచ్చు. రచయితల పాటల పల్లవులు, సంగీత దర్శకుల సినిమాలు, గాయకుల పాటల జాబితా తెలుసుకోవచ్చు. సదరు రైటర్, మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ ఏ ఏడాది ఎంతెంత పని చేశారో కాలమాన పట్టికలో గణాంకాల్లో చూడవచ్చు. వారి కెరీర్‌లోని ఉత్థానపతనాలు గ్రహించవచ్చు. సినిమా పేరు, పల్లవి, రైటర్లు, సింగర్ల వారీగా సులువుగా చూసుకోగల 4 రకాల ఇండెక్స్‌లు ఇవ్వడంతో, వీటిలో ఏ ఒక్కటి తెలిసినా ఆ పాట సమగ్ర వివరం ఇట్టే పట్టేయవచ్చు.

ఇక, ఎస్పీబీ, సుశీల, చిత్రల కృషిపై ప్రత్యేక వాల్యూమ్‌లు సినీప్రియులకు పండగ. అన్నీ కలిపి ఆయన శోధన, సాధన ఇప్పటికి 25 పుస్తకాలయ్యాయి. ఇది ప్రసిద్ధ 'సారస్వత నికేతన్' లైబ్రరీకి నెలవైన వేటపాలెంలో జన్మించిన ఊటుకూరి సినీ సారస్వత, సంగీతాలకు చేసిన అమూల్యసేవ. ఈ గ్రంథాలు పరిశోధకులకే కాదు, పాటను ప్రేమించేవారికి వరం. తెలుగు సినీ చరిత్రకు కొత్త చేర్పుగా ఈ కోశాలన్నీ నేడు హైదరాబాద్‌లో ఆవిష్కృతమవుతున్నాయి. పరిశ్రమ, ప్రభుత్వాలు చేయాల్సిన పని ఎక్కడో విదేశాల్లో దశాబ్దాల క్రితం స్థిరపడిన ఎనిమిదిన్నర పదులు దాటిన సినీప్రియుడు చేయడం ఎన్నటికీ మర్చిపోలేని విశేషం. – రెంటాల జయదేవ

వ్యక్తిగత సమాచారం అంగడి వస్తువే!

అభిప్రాయం



కె. బి. గోపాలం

ఇవ్వాళ స్మార్ట్‌ఫోన్ వాడనివాడు మనిషేకాడు అన్నంతగా వినియోగదారీ సంస్కృతి మభ్యపెడుతోంది. మన నిత్య జీవితంలోని ప్రతి అంశం స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇతరులకు తెలిసిపోతున్నదనే స్పృహ మనలో చాలామందికి ఉండడం లేదు. ఫలితంగా ఎంతో విలు వైన మన వ్యక్తిగత సమాచారం అంగట్లో సరుకుగా మారుతోంది.

నెలకు ఒకసారి గూగుల్ నుంచి ఒక మెయిల్ వస్తుంది. అందులో ఆ నెల రోజుల్లో మనం ఎన్ని చోట్లకు, ఎంతకాలం, ఏ పద్ధతిలో వెళ్ళిందీ మొత్తం మ్యాప్‌లతో సహా వివరాలు ఉంటాయి. ఆ వెళ్లిన ప్రతి చోటికీ మనం ఫోన్ వెంటబెట్టుకు వెళ్ళామన్న సంగతి ఒక పట్టాన తోచదు. అది తోచిన తరువాతనైనా ఫోన్ వెంట పెట్టు కోకుండా వెళ్లడం కుదరకపోవచ్చు కూడా!



మొత్తానికి సోషల్ నెట్‌వర్క్, కాలక్షేపం, పాటలు, సినిమాలు, సీరియళ్లు – ఇలా మన సర దాల సంగతి కూడా మొత్తం ప్రపంచానికి తెలిసి పోతుంది. ఆన్‌లైన్ పద్ధతిలో మనం కొంటున్న వస్తు వుల వివరం కూడా ఇతరులకు తెలుస్తుంది. ఇది ఇట్లా ఉంటే ఒక పక్కన ఎక్కడికో వెళ్లాలని టికెట్ బుక్ చేయడానికి ఆన్‌లైన్ సైట్‌కు వెళతాం. అక్కడ మనకు కావలసిన సౌకర్యాలు, సంగతులనుగురించి ప్రకటనలు వాటంతట అవే కనిపించడం మొదలవుతుంది. ఇది అనుకోకుండా జరుగుతున్నదని మనం అనుకుంటాం. కానీ దీని వెనుక వ్యాపారం ఉన్నదనేది ఎందరికి తెలుసు? అంతర్జాతీయ పత్రికలలో ఇందుకు సంబంధించిన వివరాలు రాస్తున్నారు. మనం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా మన మానాన మనం బతుకుతున్నాం.

ఆధునిక కాలంలో మన సొంత వివరాల ఆధారంగా మరెవరో వ్యాపారం చేస్తారు. దీన్నే 'పర్సనల్ డేటా బిజినెస్' అంటున్నారు. పట్టించుకోకుంటే ఇది చాలా ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చాలామంది 'ఈ మెయిల్', 'వాట్సాప్' లాంటి సౌకర్యాలను వాడుకుంటున్నారు. వీటన్నింటిలోనూ మన సొంత వ్యవహారాలను, అవి బహుశా రహస్యాలు అయినా సరే, మనకు కావ లసినవారితో పంచుకుంటున్నాం. కానీ మన ఆస్తులు, ఆసక్తులు, వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అన్ని వ్యవహారాలూ గూగుల్ లాంటి కంపెనీలకు ఇట్టే చేరి పోతున్నాయని మనం గ్రహించడం లేదు. ఎక్కడో ఏ అప్పు కొరకు వెళ్ళినప్పుడో అక్కడ మన వ్యవహారాల సమాచారం అంతా ఇచ్చి ఉంటాము. మన గురించి తెలుసుకోవాలనుకున్న ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులూ, సంస్థలూ ఈ సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఒకరికి ఓటర్ కార్డు రాదు, మరొకరికి ఆధార్ కార్డు కూడా రాదు. భూమి తగాదా గురించి కేసు వేస్తే ఎందుకో తెలియకుండానే మనకు వ్యతిరేకంగా నిర్ణయం వస్తుంది. వీటి వెనక ఇంట ర్నెట్ ద్వారా మన గురించి సేకరించిన సమాచారం ప్రభావం ఉండవచ్చునని మనకు అనుమానం కూడా రాదు.

ఇన్సూరెన్స్ కంపెనీల వాళ్లకు ఇటువంటి సమాచారం చాలా ఉపయోగకరంగా ఉంటున్నది అని నిపుణులు చెబుతున్నారు. మన ఆరోగ్యం వ్యవహారం, అందుకు సంబంధించిన మిగతా సంగతులు ఎంత మాత్రం రహస్యం కాదు. ఒక ఉద్యోగానికి మనం పనికివచ్చేదీ, లేదా పనికిరానిదీ ఈ సమాచారం ఆధారంగానే రిక్రూట్‌మెంట్ కంపెనీలు నిర్ణయిస్తున్నాయంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. వ్యవహారాలన్నీ ఈ రకంగానే జరుగుతున్నాయి. చట్ట విరుద్ధంగా చేస్తున్న గర్భస్రావాలను గురించి సమాచారం మరింత పట్టుదలగా సేకరిస్తున్నట్టు యూఎస్‌లోని సంస్థలు చెబుతున్నాయి. ఇటువంటి సందర్భాలలో ఎవరికి వారు పట్టించుకోకుండా ఉండడం ఎంత మాత్రం మంచిది కాదు.


పెద్ద టెక్నాలజీ కంపెనీలన్నీ ఈ సమాచార సేకరణ మీదనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. అందుకే ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు నటిస్తు న్నాయి. ఫోన్లను వాడుతున్న వారి సమాచారం గురించి ఆపిల్ కంపెనీ మీద వచ్చిన అభియోగం సంచలనం సృష్టించింది. ఆ దేశంలో ఫోన్ వాడుతున్న వారి సమాచారం గురించీ, దాన్ని కంపెనీలు వాడు కోవడం గురించీ చట్టాలు కూడా వచ్చాయి. మన దేశం సంగతి చెప్పనవసరం లేదు.

మనకు మనం జాగ్రత్తగా ఉండాలి. మనం వాడుతున్న యాప్‌లు, వెబ్ సైట్‌లు మన సమాచారాన్ని సేకరించడం గురించి జాగరూకతతో ఉండాలి. అసలు కొన్ని రకాల సమాచారాన్ని నెట్‌లో స్నేహితులతోనైనా పంచుకోకుండా ఉండడం మేలు. ఆ కంపెనీలు మనకు ఇస్తున్న సౌకర్యాల కన్నా మన నుంచి తీసుకునే సమాచారమే ఎక్కువ విలువ గలది అని పెద్దలు హెచ్చరిస్తున్నారు. ఇదంతా ఇవాళ కొత్తగా వచ్చిన వార్త కాకపోవచ్చు. కానీ అందరూ తెలుసు కోవలసిన సంగతి.

వ్యాసకర్త సైన్స్ రచయిత, కాలమిస్ట్ । 98490 62055

ధన్య జీవనం

ఆచరణీయములైన ఆశ్రమ ధర్మాలు నాలుగింటిలో గృహస్థాశ్రమ ధర్మం గొప్పదని పెద్దలు చెబుతారు. గృహస్థుడనే మాట బాధ్యతను గుర్తుకు తెస్తుంది. తాను, తన భార్యా పిల్లలు, తల్లితండ్రులు – వీరు కలిసి ఉన్నదే ప్రథమంగా ప్రతి గృహస్థుడికీ సంబంధించిన ఒక చిన్న ప్రపంచం అవుతుంది. వారి పోషణ, ఆలనా పాలన అతడి ప్రధాన బాధ్యత. అంతేగాకుండా అతిథుల ఆదరణ కూడా అంతే ముఖ్యమైన గృహస్థాశ్రమ ధర్మంగా చెప్పబడింది. కనుకనే గృహస్థాశ్రమ ధర్మాన్ని అన్ని కట్టుబాట్లను పాటిస్తూ గడిపి గట్టెక్కడం ప్రతి గృహస్థుకు కత్తి మీద సాము వంటిది. ధనం ఇందులో ముఖ్యమైన భూమికను పోషిస్తుంది. పిల్లనివ్వాలంటే ముందుగా ఆడపిల్ల తండ్రి తనకు అల్లుడు కాబోయే యువకుడి సంపాదన మార్గాన్ని ఆరా తీస్తాడు. ఆ మార్గం న్యాయమైనదేనా, కాదా అని ఆలోచిస్తాడు. న్యాయంగా డబ్బు సంపా దించి, న్యాయమైన మార్గంలో జీవనం సాగించే భర్తకే, అప్పటిదాకా అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమార్తెను కట్టబెడుతున్నామా లేదా అన్నది వారి ముఖ్యమైన ఆలోచనగా ఉంటుంది. అటువంటి పురుషుడి సాహచర్యంలోనే ఏ పడతి బతుకైనా గౌరవంగానూ, గుంభనంగానూ సాగుతుందనీ, అటువంటి దంపతులదే ధన్యజీవితంగా పరిగణింప బడుతుందనీ వారి విశ్వాసంగా ఉండడం లోక సహజం. ఈ భావననే మడికి సింగన తాను రచించిన 'జ్ఞాన వాసిష్ఠ రామాయణం' కావ్యం ప్రథమాశ్వాసంలో ఒక తేటగీతి పద్యంలో పొందికగా చెప్పాడు.



పొందవలసిన యర్థంబు పొందనేర్చి
దుష్కృతులు సేసి క్రమ్మఱ దుఃఖపడక
యచలనిర్వాణ సుఖవృత్తి నందునట్టి
వారి బ్రతుకులు బ్రతుకులు వసుధ మీద.

'తాను, తనపై ఆధారపడినవారి జీవనానికి అవసరమైన ధనాన్ని ఎలా సంపాదించాలో తెలిసికొని, అలా సంపాదించిన ధనాన్ని చేయరాని పనులకు వినియోగించి తరువాత చింతల పాలు కాకుండా తనను తాను సదా నిగ్రహించుకుని కాపాడుకుంటూ, చంచల స్వభావానికి లోను కానట్టి వారి బతుకులే బతుకులు ఈ భూమి మీద' అని పై పద్యం భావం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.నవమి తె.5.18 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి దశమి, **నక్షత్రం:** ఆశ్లేష ప.2.10 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.3.26 నుండి 5.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.05 నుండి 12.52 వరకు, తదుపరి ప.2.21 నుండి 3.08 వరకు, **అమృతఘడియలు:** ప.12.22 నుండి 2.10 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 5.24.

క్లుప్తంగా...

ప్రజల తెలంగాణ రావాలి

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



ముదిగొండ మండలం పమ్మిలో చిన్నారులను పలకరిస్తున్న భట్టి విక్రమార్క

ముదిగొండ: దొరల తెలంగాణ పోయి.. ప్రజల తెలంగాణ రావాలని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క కోరారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మిలో పర్యటించారు. తెలంగాణలో గెలవాల్సింది దొరలు కాదని, కుటుంబ పాలనను తరిమికొట్టాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందని, ఆ బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కుటుంబ పాలన నడుస్తుండగా, తొమ్మిదిన్నరేళ్లలో తిన్నదంతా కక్కిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు సానుకూల పవనాలు: ఎంపీ ఉత్తమ్



హుజూర్‌నగర్ (చింతలపాలెం): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని నల్లగొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వైఫల్యాలు, ఎమ్మెల్యేల అహంకారం, అవినీతి, దౌర్జన్యం వల్లనే కాంగ్రెస్ పార్టీకి సానుకూలత ఏర్పడిందన్నారు. 70 నుంచి 75 స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ అధికారం చేపట్టబోతోందని ఉత్తమ్ ధీమా వ్యక్తంచేశారు. పదేళ్లుగా సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు చేస్తూ నూటికి ఒక్క పని కూడా చేయలేదన్నారు. 2014కు ముందు తెలంగాణ రూ.69 వేల కోట్ల అప్పుల్లో ఉంటే ఇప్పటి తెలంగాణ రూ.4 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పేరుతో రూ.40 వేల కోట్లతో తెలంగాణలో శుభ్రమైన నీరు ప్రతి ఇంటికి ఇస్తున్నామని పార్లమెంటులో ప్రస్తావించారని, కానీ గ్రామాల్లో ఎక్కడా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. ప్రతి ఎన్నికల్లో రేషన్‌లో సన్నబియ్యం ఇస్తామని చెప్పిన కేసీఆర్.. దొడ్డు బియ్యం ఇస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు పోలీసులను అడ్డం పెట్టుకొని తప్పుడు కేసులు పెట్టించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉత్తమ్ ఆరోపించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కొత్త లిఫ్టుల మాట దేవుడెరుగు.. పాత లిఫ్టులు పని చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఆరు హామీలను కచ్చితంగా అమలు చేస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు.

మీ ఆయుధాలు, సిద్ధాంతాలు అవే

- బీఆర్ఎస్ భరోసాల ప్రచారంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ భరోసాల పేరుతో చేస్తున్న ప్రచారంపై టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'అబద్ధాలే మీ ఆయుధాలు. వంచనలే మీ సిద్ధాంతాలు. నాటకాలే మీకు తెలిసిన విద్యలు' అంటూ 'ఎక్స్' వేదికగా ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ ఇచ్చిన, తప్పిన హామీలకు లెక్కలేదని, ఇంక పాలించే హక్కు లేదని, ఆ పార్టీ నేతలపై భరోసా లేదంటూ పోస్టు చేశారు. 'ముక్కు నేలకు రాసినా, పార్లి పార్లి దండాలు పెట్టినా.. పారవు మీ పాచికలు. తప్పవు మీకు శంకరగిరి మాన్యాలు' అని రేవంత్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మీరే తెలంగాణ ద్రోహులు

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై షర్మిల ధ్వజం



లక్డీకాపూల్(హైదరాబాద్): 'అభివృద్ధిపై చర్చించే దమ్ము, ధైర్యం లేక ఇంకా సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారు. మీ తండ్రీ కొడుకులను మించిన తెలంగాణ ద్రోహులు ఇంకెవ్వరూ ఉండరు' అంటూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. తెలంగాణ ద్రోహులంటూ తనను ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఆమె స్పందిస్తూ నమ్మి రెండు దఫాలు అధికారమిస్తే రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన వెన్నుపోటుదారులనీ, ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి తమ కుటుంబాన్నే అభివృద్ధి చేసుకున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'రాష్ట్రాన్ని 4 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టి దివాలా తీయించి, కోటి ఎకరాల మాగాణికి సాగునీరందిస్తామని చెప్పి పనికి రాని ప్రాజెక్ట్ కట్టి రూ.లక్ష కోట్లు కాజేశారు' అని ధ్వజమెత్తారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చి 10 ఏళ్లలో రాష్ట్రంలో లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. 'నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రజలంతా ఏకమై సాధించిన ప్రత్యేక రాష్ట్రంలో నిధులు మీ ఖజానాకే.. నీళ్లు మీ ఫాంహౌస్‌కే.. నియామకాలు మీ ఇంట్లోకే పరిమితం చేశారు' అని షర్మిల ఆరోపించారు.

కాషాయ దళం..కారాలు మిరియాలు!

- సీట్ల కేటాయింపులో వలస నేతలకు పెద్దపీటపై పాతనాయకుల అసంతృప్తి
- దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకుని ఉన్న వారికి రిక్తహస్తంపై మండిపాటు
- ఇప్పటికి ప్రకటించిన 88లో దాదాపు 60% కొత్తవారికే కట్టబెట్టారంటూ ఆవేదన



సాక్షి, హైదరాబాద్: బీజేపీపై పార్టీ పాతకాపులు మండిపడుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకున్న వారికి అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. వలస నేతలకు పెద్దపీట వేశారని, గెలుపోటములతో నిమిత్తం లేకుండా దశాబ్దాలుగా పార్టీలోనే ఉంటూ కష్టపడి పనిచేస్తున్న వారికి గుర్తింపు లేకుండా పోయిందని వాపోతున్నారు. పార్టీలోని ఒరిజినల్ కేడర్‌కు సీట్లు ఇవ్వకుండా జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు మొండిచెయ్యి చూపించాయంటూ కారాలు, మిరియాలు నూరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాషాయ సిద్ధాంతాలు పాటించే వారు, ఎప్పట్నుంచో పార్టీలో ఉన్నవారు పనికి రారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటిదాకా ప్రకటించిన 88 అభ్యర్థుల్లో మూడింట రెండు వంతులకు పైగా కొత్తవారికే కట్టబెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వివిధ కారణాలతో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి వచ్చిన ముఖ్యనేతలు, వారి అనుయాయులకే ఎక్కువగా టికెట్లు దక్కాయని విమర్శిస్తున్నారు. ఇతర పార్టీల్లోని అవలక్షణాలు బీజేపీకి కూడా అంటుకున్నాయనే అభిప్రాయం కలుగుతోందని, కొందరు గుత్తేదారుల చేతుల్లో ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడిందంటూ ఆరోపణలకు సైతం దిగుతుండటం గమనార్హం. గత నాలుగేళ్లలో పార్టీలో చేరి జాతీయ కార్యవర్గ సభ్యులుగా, ఇతర ముఖ్య పోస్టుల్లో ఉన్న నేతల్లో కొందరు చక్రం తిప్పి తమ అనుచరులు, అనుయాయులకు టికెట్లు ఇప్పించుకోవడంతో పాత నాయకులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా పార్టీలో పాతకాపులకు ప్రాధాన్యత తగ్గిపోవడం దేనికి సంకేతమని వారు నిలదీస్తున్నారు. ప్రకటించిన 88 మంది అభ్యర్థుల్లో 20 మంది దాకా మాత్రమే పార్టీ సిద్ధాంతాల పునాదిపై సంవత్సరాల తరబడి పార్టీలో పని చేస్తున్న వారని, మరో 10 నుంచి 15 మంది దాకా గత ఐదు నుంచి పదేళ్లలోపు పార్టీలో చేరి స్థిరంగా పనిచేస్తున్నారని లెక్కలతో సహా వివరిస్తున్నారు.

పాత నేతలు చెబుతున్న దాని ప్రకారం.. ఇటీవలే పార్టీలో చేరి టికెట్లు దక్కించుకున్నవారు..

మానకొండూరు	ఆరేపల్లి మోహన్
చేవెళ్ల	కేఎస్ రత్నం.
రామగుండం	కందుల సంధ్యారాణి
హుజూర్‌నగర్	శ్రీలత రెడ్డి
డోర్నకల్	సంగీత
మెదక్	పంజా విజయ్‌కుమార్
బోధన్	మోహన్‌రెడ్డి
ముధోల్	రామారావు పటేల్
జహీరాబాద్	రామచంద్ర రాజానర్సింహ
దేవరకొండ	లాలూ నాయక్

(పైన పేర్కొన్న వారంతా ఇటీవలే బీజేపీలో చేరారు)

ఇబ్రహీంపట్నం	నోముల దయానంద గౌడ్ (5 నెలల క్రితం చేరారు)
బెల్లంపల్లి	శ్రీదేవి (2023లో)
జగిత్యాల	బోగ శ్రావణి (2023లో)
సిరిసిల్ల	రాణి రుద్రమ (2022లో)
బాల్కొండ	అన్నపూర్ణమ్మ (2021లో)
సిర్పూర్	పాల్వాయిహరీశ్ (2021లో)
మంథని	సునీల్‌రెడ్డి (2021లో)
జనగామ	దశమంతరెడ్డి (2020లో)

టికెట్లు దక్కిన పాత నేతలు కొందరు..

కరీంనగర్	బండి సంజయ్
నిజామాబాద్ అర్బన్	ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా
ధర్మపురి	ఎస్ కుమార్ (2004లో చేరారు)
దుబ్బాక	రఘునందన్ రావు (2013లో)
ఖైరతాబాద్	చింతల రామచంద్రారెడ్డి (పాత కార్యకర్త)
గోషామహల్	రాజాసింగ్ (2014లో)
చార్మినార్	మేఘారాణి (అగర్వాల్ సంఘ వ్యక్తి)
చాంద్రాయణగుట్ట	సత్యనారాయణ (ముదిరాజ్ సంఘ్ కార్యకర్త)
యాకుత్‌పురా	వీరేందర్ యాదవ్
బహదూర్‌పుర	నరేశ్
కల్వకుర్తి	టి.ఆచారి
భూపాలపల్లి	కీర్తిరెడ్డి
ఆసిఫాబాద్	ఆత్మరాం నాయక్
బాన్సువాడ	యెండల లక్ష్మీనారాయణ
ఉప్పల్	ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్
మలక్‌పేట	సురేందర్ రెడ్డి
నారాయణపేట	రతంగా పాండురెడ్డి
పాలేరు	నున్న రవికుమార్

వలస నేతలకు టికెట్లు ఇవ్వడంతో అవకాశం కోల్పోయిన కొందరు

జనగామ	బేజాది బీరప్ప
ముధోల్	మోహన్‌రావు పాటిల్, రమాదేవి (రాజీనామా చేశారు)
వరంగల్ వెస్ట్	ఏనుగుల రాకేష్‌రెడ్డి (రాజీనామా), ఎం.ధర్మారావు
మానకొండూరు	గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న (రాజీనామా)
నరసాపూర్	సింగాయపల్లి గోపి
కుత్బుల్లాపూర్	ఎస్.మల్లారెడ్డి
ఇబ్రహీంపట్నం	కొత్త అశోక్‌గౌడ్
భువనగిరి	శ్యాంసుందర్‌రావు
వరంగల్ ఈస్ట్	కుసుమ సతీష్, గంటా రవి
మెదక్	శ్రీనివాస్
నారాయణఖేడ్	విజయపాల్‌రెడ్డి
ఎల్‌బీనగర్	పలువురు కార్పొరేటర్లు ఆశించారు
చేవెళ్ల	కంజర్ల ప్రకాశ్
ముషీరాబాద్	బండారు విజయలక్ష్మి, గోపాలరెడ్డి, భరత్‌గౌడ్
రాజేంద్రనగర్	బుక్కా వేణుగోపాల్
సికింద్రాబాద్	బండా కార్తీకరెడ్డి, ఆదం విజయ్‌కుమార్
మక్తల్	కొండయ్య
దేవరకొండ	కళ్యాణ్‌నాయక్

కాంగ్రెస్‌లోకి ఓయూ, కేయూ విద్యార్థి నేతలు



నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

- నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఇతర ప్రజాప్రతినిధులు కూడా..
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన పలు విద్యార్థి సంఘాల నేతలు, పలువురు పరిశోధక విద్యార్థులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉస్మానియా వర్సిటీ విద్యార్థి నేత కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సతీశ్, ఎస్ఎఫ్ఐ ఉస్మానియా వర్సిటీ విభాగం మాజీ అధ్యక్షుడు ఇ.రవి, టీవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రాజ్, టీవీఎస్ కాకతీయ వర్సిటీ నేత కె.రంజిత్, టీఎస్‌పీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఓ.చంద్రశేఖర్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కాగా, నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజ ఆంజనేయులుగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య పార్టీలో చేరగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మరో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సరైన గౌరవం ఇవ్వకపోవడం వల్లే పార్టీని వీడుతున్నట్లు వనజ తెలిపారు. సోమవారం సీఎం కేసీఆర్ మక్తల్ ప్రజాఆశీర్వాద సభకు వస్తున్న తరుణంలో జెడ్పీ చైర్‌పర్సన్ బీఆర్ఎస్‌ను వీడటం గమనార్హం. వీరితోపాటు మక్తల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచ్‌లు, బీజేపీ మైనార్టీ సెల్ నేతలు కూడా పార్టీలో చేరారు. కొడంగల్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, సికింద్రాబాద్, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కూడా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

అన్నారం బ్యారేజీలో నీరు ఖాళీ!



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ఉన్న అన్నారం (సరస్వతీ) బ్యారేజీ నుంచి ఇంజనీరింగ్ అధికారులు నీటిని ఖాళీ చేసే పనిలో పడ్డారు. మూడు రోజుల క్రితం వరకు 5 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉండగా.. బ్యారేజీలో 4వ బ్లాక్‌లోని 38వ పియర్ వద్ద నీటి ఊటలు బయటకు రావడంతో అప్రమత్తమైన అధికారులు తాత్కాలిక మరమ్మతు చర్యలు చేట్టారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ), సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాల సభ్యులు రెండు రోజుల క్రితం బ్యారేజీని పరిశీలించిన నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగుకు తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం బ్యారేజీలో 66 గేట్లకు గాను ఆదివారం ఉదయం 7, సాయంత్రం 2 గేట్లు ఎత్తారు. ఎగువ నుంచి 2,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్లు ఎత్తడంతో దిగువకు 900 క్యూసెక్కులు తరలిపోతున్నది. దీంతో బ్యారేజీలో నీటి నిల్వ 5 టీఎంసీల నుంచి 1.50 టీఎంసీలకు చేరుకుంది. రెండు రోజుల్లో నీటిని ఖాళీ చేసి ఆ తరువాత పూర్తి స్థాయి మరమ్మతు చేపట్టనున్నట్లు తెలిసింది.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ

- పేదలందరికీ ఇళ్ల స్థలాలు
- ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం
- జర్నలిస్టులకు 300 గజాల స్థలం
- సీపీఎం ఎన్నికల మేనిఫెస్టో విడుదల



పార్టీ నేతలతో కలసి మేనిఫెస్టో విడుదల చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సాక్షి, హైదరాబాద్: రైతులకు ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ కోసం కృషి చేస్తామని సీపీఎం హామీనిచ్చింది. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం రూపొందించాలని అభిప్రాయపడింది. ఈ మేరకు సీపీఎం ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేసింది. తమ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరుతూ మేనిఫెస్టోలో పలు అంశాలను జోడించింది. రైతుల పంటలపై 80 శాతం రుణాలు ఇచ్చి గోదాముల సౌకర్యం కల్పించాలని కోరతామని పేర్కొంది. ధరల నిర్ణాయక కమిషన్ ఏర్పాటు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలు సేకరించాలని కోరతామని స్పష్టం చేసింది. కౌలు రైతుల గుర్తింపు, వ్యవసాయ రుణాలు, సబ్సిడీలు, పంట బీమా, కౌలు, పోడు రైతులందరికీ రూ. 5 లక్షల రైతు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాలు, అటవీ జంతువుల వల్ల పంట నష్టం జరిగితే సాగు చేసిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని సీపీఎం పేర్కొంది. రాష్ట్రంలో ప్రభుత్వ భూములలో సాగులో వున్న అర్హులైన అందరికీ హక్కు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపింది. 10 ఎకరాల లోపు రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు ఉచితంగా ప్రభుత్వం అందించాలని కోరింది.

సీపీఎం ఎన్నికల మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు..

- ఇళ్లు లేని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. ఆ ఇళ్ల నిర్మాణానికి రు. 10 లక్షల ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తాం.
- ప్రతి జర్నలిస్టుకు 300 గజాల ఇంటిస్థలం ఉచితంగా కేటాయించాలి. ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలి. పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలి. వారి పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలి. జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా హెల్త్ స్కీంను అమలు చేయాలి.
- ప్రభుత్వ భూములను అర్హులైన పేదలందరికీ పంపిణీ చేయాలని పోరాడుతాం. ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న, సాగుచేస్తున్న పేదలకు పట్టాల కోసం పోరాటం చేస్తాం.
- భూమి లేని వ్యవసాయ కూలీలకు మిగులు భూమి పంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.
- కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలకు తగ్గకుండా నిర్ణయించేవరకూ పోరాటం.
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేస్తాం.
- అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ తదితర స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించేందుకు జరిగే పోరాటాలకు అండగా ఉంటాం.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండో పీఆర్సీ అమలు, హెల్త్ స్కీమ్ పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి.
- బీసీ కులాలకు జనగణన చేపట్టాలి.
- 250 యూనిట్లలోపు కరెంటు వాడకం ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం మీద ఒత్తిడి చేస్తాం.
- నిరుద్యోగులకు రూ. 5 వేల భృతి ఇవ్వాలి.
- సింగరేణి కోల్ బ్లాకులను ప్రైవేటుపరం చేయకుండా ఒత్తిడి తెస్తాం.
- టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వంపై పోరాడతాం.
- దళిత క్రైస్తవులను ఎస్సీలుగా పరిగణించాలి.
- కాటికాపరుల వృత్తిపై జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ఇవ్వాలి.

మళ్లీ సారు రారు.. కారు రాదు

- ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌కుమార్
- రాష్ట్రంలో వైద్య పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆందోళన
- కేసీఆర్ కుటుంబ ఆస్తులపై గాంధీభవన్‌లో వీడియో ప్రదర్శన



సాక్షి, హైదరాబాద్: సారు(కేసీఆర్).. కారు(బీఆర్ఎస్).. మళ్లీ రారు.. రావని ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. కారును పోలీసోళ్లు కూడా ఉండనివ్వడం లేదని, కాంగ్రెస్ ప్రచారం కోసం గాంధీభవన్‌లో అద్దె కార్లు తెచ్చి పెట్టుకుంటే పోలీసులు తీసుకెళ్లిపోయారని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఏఐసీసీ పరిశీలకుడు అంశు, పీసీసీ ప్రధాన కార్యదర్శి కౌశిక్ చరణ్‌యాదవ్‌తో కలిసి అజయ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో వైద్య పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భిణీ లకు అవసరమైన రక్తం కూడా దొరకడం లేదని, మెజార్టీ ప్రజలకు పౌష్టికాహారం దూరమైందని, 70 శాతం మంది పిల్లలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేదని చెప్పారు. కేసీఆర్ పాలనపై విసిగిపోయిన ప్రజలు ఈసారి బీఆర్ఎస్ నుంచి విముక్తి పొందాలని నిర్ణయించారనీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేళ్లుగా వైద్య, ఆరోగ్య రంగాన్ని కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మీడియా సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, కేసీఆర్ కుటుంబ ఆస్తులపై వీడియోను కాంగ్రెస్ నేతలు ప్రదర్శించారు.

కాంగ్రెస్ బీ-ఫారాల పంపిణీ ప్రారంభం

- గాంధీభవన్‌లో 60 మంది అభ్యర్థులకు అందజేసిన ఏఐసీసీ కార్యదర్శులు
- వనపర్తి, చేవెళ్లతోపాటు మరో రెండు నియోజకవర్గాల్లో మార్పు?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. ఇప్పటికే 100 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించగా, ఆదివారం 60 మందికి బీఫారాలు అందజేసింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, రోహిత్‌చౌదరి బీఫారాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు బీఫారాలు తీసుకున్నవారిలో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, టి.జీవన్‌రెడ్డి(జగిత్యాల) కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), గద్దర్ కుమార్తె వెన్నెల(కంటోన్మెంట్), మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ (రామగుండం), కూచాడి శ్రీహరిరావు(నిర్మల్), రావి శ్రీనివాస్(సిర్పూర్), బోయ నగేశ్ (చాంద్రాయణగుట్ట) తదితరులున్నారు. కాగా, ఇప్పటివరకు ప్రకటించిన జాబితాలోని 4 స్థానాల్లో అభ్యర్థుల మార్పుపై ఏఐసీసీ కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. వనపర్తి, చేవెళ్లతో పాటు మరో ఒకట్రెండు నియోజకవర్గాలపై సమీక్ష జరుగుతోందని, అక్కడ మార్పు జరిగే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం

- కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే ఇక కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండరని, అందరూ ప్రభుత్వ ఉద్యోగులే అవుతారని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యోగ అర్హత పరీక్షలు నిర్వహించడంలో విఫలం కావడం వల్ల అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని, నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులన్నీ నాణ్యతలేక కూలిపోతున్నాయని, వాటి మీద విచారణ జరిపించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కోమటిరెడ్డి ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి మీద విచారణ జరిపిస్తామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మిత్రపక్షాలు అయినందునే విచారణ చేపట్టడంలేదని ఆరోపించారు. రూ.9 లక్షల కోట్ల అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే, దానిలో భాగమైన మేడిగడ్డ బ్యారేజి కుంగిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయనే కాంగ్రెస్‌లో చేరా

- మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: 'బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయనే నేను కాంగ్రెస్ పార్టీలో చేరాను. నా ప్రధాన లక్ష్యం సీఎం కేసీఆర్‌ను గద్దె దింపడమే. అందుకోసం నా ఆస్తులన్నీ అమ్ముకోవడానికైనా, అవమానాలు భరించడానికైనా సిద్ధం' అని మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది క్రితం తాను బీజేపీలో చేరింది రాష్ట్ర ప్రజల ధనాన్ని దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడానికే అని అన్నారు. కానీ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై లిక్కర్ దందాలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కవితను ఎందుకు వదిలేశారని ఆరు నెలల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను అడిగితే రెండు, మూడు నెలల్లో అరెస్ట్ చేస్తామని చెప్పి కాలయాపన చేశారని, దీంతో రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఎవ్వరూ నమ్మడం లేదని చెప్పారు. కేసీఆర్ కుటుంబాన్ని గద్దె దించే శక్తి కాంగ్రెస్ పార్టీకి ఉందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. తనను కొనేశక్తి ఈ దేశంలో ఎవ్వరికీ లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై 218 కేసులు

- షెడ్యూల్ విడుదల నాటి నుంచి ఇప్పటివరకు నమోదు
- వివరాలను వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి
- ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలపై కేసులు
- తీవ్ర వ్యాఖ్యలు, అనుమతి లేని ర్యాలీలు, కార్యక్రమాలపై నజర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 218 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొందరు ముఖ్యమైన వ్యక్తులపై నమోదైన కేసులను పరిశీలిస్తే.. గత నెల 18న గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ముందస్తు అనుమతి లేకుండా కార్యక్రమం నిర్వహించారని 12 మంది కాంగ్రెస్ నేతలపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలో రేవంత్‌రెడ్డి పోలీసులపై దాడి చేశారని ఫిర్యాదులో ఉన్నా ఆయనపై కేసు పెట్టలేదు. బీఆర్ఎస్ నేత పుట్ట మధుకర్ హంతకుడు, రౌడీ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై గత నెల 21న మంథని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పుట్ట మధుకర్ కులం పేరుతో ఓటు అభ్యర్థించారంటూ అదే పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు పెట్టారు.

వివిధ కారణాలతో కేసులు

కాగజ్‌నగర్‌లోని ఓ మసీదులో సమావేశం నిర్వహించారని బీఎస్పీ సిర్పూర్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై.. సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావును విమర్శిస్తూ నిరసన చేపట్టిన సీపీఐ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌పై కేసులు నమోదయ్యాయి. దారుస్సలాంలో గత నెల 24న ఎంఐఎం నిర్వహించిన బహిరంగ సభలో అనుమతికి మించి జనం పాల్గొనడం, డ్రోన్ కెమెరా వినియోగించిన అంశంలో పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌పై కేసు పెట్టారు. వరంగల్ తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారనే ఆరోపణలతో ఈ నెల 1న కేసు నమోదైంది. అనుమతి లేకుండా టీడీపీ అధినేత చంద్రబాబుతో ర్యాలీ నిర్వహించినందుకు టీడీపీ ప్రధాన కార్యదర్శి జీవీజీ నాయుడుపై కేసు నమోదైంది. నకిరేకల్ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను కులంపేరుతో దూషించారనే ఆరోపణలపై స్థానిక కాంగ్రెస్ అభ్యర్థి నేతి విద్యాసాగర్‌పై కట్టంగూర్ పోలీసులు కేసుపెట్టారు. కాంగ్రెస్ నేతలు మల్‌రెడ్డి రంగారెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులపై సైతం కేసులు నమోదయ్యాయి. ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించిన అంశంలో ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై పంజాగుట్ట పోలీసులు కేసు పెట్టారని సీఈఓ కార్యాలయం తెలిపింది.

పాలేరు నుంచి తమ్మినేని వీరభద్రం

▶ మొదటి పేజీ తరువాయి

కారం పుల్లయ్య, అశ్వారావుపేటలో పిట్టల అర్జున్, పాలేరులో తమ్మినేని వీరభద్రం, మధిరలో పాలడుగు భాస్కర్, వైరాలో భూక్యా వీరభద్రం, ఖమ్మంలో ఎర్ర శ్రీకాంత్, సత్తుపల్లిలో మాచర్ల భారతి, మిర్యాలగూడలో జూలకంటి రంగారెడ్డి, నకిరేకల్‌లో బజ్జ చిన్న వెంకులు, భువనగిరిలో కొండమడుగు నర్సింహ్మ, జనగాంలో మోకు కనకారెడ్డి, ఇబ్రహీంపట్నంలో పగడాల యాదయ్య, పటాన్‌చెరులో జె.మల్లికార్జున్, ముషీరాబాద్‌లో ఎం.దశరథ్ పోటీ చేస్తారని తమ్మినేని ప్రకటించారు. మరో మూడు స్థానాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు.

క్లుప్తంగా...

అవినీతిపరులంతా బీజేపీలోకే: కేజ్రీవాల్

చండీగఢ్: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతిపై పోరాటం పేరిట డ్రామాలు ఆడుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అవినీతిపరులుగా ముద్ర పడిన వారిని బీజేపీలో చేర్చుకొని, మంత్రి పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఆదివారం హరియాణాలోని రోహ్‌తక్‌లో పార్టీ కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. అవినీతిపై మోదీ సర్కారు సాగిస్తున్న పోరాటమంతా నాటకమేనని ధ్వజమెత్తారు. నేరాలు, అవినీతికి పాల్పడిన వారు బీజేపీలో చేరుతున్నారని, దాంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు వారిని ఏమీ చేయలేకపోతున్నాయని పేర్కొన్నారు. బీజేపీలో చేరి రక్షణ పొందుతున్న అక్రమార్కుల జోలికెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కేసుల్లో చిక్కుకొని జైలుకెళ్లిన వారంతా అవినీతి పరులు కాదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఈడీ కేసుల భయంతో బీజేపీలో చేరినవారే అసలైన అవినీతిపరులని తేల్చిచెప్పారు.

అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర క్షిపణి పరీక్ష

మాస్కో: అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతంగా నిర్వహించినట్లు రష్యా ఆర్మీ ఆదివారం ప్రకటించింది. ఈ క్షిపణి అణువార్‌హెడ్లను మోసుకెళ్లగలదని స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌పై కొనసాగిస్తున్న యుద్ధంతో రష్యా, పశ్చిమదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడం, అంతర్జాతీయ అణు పరీక్ష నిషేధ ఒప్పందం నుంచి వైదొలుగుతూ రష్యా పార్లమెంట్ ఆమోదించిన బిల్లుపై అధ్యక్షుడు పుతిన్ గత వారం సంతకం చేసిన సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇంపరేటర్ అలెగ్జాండర్ 3 అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర బులావా క్షిపణిని రష్యా ఉత్తర తెల్ల సముద్రంలో నీటి అడుగు నుంచి పరీక్షించి చూసినట్లు రష్యా రక్షణ శాఖ వివరించింది.

అయోధ్యలో అక్షత పూజ

అయోధ్య: అయోధ్యలో శ్రీరామ మందిరంలో ప్రతిష్ఠాపన పూజలు ఆదివారం సంప్రదాయం ప్రకారం అక్షత పూజతో మొదలయ్యాయి. ఆలయంలోని రామదర్బార్, శ్రీరాముని ఆస్థానంలో పసుపు, దేశవాళీ నెయ్యి కలిపిన 100 క్వింటాళ్ల బియ్యంతో అక్షత పూజ నిర్వహిస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. దేశంలోని 45 ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన 90 మంది ముఖ్యులకు 5 కిలోల మేర అక్షతలను పంపిణీ చేస్తారు. వీరు వీటిని జిల్లాలు, బ్లాకులు, తహసీల్‌లు, గ్రామాల ప్రతినిధులకు అందజేస్తారని ట్రస్ట్ కార్యదర్శి చంపత్‌రాయ్ చెప్పారు. మిగతా అక్షతలను ఆలయంలోని శ్రీరాముని విగ్రహం ఎదురుగా కలశంలో ఉంచుతారు. వీరు ఈ అక్షతలను వీరు వచ్చే జనవరి 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠాపన జరిగేలోగా దేశవ్యాప్తంగా ప్రజలకు పంపిణీ చేయనున్నారని ట్రస్ట్ తెలిపింది.

గ్రెనేడ్ ప్రమాదవశాత్తూ పేలి జవాన్ మృత్యువాత

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్): బీఎస్‌ఎఫ్ జవాను ఒకరు గ్రెనేడ్ ప్రమాదవశాత్తూ పేలడంతో మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. బీఎస్‌ఎఫ్ 70వ బెటాలియన్ జవాన్లు ఎన్నికల విధుల్లో భాగంగా కాటేకల్యాణ్ పోలీస్‌స్టేషన్‌లో మకాం వేశారు. తనిఖీల కోసం బయలుదేరి వెళ్తున్న సమయంలో బల్బీర్ చంద్ అనే జవాను వద్ద పౌచ్‌లో ఉన్న గ్రెనేడ్ ప్రమాదవశాత్తూ పేలింది. తీవ్రంగా గాయపడిన బల్బీర్‌ను వెంటనే దంతెవాడ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయన అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బల్బీర్ చంద్ స్వరాష్ట్రం హిమాచల్ ప్రదేశ్.

గనుల శాఖ మహిళా అధికారి హత్య

బనశంకరి: బెంగళూరులో దారుణం చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్ర గనులు, భూ విజ్ఞానశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కేఎస్ ప్రతిమ(40) అనే అధికారిణి దారుణహత్యకు గురయ్యా. శనివారం రాత్రి 8 గంటలకు ఆమె ఆఫీసు నుంచి దొడ్డకళ్లసంద్రలోని తన అపార్టుమెంటులోని ఫ్లాటుకు చేరుకున్నారు. కొంతసేపటికి గుర్తుతెలియని దుండగులు చొరబడి ఆమెను గొంతుకోసి, చంపి పరారయ్యారు. ఆదివారం ఉదయం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో 8 గంటల సమయంలో స్నేహితులు వచ్చి చూశాక దారుణం వెలుగులోకి వచ్చింది. సుబ్రమణ్యనగర పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె భర్త, ఇంటర్ చదివిన కొడుకు సొంతూరైన శివమొగ్గలోని తీర్థహళ్లి తాలూకాలో ఉంటారు.

ఢిల్లీలో భూటాన్ రాజుకు ఘనస్వాగతం

న్యూఢిల్లీ: భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్‌కు ఆదివారం ఢిల్లీలో భారత ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ విమానాశ్రయంలో ఆయనకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయనతో భేటీ అయ్యారు. భారత్‌లో రాజు వాంగ్‌చుక్ ఎనిమిది రోజుల పర్యటన ఈ నెల 3న అస్సాం రాజధాని గువాహటిలో మొదలైంది. పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో ఆయన సమావేశం కానున్నారు.

శరణార్థి శిబిరాలపై భీకర దాడులు

గాజాలో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం

మూడు శిబిరాలపై దాడులు • 24 గంటల్లో 73 మంది మృతి



ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన మఘాజి శరణార్థి శిబిరం శిథిలాల్లో బాధితుల కోసం పాలస్తీనియన్ల అన్వేషణ

గాజాసిటీ/ఖాన్ యూనిస్/జెరూసలేం: గాజాలోని శరణార్థి శిబిరాలు ఇజ్రాయెల్ వైమానిక దాడులతో దద్దరిల్లుతున్నాయి. సాధారణ పాలస్తీనియన్లు తలదాచుకుంటున్న శిబిరాలపై ఇజ్రాయెల్ సైన్యం నిప్పుల వర్షం కురిపిస్తోంది. హమాస్ మిలిటెంట్లపై ప్రారంభించిన యుద్ధం అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటోంది. సెంట్రల్ గాజాలో శనివారం అర్ధరాత్రి నుంచి కనీసం మూడు శరణార్థి శిబిరాలపై బాంబు దాడులు జరిగాయి. అల్-మఘాజీ రెఫ్యూజీ క్యాంపుపై జరిగిన దాడిలో ఏకంగా 47 మంది మరణించారు. 34 మంది గాయపడ్డారు. జబాలియా క్యాంపులో ఆరుగురు మృతిచెందారు. ఆదివారం బురీజ్ క్యాంప్‌లోని నివాస భవనాలపై జరిగిన వైమానిక దాడిలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 24 గంటల వ్యవధిలో 73 మంది సామాన్య ప్రజలు మృత్యువాత పడడం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మూడు ఘటనల్లో 60 మందికిపైగా జనం క్షతగాత్రులుగా మారారు. వారిని సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్చినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇటీవలే జబాలియా, బురీజ్ క్యాంపులపై జరిగిన దాడుల్లో 200 మందికిపైగా జనం మరణించారు. హమాస్‌తో సంబంధం లేని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేస్తుండడాన్ని అరబ్ దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

అల్-ఖుద్స్ ఆసుపత్రి సమీపంలో పేలుడు

గాజాలో ఆదివారం ఉదయం అల్-ఖుద్స్ హాస్పిటల్ సమీపంలో భారీ పేలుడు సంభవించినట్లు పాలస్తీనా రెడ్ క్రిసెంట్ సొసైటీ వెల్లడించింది. ఆసుపత్రికి కేవలం 50 మీటర్ల దూరంలోని ఓ భవనంపై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడి చేసిందని పేర్కొంది. భవనం చాలావరకు ధ్వంసమైందని, చాలామంది మృతి చెందారని తెలియజేసింది. దీనిపై ఇజ్రాయెల్ సైన్యం స్పందించింది. హమాస్ మిలిటెంట్లు సామాన్య ప్రజల ముసుగులో ఆసుపత్రులు, పాఠశాలల సమీపంలోని మకాం వేస్తున్నారని వివరించింది. ఇజ్రాయెల్-హమాస్ మిలిటెంట్ల మధ్య అక్టోబర్ 7న ప్రారంభమైన ఘర్షణ దాదాపు నెల రోజులకు చేరింది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 9,700 మందికిపైగా మరణించారు. వీరిలో 4,800 మందికిపైగా చిన్నపిల్లలు ఉన్నారు. గాజాపై భూతల దాడుల్లో తమ సైనికులు 29 మంది మృతిచెందారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

గాజాపై అణుబాంబు ప్రయోగిస్తామన్న మంత్రిపై సస్పెన్షన్ వేటు

హమాస్ మిలిటెంట్లను అంతం చేయడానికి గాజాపై అణుబాంబు ప్రయోగించే అవకాశం ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఇజ్రాయెల్ మంత్రిపై సస్పెన్షన్ వేటు పడింది. జెరూసలేం వ్యవహారాల మంత్రి అమిచాయ్ ఎలియాహూ ఆదివారం ఓ ఇంటర్వ్యూలో గాజాలో సాధారణ ప్రజలెవరూ లేరని, అందరూ మిలిటెంట్లే ఉన్నారని అర్థం వచ్చేలా మాట్లాడారు. గాజాపై అణుబాంబు ప్రయోగించే ఐచ్ఛికం కూడా ఉందని చెప్పారు. మంత్రి వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. మంత్రి వ్యవహారంపై ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తీవ్రంగా స్పందించారు. మంత్రిని ప్రభుత్వ సమావేశాల నుంచి నిరవధికంగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం, సైన్యం అంతర్జాతీయ చట్టాల ప్రమాణాల ప్రకారమే నడుచుకుంటున్నాయని నెతన్యాహూ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలపై మంత్రి అమిచాయ్ ఎలియాహూ వివరణ ఇచ్చారు. తన ఉద్దేశాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పుకొచ్చారు.

అబ్బాస్‌తో ఆంటోనీ బ్లింకెన్ భేటీ

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆదివారం వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌తో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం, గాజాలో పాలస్తీనియన్ల ఇబ్బందులపై చర్చించారు. అక్టోబర్ 7 తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో 150 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు.

జర్నలిస్టుకు తీరని దుఃఖం

అల్-మఘాజీ క్యాంపుపై జరిగిన దాడి జర్నలిస్టు మొహమ్మద్ అలలౌల్‌కు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఆయన నలుగురు పిల్లలు, ముగ్గురు తోబుట్టువులను కోల్పోయారు. టర్కిష్ వార్తా సంస్థ అనడోలులో ఆయన ఫ్రీలాన్స్ ఫొటోజర్నలిస్టుగా పని చేస్తున్నారు. తన కుటుంబంతో కలిసి అల్-మఘాజీ క్యాంపులో ఉంటున్నారు. శనివారం రాత్రి ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడుల్లో మొహమ్మద్ కుటుంబం ఉంటున్న ఇళ్లు ధ్వంసమయ్యింది. నలుగురు పిల్లలు, ముగ్గురు తోబుట్టువులు చనిపోయారు. ఆయన భార్య, తల్లి, తండ్రి, మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు.



గాజాస్ట్రిప్‌లోకి ప్రవేశించి మిలిటెంట్లపై భూతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ



తన కూతురు మృతదేహంతో డెయిల్ అల్ బలా ఆస్పత్రి వద్ద పాలస్తీనా జర్నలిస్ట్ మహ్మద్ అల్ అలౌల్



మఘాజ శరణార్థి శిబిరంపై దాడుల అనంతరం తమ ఇంటి వెలుపలికి వచ్చి భయం భయంగా చూస్తున్న బాలిక



గాజా సిటీలోని అల్-షిఫా ఆస్పత్రిలో సరిపోను బెడ్లు లేకపోవటంతో నేల మీదే ఓ బాధితురాలు..




ధ్వంసమైన మఘాజ శరణార్థి శిబిరం సమీపంలోని తమ ఇంటి వద్ద పడిన శిథిలాలను ఊడ్చేస్తున్న చిన్నారులు

ఢిల్లీలో జనం ఉక్కిరిబిక్కిరి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం బెంబేలెత్తిస్తోంది. వాయు నాణ్యత పడిపోతోంది. వరుసగా ఆరో రోజు ఆదివారం సైతం పొగ మంచు దట్టంగా కమ్మేసింది. నగరంలో కాలుష్యం మరోసారి 'అత్యంత తీవ్రం' కేటగిరీలోకి చేరింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) శనివారం సాయంత్రం 4 గంటలకు 415 ఉండగా, ఆదివారం ఉదయం 7 గంటలకు 460గా దిగజారింది. కలుషిత గాలితో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఢిల్లీలో ప్రాథమిక పాఠశాలలకు సెలవులను ప్రభుత్వం మరో ఐదు రోజులపాటు పొడిగించింది. ఈ నెల 10వ తేదీ వరకు సెలవులను పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసింది. 6 నుంచి 12వ తరగతి వరకు స్కూళ్లు తెరిచే ఉంటాయని పేర్కొంది. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు కూడా వినవచ్చని ఢిల్లీ విద్యా శాఖ మంత్రి సూచించారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణాలో పంట వ్యర్థాలను దహనం చేస్తుండడంతో ఢిల్లీలో వాయు నాణ్యత పడిపోతోంది. ప్రపంచంలోని వివిధ దేశాల రాజధానుల కంటే ఢిల్లీలో వాయు నాణ్యత అత్యంత దారుణంగా ఉన్నట్లు ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలింది.

వాణిజ్య వాహనాలకు నో ఎంట్రీ

ఢిల్లీలో వాయు నాణ్యత నానాటికీ పడిపోతుండడం, కాలుష్యం పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిర్మాణ పనులపై నిషేధం విధిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కాలుష్యానికి కారణమయ్యే రవాణా వాహనాలు, వాణిజ్య వాహనాల ప్రవేశాన్ని నిషేధించింది.



మేనిఫెస్టోను చూపుతున్న సీఎం బఘేల్

రుణ మాఫీ, కుల గణన

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి ఈ నెల 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా జరిగే ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. కులగణన, ధాన్యానికి మరింత మద్దతు ధర, రైతులకు రుణామాఫీ, సబ్సిడీ ధరకే వంటగ్యాస్ వంటివి ఇందులో ప్రధాన హామీలుగా ఉన్నాయి. రాజ్‌నందన్‌గావ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం బఘేల్ ఎన్నికల హామీలను ప్రకటించారు. మళ్లీ అధికారమిస్తే.. ఎకరానికి 20 క్వింటాళ్ల వరిధాన్యాన్ని రూ.3,200 చొప్పున కొనుగోలు చేస్తామని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తామని తెలిపారు. తునికాకు స్టాండర్డ్ బ్యాగుకు రూ.4 వేలకు బదులు రూ.6 వేలు చెల్లిస్తామని, సేకరణ దారులకు అదనంగా రూ.4 వేల బోనస్ ఇస్తామని ప్రకటించారు. మహిళలకు వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ ఖాతాల్లోనే జమచేస్తామని చెప్పారు.

గిరిజనులకు చేసిందేమీ లేదు

మధ్యప్రదేశ్‌ను ఏటీఎంగా మార్చుకోజూస్తోంది • కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు



ఖాండ్వా/సియోనీ: దేశాన్ని దాదాపు 60 ఏళ్ల పాటు పాలించినా గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ చేసిందంటూ ఏమీ లేదని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మధ్యప్రదేశ్‌లో ఖాండ్వా, సియోనీ జిల్లాల్లో ఆయన బహిరంగ సభల్లో ప్రసంగించారు. గిరిజనుల సంక్షేమానికి కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు చేపట్టిన చర్యలను వివరించారు. వాజ్‌పేయీ సారథ్యంలోని బీజేపీ సర్కారు దేశంలో తొలిసారి ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రాముని క్షేమం చూసిన, ఆయన్ను పురుషోత్తమునిగా ప్రస్తుతించిన గిరిజనులను పూజించడం బీజేపీ సంస్కృతి అన్నారు. ''కాంగ్రెస్‌కు మాత్రం గాంధీల కుటుంబ క్షేమం తప్ప మరేమీ పట్టదు. మధ్యప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ ముఖ్య నేతలిద్దరూ కొట్టుకుంటున్నారు. తమ కుమారుల రాజకీయ భవిష్యత్తు కోసం ఆరాటపడుతున్నారు. ఇక్కడ ఎలాగోలా అధికారంలోకి వచ్చి, లోక్‌సభ ఎన్నికల ఖర్చుల నిమిత్తం రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అలాంటి పార్టీ బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడం ప్రజల బాధ్యత. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా లక్షలాది కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడింది. దాని నిజ స్వరూపాన్ని అర్థం చేసుకున్న ప్రజలు ఆ పార్టీని ప్రతి ఎన్నికలోనూ ఓడిస్తూ దేశం నుంచి తరిమికొడుతున్నారు''అని మోదీ అన్నారు. ప్రస్తుతం నెలకు రూ.300 ఉన్న నెలవారీ మొబైల్ సేవల చార్జీలు కాంగ్రెస్ గనక అధికారంలో ఉంటే ఏకంగా రూ. 4,000–5,000 దాకా ఉండేవన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చినవాడిగా పేదల కష్టాలేమిటో తనకు తెలుసన్నారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ మధ్య అప్పుడే అధికారం కోసం కీచులాట మొదలైందని ఎద్దేవా చేశారు.

అద్భుత మిజోరం మా లక్ష్యం

ఐజ్వాల్: మిజోరంను అద్భుతంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. మంగళవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఓటర్లను ఉద్దేశించి ఆయన వీడియో సందేశమిచ్చారు. మిజోలు తన కుటుంబ సభ్యులతో సమానమని చెప్పారు. విద్య, వైద్య తదితర అన్ని రంగాల్లోనూ మిజోరంను స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దుతామన్నారు. అక్టోబర్ 30న మిజోరంలో మోదీ ఎన్నికల సభ జరగాల్సి ఉండగా రద్దయింది.

కుల గణనలో ముస్లింలు, యాదవుల సంఖ్యను పెంచారు

బిహార్ సీఎం నితీశ్‌పై హోం మంత్రి అమిత్ షా విమర్శలు

ముజఫర్‌పూర్: బిహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగా రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో ముస్లింలు, యాదవుల సంఖ్యను ఉద్దేశపూర్వకంగానే ఎక్కువ చేసి చూపించిందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. మొత్తమ్మీద వెనుకబడిన కులాల వారికి మొండిచేయి చూపిందని చెప్పారు. ముజఫర్‌పూర్ జిల్లా పటాహీలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ముస్లింల పట్ల అనుసరిస్తున్న బుజ్జగింపు వైఖరి ఫలితంగా నేపాల్, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర సమస్యలు తప్పవని నితీశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇటువంటి రాజకీయాలకు తక్షణమే ముగింపు పలకాలని కోరారు. 'నితీశ్ కుమార్ ప్రధాని పీఠంపై ఆశలు వదులుకోవాలి. అది ఎన్నటికీ జరగదు. ఇండియా కూటమికి కనీసం ఆయన కన్వీనర్ అయినా కాలేకపోయారు. బిహార్‌లో గూండారాజ్యాన్ని తిరిగి రావడానికి ఆయనే బాధ్యుడు'అని ఆరోపించారు. గతంలో కులగణనకు ఆదేశాలు ఇచ్చిన సమయంలో రాష్ట్రంలో నితీశ్ కుమార్ ప్రభుత్వంలో బీజేపీ భాగంగా ఉన్నట్లు ఆయన గుర్తు చేశారు. ఓబీసీలను ఎన్నడూ పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ సైతం ఇప్పుడు అధికారంలోకి వస్తే దేశవ్యాప్త కులగణన చేపడతానంటోందని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో అధికారం పంచుకుంటున్న జేడీయూ, ఆర్జేడీలు ప్రతిపక్ష ఇండియా కూటమిలో కీలకంగా ఉన్నాయంటూ అమిత్ షా, ఈ కూటమి ఏకైక ఎజెండా ప్రధాని మోదీని వ్యతిరేకించడమేనన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని ఈ కూటమి పార్టీలు వ్యతిరేకించాయని కూడా మంత్రి చెప్పారు. కేంద్ర కేబినెట్‌లో 27 మంది మంత్రులు, అంటే 35 శాతం మంది వెనుకబడిన కులాలకు చెందిన వారేనన్నారు. ప్రధాని మోదీ హయాంలోనే ఓబీసీల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించామన్నారు.



కేదార్‌నాథ్‌ను దర్శించుకున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రైవేట్ హెలికాప్టర్‌లో ఆయన అక్కడికి చేరుకున్నారు. ''కేదార్‌నాథ్ క్షేత్రాన్ని దర్శించుకొని పూజలు చేయడం ఆనందంగా ఉంది. హర హర మహాదేవ్'' అంటూ ఫేస్‌బుక్‌లో రాహుల్ పోస్టు చేశారు. ఆలయాన్ని దర్శించుకున్న ఫొటోను కూడా షేర్ చేశారు. సముద్ర మట్టానికి 3,584 మీటర్ల ఎత్తులో ఆలయం ఉంది.

కాంగ్రెస్ పార్టీ మోసకారి: అఖిలేశ్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ 'ఇండియా' కూటమిలోని కీలకమైన కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఆ పార్టీ మహా మోసకారి అని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గానీ, బీజేపీకి గానీ ఓటేయరాదని ఓటర్లను ఆయన కోరారు. ఈ రెండు పార్టీలు ప్రకటించిన పథకాలు, హామీలు అమలయ్యేవి కావని చెప్పారు. ఆదివారం టికమ్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ..'రేషన్ అందనప్పుడు బీజేపీకి ఎందుకు ఓటేయడం? కాంగ్రెస్‌కు కూడా వద్దు. ఆ పార్టీ చాలా మోసకారి. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ కులగణన అంటోంది'అని అఖిలేశ్ అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీయే కుల ఆధారిత సర్వేను నిలిపివేసింది. మండల్ కమిషన్ సిఫారసులకు కూడా అడ్డుపుల్ల వేసింది. బీజేపీ కూడా అదే దారిలో వెళుతోంది. కులగణన కోసం డిమాండ్లు తీవ్రం కావడంతో కాంగ్రెస్ ముందుకు వచ్చి తాము చేపడతామని చెబుతోంది. బీసీల రిజర్వేషన్లను వ్యతిరేకించే బీజేపీ కూడా కుల గణన గురించి మాట్లాడుతోంది'అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ముఖ్యంగా ఆదివాసీ, దళిత మహిళలు ఎంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. బీజేపీ నమ్మేది ప్రజాస్వామ్యాన్ని కాదు, లూటీ స్వామ్యాన్ని అని వ్యాఖ్యానించారు. ఇలా ఉండగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని ధీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో ప్రతిపక్షాలతో ఏర్పాటైన ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఎస్పీలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు కొన్ని సీట్లు కేటాయించాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్ పక్కన బెట్టడంతో పోటీగా కొన్ని సీట్లలో ఎస్పీ సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించింది. ఈ వ్యవహారంలో రెండు పార్టీల మధ్య విభేదాలు ముదిరాయి.

Interview



రాజకీయ పార్టీల్లో సైద్ధాంతిక ఆచరణ విధానం లోపిస్తోంది

అది ప్రజాస్వామ్యానికే ప్రమాదం

ఓటరు నైతిక హక్కుపై డబ్బు, ప్రలోభాలతో అనైతిక దాడి

పార్టీల విధానం.. ఆచరణకు పోలికేదీ?

జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

వనం దుర్గాప్రసాద్

రాజకీయపార్టీల్లో సైద్ధాంతిక ఆచరణ విధానం లోపించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని అంటున్నారు జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి. చట్టాల్లోని నిర్దేశిత సూత్రాలు వాస్తవ రాజకీయ ముఖచిత్రంలో కనిపించడం లేదని, ఎన్నికల్లో డబ్బు ఎరచూపి, పౌరుల హక్కులపై పార్టీలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. పార్టీలిచ్చే పోటీ వాగ్దానాలు వేలం పాటలను తలపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. సంక్షేమం పేదవాడి అభ్యున్నతికి వెన్నుపూసలాంటిదని చెప్పారు. మితిమీరిన హామీలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేస్తాయన్నారు. హామీల చక్రబంధంలో ఇరుక్కున్న ప్రజలు మేల్కోవాలని పిలుపునిచ్చారు. న్యాయమూర్తిగా సుదీర్ఘకాలం పనిచేసిన నేపథ్యం ఆయనది. ఏపీఈఆర్సీ చైర్మన్‌గా విద్యుత్‌రంగాన్ని గాడిలో పెట్టిన అనుభవం ఆయన సొంతం. ఎన్నికల వేళ 'సాక్షి'తో ఆయన అనేక అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఏమన్నారో ఆయన మాటల్లోనే...

ఆ సిద్ధాంతాలేవి?

అన్ని పార్టీల సిద్ధాంతాలు ఘనంగా ఉంటాయి. కానీ, అవన్నీ నేతల ఆచరణలో కనిపించకపోవడం విడ్డూరం. ఎన్నికల వ్యయాన్నే తీసుకోండి. దీనికి పరిమితి ఉంది కదా? ఏ పార్టీ నాయకుడైనా నిర్దేశించిన పరిమితిలోనే ఖర్చు చేస్తున్నారా? లేనే లేదు. విపరీతంగా ఖర్చు పెడుతున్నారు. అలా చెయ్యకపోతే గెలవలేరు. అసలీ విషయంపై ఎవరూ మాట్లాడరేం? చట్ట విరుద్ధమని తెలిసినా మౌనంగా ఉంటారేం? తమ ఆకాంక్షలకు తగ్గవారిని ఎన్నుకోవడం ప్రజల హక్కు. ఈ హక్కును డబ్బుతో ముడిపెడుతున్నారు. ఇది రానురాను దిగజారుతోంది. మునుగోడు ఉప ఎన్నికల్లో నాయకుడు చెప్పినంత ఇవ్వలేదని ఓ గ్రామంలో ప్రజలు ధర్నా చేశారు. ఇది దౌర్భాగ్య పరిస్థితి కాదంటారా? ప్రజల నైతికతను డబ్బు అనైతికంగా కొనేస్తోందనడానికి ఇదే సాక్ష్యం. ఈ విషయంలో ప్రజలు జాగృతం కావాలి. డబ్బులకు ప్రలోభ పడొద్దు. ఓటును బలమైన ఆయుధంగానే భావించాలి.

వేలం వెర్రి హామీలు

అన్ని పార్టీలూ పోటీపడి హామీలిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే వేలం వెర్రిగా గుప్పిస్తున్నాయి. ఇది ఓ రకంగా ప్రజలను మోసం చేయడమే. అలవి కాని హామీలు ఎలా నెరవేరుస్తారు? గెలవడమే పార్టీలకు గీటురాయిగా మారింది. పార్టీల మేనిఫెస్టోకు ఎలాంటి చట్టబద్ధత ఉండదు. అందుకే ఇచ్చే హామీలు ఒకలా ఉంటాయి. అమలు వేరోలా ఉంటాయి. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలకు సవాలక్ష షరతులు పెడతారు. లబ్ధిపొందే వారి సంఖ్యను భారీగా కుదిస్తారు. దీన్ని మోసం కాదంటారా? 20 ఏళ్లక్రితం ఇలాంటి పరిస్థితి చాలా తక్కువ. ఇప్పుడే విపరీతమైన పరిస్థితి. హామీలివ్వడం నేతలకు అలవాటైంది. వాటికోసం ఎదురుచూడటం ఓటర్లకు రివాజు అయ్యింది. అంతిమంగా ప్రజలు హామీల చక్రబంధంలో ఇరుక్కుంటున్నారు. మితిమీరిన హామీలిస్తే ఆర్థిక పరిస్థితి ఎంత దెబ్బతింటుందనేది ఆలోచించడం లేదు. మోసపూరిత హామీలను నమ్మొద్దు.

పవర్ పాలిటిక్స్ మంచిది కాదు..

విద్యుత్ అంశం రాజకీయ ఆయుధమైంది. ఈ విషయంలో అన్ని పార్టీలూ పోటీ పడుతున్నాయి. ప్రజలను తప్పుదారి పట్టించేకు ప్రయత్నిస్తున్నాయి. జనం వాస్తవాలు తెలుసుకునే అవకాశమే ఇవ్వడం లేదు. ఈ నేరం ముమ్మాటికీ రాజకీయ పార్టీలదే. 1969లో పరిశ్రమలకు యూనిట్‌కు 10 పైసల విద్యుత్ ఉండేది. కానీ వ్యవసాయానికి 11 పైసలుండేది. ఉచిత విద్యుత్ తెచ్చింది దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఇప్పుడు అన్ని పార్టీలూ వ్యవసాయ విద్యుత్‌ను రాజకీయ అస్త్రం చేసుకుంటున్నాయి. ఇవ్వొచ్చు. తప్పులేదు. విద్యుత్ చట్టం ప్రకారం వాడే విద్యుత్‌ను లెక్కగట్టాలి. ఈ పని జరగకుండా నేతలు రాజకీయం చేస్తున్నారు. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను డిస్కమ్‌లకు ప్రభుత్వాలు ముందే చెల్లించాలి. అప్పుడే డిస్కమ్‌లు ఆర్థికంగా బాగుంటాయి. దీన్ని పక్కనబెడుతున్నారు. మీటర్లు.. మోటర్ల రాజకీయంతో ప్రజలను కరెంట్ వాస్తవాలు తెలియకుండా పక్కదారి పట్టిస్తున్నారు. మీటర్లు పెడితే తమ ఉచిత హక్కు హరించేస్తారనే భయం కల్పిస్తున్నారు. ఈ పాలిటిక్స్ మంచిది కానేకాదు.

యువతకు ఉపాధి కల్పన పార్టీల ఎజెండా కావాలి

ప్రభుత్వ ఉద్యోగాలు ఇక కలే. దీన్ని యువత గుర్తించేలా అన్ని పార్టీలు అవగాహన కల్పించాలి. ఉపాధి కల్పన పార్టీల ఎజెండా కావాలి. హైదరాబాద్ మౌలిక వసతుల కల్పనలోనూ మెరుగ్గా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి అవకాశాలు పెంచాలి. పరిశ్రమలు విస్తరించేలా చూడాలి. అన్నింటికన్నా ముందు విద్యావ్యవస్థలో మార్పు తేవాలి. పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చే నైపుణ్యం అవసరం. ఇది విద్యార్థి దశ నుంచే జరగాలి. చదువుకునేటప్పుడే ఏదో ఒక నైపుణ్యం కల్పించాలి. అమెరికాలోనైతే విద్యార్థి ఆసక్తిని గుర్తిస్తారు. అందులో మొదట్నుంచీ శిక్షణ ఇస్తారు. పార్టీలకతీతంగా యువతలో 'సైంటిఫిక్ టెంపర్‌మెంట్' తీసుకురావాలి. ఇందులో విజయవంతమయ్యే ప్రభుత్వాలే యువతను తమ వెంట ఉంచుకోగలవు. ఓటు ప్రతి ఒక్కరి ఆయుధం. సమాజానికి పనికొచ్చే వారిని గుర్తించి మరీ ఓటు వేయాలి. అప్పుడే రాష్ట్రానికి మేలు జరుగుతుంది.

గాసిప్ టైమ్



బాస్ రెండు చోట్లా పోటీ అంటూ.. రెండింతల వసూళ్లు

'మన చీఫ్ రెండు సీట్లలో పోటీ చేస్తున్నారు. ఖర్చులకు డబ్బులు కావాలి. సీటుకో రూ. ఐదు లక్షల చొప్పున ఇవ్వాలి' అంటూ ఓ పార్టీకి చెందిన నాయకుడు ఫోన్‌లో మాట్లాడిన మాటలు లీక్ కావడం తాజాగా ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. ఫోన్ కాల్ ఫేకో... లేదా నిజంగానే అడిగారో తెలియదు గానీ.. సదరు పార్టీ చీఫ్ పోటీ చేస్తారని చెప్పిన రెండో సీటును తాజాగా ప్రకటించిన జాబితాలో వేరే నేతకు కేటాయించారు. 'సారు దక్షిణ తెలంగాణలోని సొంత సీటును వదిలి ఉత్తర తెలంగాణ నుంచి పోటీ చేస్తుంటే.. మరి రెండు సీట్లలో పోటీ చేస్తున్నారని క్యాండిడేట్ల దగ్గర పైసలు వసూలు చేయడమేంటి.. ఇంకా ఎంతమంది ఇలా చేస్తున్నారో?' అని ఆ పార్టీ వర్గాలు కిందామీదా పడుతున్నాయి.

- సాక్షి, హైదరాబాద్



మెజారిటీ.. మ్యాజిక్ ఫిఫ్టీ పంచ్

33 చోట్ల అరలక్ష ఓట్ల కంటే ఎక్కువ ఆధిక్యత

తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీలు

సిద్దిపేట, సిరిసిల్లతో సహా ఐదారు చోట్ల వరుసగా 50 వేలు దాటుతున్న మెజారిటీ


మేకల కళ్యాణ్ చక్రవర్తి

అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడమంటేనే ఓ కిక్కు..1000లోపు ఓట్లతో గెలిస్తే అబ్బా.. చాలా తక్కువ మెజారిటీ వచ్చిందే.. అయినా బుల్లెట్ దిగిందా లేదా.. అంటారు. 10వేలు దాటితే ఫర్వాలేదంటారు..20వేలు దాటితే ఇరగదీశాడని మెచ్చుకుంటారు..30వేలు దాటితే ఏదో మ్యాజిక్ చేశాడంటారు..40వేలు దాటిందంటే నెవర్ బిఫోర్ అని సర్టిఫికెట్ ఇచ్చేస్తారు..అదే 50వేల మెజారిటీ దాటిందంటే...ఇక ఆ కిక్కే వేరు. లాస్ట్ పంచ్ మనదైతే ఎంత కిక్కు ఉంటుందో 50వేల మెజారిటీ దాటిందంటే అంతకంటే ఎక్కువే కిక్కొస్తుంది. తెలంగాణలో జరిగిన అనేక ఎన్నికల్లో చాలా మంది అభ్యర్థులు ఈ కిక్కు.. అదే ఘనత సాధించారు. ఆ జాబితాలో సీఎం కేసీఆర్‌తో సహా పలువురు రాష్ట్రమంత్రులు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు. కొన్ని స్థానాల్లో అయితే వరుసగా రెండు, మూడు దఫాలుగా ఒకే అభ్యర్థికి 50వేల కంటే ఎక్కువ మెజారిటీ ఇస్తున్నారు ఆయా నియోజకవర్గాల ప్రజలు. ఇక మరో విశేషమేమిటంటే... ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని 22 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ఏ పార్టీకి చెందిన అభ్యర్థికి కూడా 50 వేల మెజారిటీ రాలేదు. అంటే ఆయా స్థానాల్లో మరీ ఏకపక్షంగా పోలింగ్ ఎప్పుడూ జరగదని, ఎన్నికలెప్పుడు జరిగినా సీన్ సితారేనని అర్థమవుతోంది.

ఏయే నియోజకవర్గాల్లో ఎవరెవరు, ఎప్పుడు 50 వేల కంటే ఎక్కువ మెజారిటీ సాధించారంటే

- 2014 ఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి చిన్నం దుర్గయ్య (టీఆర్ఎస్) తన సమీప ప్రత్యర్థి గుండా మల్లేశ్ (సీపీఐ)పై 52,528 ఓట్ల ఆధిక్యత సాధించారు.
- ఇవే ఎన్నికల్లో మంచిర్యాల నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు తన ప్రత్యర్థి అరవింద్‌రెడ్డి (కాంగ్రెస్)పై 59,250 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అయితే, 2010లో జరిగిన ఉప ఎన్నికలో అరవింద్‌రెడ్డి టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి జి. హనుమంతరావు (టీడీపీ)పై ఏకంగా 78,047 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 2011లో జరిగిన ఉప ఎన్నికలో బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి (టీఆర్ఎస్) సరిగ్గా 50వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై గెలిచారు.
- 2004లో కామారెడ్డి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన షబ్బీర్‌అలీ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి మురళీధర్‌గౌడ్‌పై 52,763 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 2010 ఉప ఎన్నికలో కోరుట్ల నుంచి జువ్వాడి రత్నాకర్‌రావు (కాంగ్రెస్)పై కె.విద్యాసాగర్‌రావు (టీఆర్ఎస్) 56,525 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- 2018లో జగిత్యాల నుంచి గెలిచిన సంజయ్‌కుమార్ (టీఆర్ఎస్), కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై 61,125 ఓట్ల ఆధిక్యత సాధించారు.
- 2010 ఉప ఎన్నికలో ధర్మపురి నుంచి గెలిచిన కొప్పుల ఈశ్వర్‌కు కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై 58,891 ఓట్ల ఆధిక్యత లభించింది. అదే 2018 ఎన్నికల్లో ఈశ్వర్ కేవలం 441 ఓట్ల తేడాతో అదే లక్ష్మణ్‌కుమార్‌పై విజయం సాధించడం గమనార్హం. ఇక కొప్పుల ఈశ్వర్ 2004 ఎన్నికల్లో రామగుండం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా 56,563 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ అభ్యర్థి మూలం మల్లేశంపై గెలిచారు.
- పెద్దపల్లి నియోజకవర్గంలో 2014లో జరిగిన ఎన్నికల్లో దాసరి మనోహర్‌రెడ్డి (టీఆర్ఎస్) 62,677 ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ అభ్యర్థి భానుప్రసాదరావుపై గెలిచారు.
- చొప్పదండిలో 2014లో బొడిగె శోభ (టీఆర్ఎస్) తన సమీప ప్రత్యర్థి సుద్దాల దేవయ్య (కాంగ్రెస్)పై 54,981 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 2010 ఉప ఎన్నికలో వేములవాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై టీఆర్ఎస్ అభ్యర్థి చెన్నమనేని రమేశ్ 50,451 ఓట్ల మెజారిటీ సాధించారు.
- హుజూరాబాద్ నుంచి 2010 ఉప ఎన్నికల్లో 79,227, 2014 సాధారణ ఎన్నికల్లో 57,037 ఓట్ల మెజారిటీని ఈటల రాజేందర్ సాధించగలిగారు.
- నారాయణ్‌ఖేడ్‌లో 2016 ఉప ఎన్నిక, 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి వరుసగా 53,625 ఓట్లు, 58,508 ఓట్ల ఆధిక్యత సాధించారు.
- నాగర్‌కర్నూల్‌లో మర్రి జనార్దనరెడ్డి 2018 ఎన్నికల్లో 54354 ఓట్ల తేడాతో నాగం జనార్దనరెడ్డి (కాంగ్రెస్)పై గెలిచారు.
- దుబ్బాక నియోజకవర్గంలో సోలిపేట రాంలింగారెడ్డి (టీఆర్ఎస్) తన సమీప ప్రత్యర్థి నాగేశ్వర్‌రెడ్డి (కాంగ్రెస్)పై 66,421 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- సంగారెడ్డిలో 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కె. సదాశివరెడ్డి తన ప్రత్యర్థి పి. రామచంద్రారెడ్డి (కాంగ్రెస్)పై 57,550 ఓట్ల మెజారిటీ సాధించారు.

ఖమ్మం, నల్లగొండ జిల్లాల నేతలకు 50,000 మెజారిటీ అందని ద్రాక్షే



గ్రేటర్ హైదరాబాద్‌లోనూ..

- 2018 ఎన్నికల్లో మల్కాజిగిరిలో మైనంపల్లి హనుమంతరావు (టీఆర్ఎస్) 73,968 ఓట్ల మెజారిటీ సాధించారు.
- రాజేంద్రనగర్‌లో ప్రకాశ్‌గౌడ్ 2018 ఎన్నికల్లో 57,331 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2014 ఎన్నికల్లో అరికెపూడి గాంధీ తన సమీప ప్రత్యర్థి శంకర్‌గౌడ్ పై శేరిలింగంపల్లి నుంచి 75,904 ఓట్ల ఆధిక్యత సాధించారు.
- ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్న జి.కిషన్‌రెడ్డి 2014 ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి వై. సుధాకర్‌రెడ్డిపై 62,598 ఓట్ల ఆధిక్యత సాధించారు.

పాతబస్తీలో అలవోకగా లక్ష ఓట్ల మెజారిటీ

- చార్మినార్ స్థానం నుంచి అసదుద్దీన్ ఓవైసీ 1999లో 93,505 ఓట్ల ఆధిక్యత సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం నుంచే పోటీ చేసిన అహ్మద్ పాషా ఖాద్రి తన సమీప ప్రత్యర్థి తయ్యబా తస్లీం (టీడీపీ)పై 1,07,921 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- చాంద్రాయణగుట్ట నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) గత రెండు ఎన్నికల్లోనూ 50వేల కంటే ఎక్కువ మెజారిటీ సాధించారు. 2014లో 59,279 ఓట్లు, 2018లో 80,263 ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు.
- బహదూర్‌పుర నుంచి మౌజంఖాన్ వరుసగా మూడు సార్లుగా 50వేల కంటే ఎక్కువ ఓట్ల ఆధిక్యత సాధిస్తున్నారు. 2009లో 56,735 ఓట్లు, 2014లో 95,045 ఓట్లు, 2018లో 82,518 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

గత ఎన్నికల్లో అరలక్ష దాటిన మంత్రులు

- ప్రస్తుతం మంత్రిగా ఉన్న వి.శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ నుంచి 2018 ఎన్నికల్లో తన ప్రత్యర్థి ఎం.చంద్రశేఖర్ (టీడీపీ)పై 57,775 ఓట్ల మెజారిటీ సాధించారు.
- ఇదే ఎన్నికల్లో వనపర్తి నుంచి మరో మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి 51,685 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- పాలకుర్తి నుంచి ప్రస్తుత మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాఘవరెడ్డిపై 53,053 ఓట్ల ఆధిక్యత సాధించారు.
- మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి 2018 ఎన్నికల్లో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కాంగ్రెస్)పై 88,066 ఓట్ల ఆధిక్యత సాధించారు.



అత్యధిక మెజారిటీ రికార్డు విష్ణుదే

ఉమ్మడి ఏపీలో 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో మాజీ మంత్రి పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి అత్యధిక మెజారిటీ సాధించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పోటీ చేయకపోవడంతో లోక్‌సత్తా అభ్యర్థి కఠారి శ్రీనివాసరావుపై 1,96,269 ఓట్ల ఆధిక్యత సాధించారు.



ఒక్కసారే కేసీఆర్‌కు..

సీఎం కేసీఆర్ మాత్రం 50 వేల కంటే ఎక్కువ మెజారిటీతో ఒకే ఒక్కసారి గెలిచారు. 2018 ఎన్నికల్లో వి.ప్రతాప్‌రెడ్డి (కాంగ్రెస్)పై 56,922 ఓట్ల ఆధిక్యత సాధించారు.

లక్షకు దగ్గరగా ఆరూరి రమేశ్

వర్ధన్నపేటలో ఆరూరి రమేశ్ వరుసగా రెండుసార్లు 50 వేల ఓట్ల మెజారిటీ సాధించారు. 2014లో 86,349 ఓట్లు, 2018లో 97,670 ఓట్ల ఆధిక్యత ఆయనకు లభించింది.

వరంగల్ వెస్ట్ నియోజకవర్గం నుంచి దాస్యం వినయ్‌భాస్కర్ 2014 ఎన్నికల్లో 56,304 ఓట్ల ఆధిక్యత సాధించారు. అంతకుముందు జరిగిన 2010 ఉప ఎన్నికల్లో 67,524 ఓట్ల మెజారిటీ ఆయనకు వచ్చింది.

ఈస్ట్ నుంచి 2014 ఎన్నికల్లో కొండా సురేఖ 55085 ఓట్ల ఆధిక్యతతో టీఆర్ఎస్ నుంచి గెలిచారు.





మెజారిటీ పెంచుకుంటూ కేటీఆర్.. లక్ష దాటిన హరీశ్

రాష్ట్ర మంత్రి కేటీఆర్ సిరిసిల్ల నుంచి మూడోసారి వరుసగా భారీ మెజారిటీ సాధించారు. 2009లో కేవలం 171 ఓట్లతో గెలిచిన ఆయన 2010 ఉప ఎన్నికల్లో ఏకంగా 68,220 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఆ తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లో 53,004 ఓట్లు, 2018లో 89,009 ఓట్ల మెజారిటీ సాధించడం గమనార్హం. సిద్దిపేట నుంచి మరో మంత్రి హరీశ్‌రావు కూడా వరుసగా ఐదుసార్లు 50 వేల కంటే ఎక్కువ మెజారిటీ సాధించారు. 2008 ఉప ఎన్నికల్లో 58,935, 2009లో 64,677, 2010 ఉప ఎన్నికల్లో 95,858, 2014లో 93,328 మెజారిటీ సాధించగా, ఇక, 2018 ఎన్నికల్లో ఆయన ఆధిక్యత లక్ష ఓట్లు దాటింది. ఈ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి శ్రీనివాస్ రెడ్డి (కాంగ్రెస్)పై 1,18,699 ఓట్ల మెజార్టీతో గెలిచి తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించారు.

ఓట్ల కోసం మా ఇంటికి రావొద్దు

మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలోని ఓ ఓటరు ఆది సంపత్‌కుమార్ తన ఇంటి ఎదుట గేటుకు ఇలా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'ఎన్నో ఏళ్లుగా, ఎన్నో రకాలుగా మా ప్రధాన సమస్య మురికి కాల్వ కోసం మీకు చాలాసార్లు మొర పెట్టుకున్నాం. అయినా మా బాధలు మీకు పట్టలేదు. మా సమస్య తీర్చలేదు. మా పిల్లలతో సహా ఇంటిల్లిపాది ఆ మురికి కాల్వ కారణంగా దోమల మోత, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నాం. ఆర్థికంగా నష్టపోతున్నాం. మా బాధలు పట్టని మీకు మా ఓట్లు అడిగే అర్హత లేదు. ఓట్ల కోసమైతే మా ఇంటికి రాకండి...రాజకీయ పార్టీల నాయకులారా'.. అంటూ ఫ్లెక్సీలో రాసుకొచ్చాడు.



డబుల్ హ్యాట్రిక్ @ అహ్మద్ ఖాన్



చార్మినార్: ఒకసారి.. రెండు సార్లు కాదు.. ఏకంగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక మైనారిటీ నేతగా ముంతాజ్ అహ్మద్‌ఖాన్ రికార్డు సృష్టించారు. 1994లో మజ్లిస్ బచావ్ తహ్రీక్(ఎంబీటీ) పార్టీ టికెట్‌పై యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మొదటిసారి ఆయన గెలిచారు. అనంతరం మజ్లిస్ పార్టీలో చేరి అదే సెగ్మెంట్ నుంచి వరుసగా 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో మాత్రం యాకుత్‌పురా సెగ్మెంట్ వదిలి ఎంఐఎం తరఫున చార్మినార్ సెగ్మెంట్ నుంచి పోటీ చేసి గెలుపొంది డబుల్ హ్యాట్రిక్ సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం ఎంఐఎం చార్మినార్ టికెట్ మాజీ మేయర్ మీర్ జుల్ఫికర్ అలీకి కేటాయించింది. దీంతో ముంతాజ్ అహ్మద్‌ఖాన్ రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

జంగ్ తెలంగాణ

బీఆర్ఎస్ బహుముఖ వ్యూహం

50 మంది ఓటర్లకో లీడర్!

కేసీఆర్ పోటీ చేస్తుండటంతో ప్రత్యేక దృష్టి

మంత్రులతో కుల సంఘాల సమావేశాలు

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షణలో నియోజకవర్గంలో బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతోంది. గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు బూత్ కమిటీలను నియమించిన పార్టీ.. కుల సంఘాల మద్దతు కూడగట్టేందుకు ఆయా సామాజిక వర్గాలకు చెందిన మంత్రులను రంగంలోకి దింపింది. ప్రత్యర్థి పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు చేరికలపైనా ఫోకస్ చేసింది. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తారన్న ప్రకటన వెలువడకముందే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు విడుదల చేసింది. దళితబంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు వంటి సంక్షేమ పథకాల్లో ఎక్కువ యూనిట్లు కేటాయించారు. మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. ఆలయాలు, కుల సంఘాల భవనాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. కేసీఆర్ అభ్యర్థిత్వం ఖరారయ్యాక మంత్రి కేటీఆర్ కామారెడ్డిపై ఫోకస్ మరింత పెంచారు.

బూత్ కమిటీలతో ప్రచారం..: 266 పోలింగ్ బూత్‌లుండగా, ప్రతి బూత్‌కు పది మందితో కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ గ్రామానికి చెందిన గ్రామ/మండల/ నియోజకవర్గ/ జిల్లా స్థాయి లీడర్‌ను బూత్ కమిటీకి ఇన్‌చార్జ్‌గా నియమించారు. 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్ ఉండేలా బూత్ కమిటీలు ఏర్పాటయ్యాయి. రోజూ బూత్ కమిటీ సభ్యులు తమకు కేటాయించిన యాభై మంది ఓటర్ల ఇళ్లకు వెళ్లడం, మేనిఫెస్టోను వివరించడంతో పాటు ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి జరిగిన ప్రయోజనాలను చెప్పి ఓట్లు అభ్యర్థించాలన్నది ఈ కమిటీల ఏర్పాటు ఉద్దేశం.

కుల సంఘాలతో ములాఖత్‌లు..: వివిధ కుల సంఘాలతో ఆయా సామాజికవర్గాలకు చెందిన మంత్రులు సమావేశమవుతున్నారు. ఆదివారం మైనారిటీలతో ఏర్పాటు చేసిన సమావేశానికి హోం మంత్రి మహమూద్ అలీ హాజరయ్యారు. బీఆర్ఎస్ మైనారిటీల సంక్షేమం కోసం చేసిన కార్యక్రమాలను వివరించారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గౌడ కులస్తులతో జరిగిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. రెడ్డి సంఘం సమావేశానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా.. ఆ సమావేశం వాయిదా పడింది. పద్మశాలి కులస్తులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రమణ పాల్గొన్నారు. ఎస్సీ కుల సంఘాలతో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే రసమయి హాజరుకావాల్సి ఉండగా.. ఆయన కార్యక్రమం రద్దయింది. ప్రభుత్వ విప్ గంప గోవర్దన్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి ఆ సమావేశంలో పాల్గొని ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. యూత్‌తో నిర్వహించే సమావేశానికి బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్‌లను రప్పిస్తున్నారు. ఇలా కామారెడ్డిలో విజయం కోసం బీఆర్ఎస్ పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతోంది.




మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, వేదికపై జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

శ్రీశైలం నోముల

రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇతర జిల్లాలతో పోలిస్తే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న జిల్లా ఇదే. పల్లె, పట్నం కలబోత జిల్లాగా శరవేగంగా విస్తరిస్తూ ఐటీ, పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకుపోతూ ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోంది. మొదట్లో టీడీపీ, కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ జిల్లా రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్‌కు అండగా నిలిచింది. ఈ ఎన్నికల్లోనూ తమ సత్తా చాటేందుకు అధికార బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండగా, మళ్లీ పట్టు బిగించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది.

రసవత్తరం రంగారెడ్డి



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రౌండప్

పట్టు నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ● కాంగ్రెస్‌లో 'కొత్త' జోష్ ● అర్బన్ ఏరియాలపై బీజేపీ ఆశ

సాక్షి స్పెషల్ స్కాన్

ప్రచారంలో జెట్ స్పీడులో కారు


ఇక్కడ మొత్తం 17 నియోజకవర్గాలు ఉండగా, 2014లో టీఆర్ఎస్ ఏడు స్థానాల్లో విజయం సాధించగా, ఆరు స్థానాల్లో టీడీపీ గెలుపొందింది. ఒక స్థానంలో బీజేపీ విజయం సాధించింది. 2018 నాటికి టీడీపీ పూర్తిగా కనుమరుగైంది. 14 స్థానాలను టీఆర్ఎస్ దక్కించుకోగా, కేవలం మూడు స్థానాలే హస్తగతమయ్యాయి. ఆ తర్వాత మహేశ్వరం నుంచి గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ నుంచి గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, తాండూరు నుంచి గెలుపొందిన పైలెట్ రోహిత్‌రెడ్డి కూడా చేయిచ్చి ..కారెక్కారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే కొనసాగారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో అధిష్టానం ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడంతో పార్టీ బీ ఫాం తీసుకుని ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాగా జిల్లాలోని మెజారిటీ ఎమ్మెల్యేలు, కుటుంబ సభ్యులపై భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, అవినీతి వంటి ఆరోపణలున్నాయి. ఇక ఉప్పల్ సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చడంతో ఆయన ఆ పార్టీపై గుర్రుగా ఉన్నారు. మల్కాజిగిరి హన్మంతరావు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ అంతర్గత కుమ్ములాటలకు తోడు కాంగ్రెస్, బీజేపీల నుంచి గట్టి పోటీ ఎదరవుతుండటంతో అధికార పార్టీ అభ్యర్థులకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది.

చేరికలతో 'చేతి'కి జీవం

తెలంగాణ ఏర్పాటు తర్వాత వరుస పరాజయాలతో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్‌కు కీలక నేతల చేరికలు మళ్లీ జీవం పోశాయి. తుక్కుగూడ వేదికగా ఇటీవల నిర్వహించిన పార్టీ విజయోత్సవ సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంతరావు, తాండూరులో డీసీసీ చైర్మన్ బి.మనోహర్‌రెడ్డి, షాద్‌నగర్‌లో చౌల ప్రతాప్‌రెడ్డి సహా పలువురు జెడ్పీటీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మహేశ్వరంలో చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, ఇబ్రహీంపట్నంలో సిద్ధంకి కృష్ణారెడ్డి, శేరిలింగంపల్లిలో జగదీశ్వర్‌గౌడ్ చేరికలు ఆ పార్టీకి జీవం పోశాయి. గత ఎన్నికల్లో పార్టీ నుంచి గెలుపొంది, ఆ తర్వాత పార్టీని వీడిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి టార్గెట్‌గా మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని బరిలోకి దించింది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌ను రంగంలోకి దింపింది. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, స్వల్ప మెజారిటీతో ఓటమి పాలైన మల్‌రెడ్డి రంగారెడ్డిని ఇబ్రహీంపట్నం నుంచి బరిలోకి దింపింది. కారు దిగి హస్తం గూటికి చేరిన కసిరెడ్డిని కల్వకుర్తి నుంచి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డిని తాండూరు నుంచి రంగంలోకి దింపి అధికార పార్టీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తోంది.

బీజేపీ ఫోకస్

ఉమ్మడి జిల్లాపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. 2014లో ఉప్పల్ మినహా ఇతర నియోజకవర్గాల్లో గెలువలేక పోయింది. 2018 లోనూ కారు ధాటికి తట్టుకోలేక పోయింది. అర్బన్ ఓటర్లే లక్ష్యంగా ఈ సారి పావులు కదుపుతోంది. పార్టీ జాతీయ సమావేశాలు కూడా జిల్లా వేదికగా నిర్వహించింది. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు నేతలు జిల్లాలో పర్యటించి పార్టీ పటిష్టత కోసం కృషి చేశారు. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, ఎల్బీనగర్, ఉప్పల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, వికారాబాద్, తాండూరు, పరిగి, నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సొంత గడ్డగా భావించే మహేశ్వరం నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు తీవ్రంగా యత్నిస్తోంది.



రాజకీయాస్త్రాలుగా 111జీఓ, ధరణి సమస్యలు

రైతుబంధు, దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, పథకం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఖాళీ స్థలాల పంపిణీ, జీఓ నంబర్ 58 ,59, 118(ఆక్రమిత ప్రభుత్వ స్థలాల, సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ), కొత్త పరిశ్రమలు, ఐటీ, ఉపాధి అవకాశాలే ప్రధాన ఎజెండాగా అధికార బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. అయితే ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు మాత్రం జంట జలాశయాల పరిరక్షణకు తీసుకొచ్చిన 111 జీఓ ఎత్తివేత అంశంతో పాటు ధరణి సమస్యలు, ఫార్మాసిటీ, పారిశ్రామిక వాడల్లోని భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులు, అబ్దుల్లాపూర్‌మెట్ మైన్స్ తవ్వకాలు వంటి అంశాలను రాజకీయ ఎజెండాగా ఎంచుకుంటున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లా నుంచి ధరణి పోర్టల్‌కు 1.95 లక్ష లకుపైగా దరఖాస్తులు అందగా, మెజారిటీ దరఖాస్తులు వివిధ కారణాలతో పరిష్కారానికి నోచుకోకుండా పోయాయి. కాంగ్రెస్, బీజేపీలు దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.ఇక పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇప్పటికీ పూర్తి కాక పోవడం కూడా ప్రతిపక్షాలకు ఆయుధంగా మారింది.

ఇదో 'హుసేన్-సాగర' సంగమం!

ఎన్నికల పండగ తాలూకు సంబరాలు మిన్నంటుతున్న వేళ..ఓటరు ఓ రాత్రి సాగర సంగమం సినిమా మరోసారి చూశాడు. ఆ సినిమా సీన్లు సమకాలీన పాలిటిక్స్‌కు దగ్గరగా ఉన్నాయనిపించింది. ఆ రాత్రి కలలో ఓటరుకు కనిపించిన సీన్‌లు ఇవి...

ఒక సీన్ :

గతంలో తన ఉద్యమంలో భాగంగా ఓ బీజేపీ నేత ప్రజాసంగ్రామయాత్ర అని ఏదో చేశాడు. ఇంకో నేత మరేదో యాత్రేదో చేశాడు. వీటన్నింటినీ చూసి చిర్రెత్తిపోయాడు కేసీఆర్. ఆ నేతలతో ఇలా మాట్లాడాడు.

''ఇవన్నీ ఉద్యమాలా?'' అడిగాడు కేసీఆర్. ''అవును'' జవాబిచ్చారు నేతలు.

''ఈ ఉద్యమాల పేరేమిటి?''

''అది కూడా తెలియదా? వీటిని పాద యాత్రలంటారు''. వెంటనే భుజం మీది తువ్వాలను నడుముకు కట్టాడు కేసీఆర్! .మొబైల్ తీసి తాము నిర్వహించిన తన ఉద్యమాలు చూపడం మొదలుపెట్టాడు.

''ఇది రోడ్డు మీద వంటావార్పూ...''

''ఇది సకల జనుల సమ్మె''

మరో క్లిప్ చూపించాడు..ట్యాంకుబండ్ మీద లక్షలాదిగా జనం! ఒక దశలో సహనం కోల్పోయిన ఉద్యమకారుల వల్ల ట్యాంక్‌బండ్ మీది విగ్రహాలు గాలిలో గ్లాసుల్లా ఎగిరాయి.

క్లిప్ ముగిశాక..కళ్లెగరేస్తూ సైగల్తో 'ఇదేమిటి' అన్నట్టుగా ఆ నేతలనే అడిగాడు.

''మి..మి..మిలియన్ మా..''మార్చ్''కాస్త బెరుకు బెరుకుగా..నత్తి నత్తిగా బదులు చెప్పారా నేతలు. ''యథో సంకల్ప..తథో ఉద్యమ; యథో ఉద్యమ..తథో కార్యకర్త; యథో కార్యకర్త..తథో జయః'' సంస్కృతంలో ఓ శ్లోకం చెప్పాక.. ''ఉద్యమాల్లో విజయం దక్కితే అధికారం దానంతట అదే దక్కుతుంది. మీ దృష్టంతా అధికారం మీదే ఉంటే విజయమెలా దక్కుతుంది?'' అంటూ... చిరాకు తగ్గించుకోడానికి ప్రగతిభవన్ నుంచి ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు విసురుగా బయల్దేరాడు కేసీఆర్.

మరో సీన్ :

లొకేషన్..ఒక ఇరానీ రెస్టారెంట్.

ఆర్టిస్టులు : కర్రతో చేసిన పేముకుర్చీల మీద ఓ పక్క కేసీఆర్, మరో పక్క కమల్‌హాసన్‌లా కాంగ్రెస్..మధ్యలో జయప్రదలా కమ్యూనిస్టులు కూర్చుని, అందరూ టీ తాగుతున్నారు.

''కమ్యూనిస్టుల్తో మీరే పొత్తు కలుపుకొండి'' అన్నాడు కేసీఆర్ కొంటెగా. ''నో... నో... మునుగోడు టైమ్‌లో మీతో వివాహం అయ్యిందటగా. కాబట్టి మీరే దగ్గర పెట్టుకోండి'' కాంగ్రెస్ జవాబు. ''ఐ యామ్ సారీ... అన్‌ఫార్చునేట్‌లీ మేం అన్ని స్థానాలూ ప్రకటించేశాం. ఎట్‌లీస్ట్..వియ్ మే బీ లక్కీ విత్ దెమ్... దిస్ టైమ్'' మళ్లీ చెప్పాడు కేసీఆర్.

''లేల్లేదు..వారిని మీతోపాటు తీసుకెళ్లడమే న్యాయం'' కాంగ్రెస్ ఆన్సర్.

'మధ్యలో తనకే వ్యక్తిత్వమూ లేనట్టుగా..భద్రాచలమా, మిర్యాలగూడనా, ఇంకోటా అని తేల్చకుండా, అసలు తన ప్రమేయమనేదే ఏదీ లేనట్టుగా..అప్పట్లో వాళ్లెవరో లఖనవీ నవాబులు 'పహలే ఆప్.. పహలే ఆప్' అన్నట్టుగా ''నువ్వు తీస్కో..అబ్బెబ్బే నువ్వే తీస్కో'' అంటూ ఉంటే... గుడ్లప్పగించి చూడ్డానికి తనేమైనా వెర్రిమొర్రి కథానాయికనా?' అనుకుంటూ.. అపరకాళుల్లా లేచారు కమ్యూనిస్టులు.

''మేమేమీ వ్యక్తిత్వం లేని హీరోయిన్లం కాదు. అసలు మీరెవ్వరూ అఖ్ఖర్లేదు. మేమే ఒంటరిగా పోటీ చేస్తాం కనీసం 17 స్థానాల్లో! ఓట్లు చీలి బొక్కపడితే..అప్పుడు మీకే తెలుస్తుంది మేమేమిటో!!''అంటూ కళ్లు'ఎర్ర' చేస్తూ ఘాటుగా జవాబిచ్చారు కమ్యూనిస్టులు.

ఇంకో సీన్ :

కామారెడ్డి, గజ్వేలనే రెండు పైపులున్న ఎన్నికల బావి మీద..పూర్తిగా ఒళ్లమరచిపోయి..అత్యంత కాన్సంట్రేషన్‌తో ఎలక్షన్ తాండవం చేస్తున్నాడు కేసీఆర్. ఇంకాసేపట్లో బావిలో పడిపోతాడేమో అని ఆందోళన చెందుతుండగా...

''తెల్లారింది లేవండి. టీ పెడతా'' అంటూ తన భార్య గొంతు వినిపించింది ఓటరుకు.

''అబ్బా... ఇంతకీ కేసీఆర్ ఎన్నికల తాండవం విజయవంతంగా పూర్తి చేశాడో లేదో?'' అని ఓటరు ఆందోళనపడుతుంటే... ''దీని జవాబు కలలో దొరకదు. డిసెంబరు 3న వాస్తవంగానే తెలుస్తుంది లెండి'' అని జవాబిచ్చింది భార్య.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్



ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు సాధారణంగా దేశం దృష్టిని పెద్దగా ఆకర్షించవు. కానీ ఈసారి మిజోరం అసెంబ్లీ ఎన్నికలు మాత్రం సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నాయి. రాష్ట్రం ఆవిర్భవించిన పాతికేళ్లలో ఇప్పటిదాకా స్థానిక పార్టీ మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), కాంగ్రెస్ మాత్రమే గెలుస్తూ వచ్చాయి. గత ఐదేళ్లలో గట్టి పోటీదారుగా మారిన జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) ఈసారి పోటీని ముక్కోణంగా మార్చేసింది. బీజేపీ ఎప్పట్లాగే ఈసారీ పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో అందరి దృష్టీ మంగళవారం జరగనున్న పోలింగ్ మీదే కేంద్రీకృతమై ఉంది...

మిజోరం 1972లో అసోం నుంచి విడిపోయింది. 15 ఏళ్ల పాటు కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగి 1987లో 23వ రాష్ట్రంగా అవతరించింది. నాటినుంచీ కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ దాదాపుగా చెరో 20 ఏళ్లు అధికారం అనుభవించాయి. ఐదు సార్లు సీఎంగా చేసిన లాల్ తన్హావ్లాయే రాష్ట్ర కాంగ్రెస్‌ను ఇప్పటిదాకా అన్ని ఎన్నికల్లోనూ నడిపిస్తూ వచ్చారు. ఈసారి తొలిసారి పార్టీలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ఆయన వారసునిగా పీసీసీ చీఫ్, మాజీ మంత్రి లాల్‌సావ్తా ఈ ఎన్నికల్లో పార్టీని నడిపిస్తున్నారు. అంతేకాదు, ఎంఎన్ఎఫ్ అధ్యక్షుడు, సీఎం జోరాం థంగాపై పోటీ చేస్తున్నారు కూడా!

పదేళ్ల చొప్పున...

1998 దాకా పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగింది. ఆ ఏడాది ఎంఎన్ఎఫ్ నెగ్గింది. పార్టీ అధ్యక్షుడు జోరాం థంగా తొలిసారి సీఎం అయి పదేళ్ల పాటు పదవిలో కొనసాగారు. 2008 నుంచి మళ్లీ పదేళ్ల పాటు కాంగ్రెస్ రాజ్యం నడిచింది. 2018లో ఎంఎన్ఎఫ్ గెలిచింది. గత నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన వారే స్పష్టమైన మెజారిటీ సాధిస్తూ వచ్చారు. వాటిని ఒక్కసారి చూస్తే...

2003

నాటి సీఎం జోరాం థంగా ఎంఎన్ఎఫ్‌ను మరోసారి విజయపథంలో నడిపారు. ఆ పార్టీ అచ్చం 1998 అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే 21 అసెంబ్లీ స్థానాలు నెగ్గి మరోసారి బొటాబొటి మెజారిటీతో అధికారం నిలబెట్టుకుంది. కాంగ్రెస్ మాత్రం తన స్థానాల సంఖ్యను 6 నుంచి 12కు పెంచుకుంది. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా కేవలం 1.63 శాతం మాత్రమే కావడం విశేషం! 1998లో 12 సీట్లు నెగ్గిన మిజోరం పీపుల్స్ కాన్ఫరెన్స్ (ఎంపీసీ)5కు పరిమితమైంది. మాజీ ఐపీఎస్ అధికారి లాల్‌డుహోమా సారథ్యంలోని జోరాం నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్‌పీ) 2 స్థానాలు నెగ్గింది.

2018

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో మళ్లీ అధికారం చేతులు మారింది. ఎంఎన్ఎఫ్ 26 సీట్లతో థంగా సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. థంగా మూడోసారి సీఎం అయ్యారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ మార్పుచేర్పులకు ఈ ఫలితాలు అద్దం పట్టాయి. కాంగ్రెస్ 29.98 శాతం ఓట్లు సాధించినా కేవలం 5 స్థానాలకు పరిమితమైంది. సీఎం తన్హావ్లాతో పాటు ప్రస్తుత సీఎం అభ్యర్థి లాల్‌సావ్తా కూడా ఓటమి పాలయ్యారు. ఇక ఐదారు పార్టీల విలీనంతో లాల్‌డుహోమా సారథ్యంలో ఏర్పడ్డ జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) 22.9 శాతం ఓట్లు సాధించి ఏకంగా 8 స్థానాలు గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థులంతా స్వతంత్రులుగా పోటీ చేశారు. నాటినుంచి పలు స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుసగా నెగ్గుతూ జెడ్‌పీఎం బాగా జోరు మీదుంది. 8.09 శాతం ఓట్లు సాధించిన బీజేపీ ఒక సీటులో నెగ్గి మిజోరంలో ఎట్టకేలకు ఖాతా తెరిచింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఏకైక స్థానం కూడా ఎంఎన్ఎఫ్ ఖాతాలోకే వెళ్లింది.

శరణార్థులే ప్రధానాంశం

జాతుల హింసతో అట్టుడుకుతున్న మణిపూర్ నుంచి 12,000 పై చిలుకు కుకీ తెగవాసులు మిజోరంకు ఆర్నెల్ల క్రితం వలస వచ్చారు. ఇప్పుడదే అన్ని పార్టీలకూ అతి పెద్ద ఎన్నికల అంశంగా మారింది...

- బంగ్లాదేశ్‌లో సైనిక పాలన తాలూకు హింసను తాళలేక ఏడాదిన్నరగా మిజోరంకు 33 వేలకు పైగా చిన్ తెగవాసులు వలస వచ్చారు.
- కుకీలతో పాటు చిన్ తెగవాసులతో కూడా మిజోలకు అనాదిగా అతి సన్నిహిత సంబంధ బాంధవ్యాలున్నాయి. ముఖ్యంగా కుకీలపై మెయితీల అకృత్యాల పట్ల మిజోరంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.
- ఈ నేపథ్యంలో శరణార్థుల అంశమే ఈసారి ప్రధాన ఎన్నికల అంశంగా మారింది. దాంతో వారికి మద్దతుగా నిలవడం ద్వారా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి.
- సీఎం థంగా శరణార్థులకు అన్నిరకాల సదుపాయాలూ కల్పిస్తున్నారు.
- మణిపూర్‌లో, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీయే కుకీల దుస్థితికి కారణమని స్థానిక గిరిజనుల్లో ఉన్న ఆగ్రహాన్ని అనుకూలంగా మలచుకునేందుకు కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.
- ఎంఎన్ఎఫ్ ఈసారి కూడా బీజేపీకి దూరంగా ఉంది. అంతేగాక ప్రధాని రాష్ట్రానికి వచ్చినా ఆయనతో కలిసి వేదిక పంచుకోనని చెప్పడం ద్వారా సీఎంథంగా జాతీయవాదాన్ని రగుల్కొలిపే ప్రయత్నం చేశారు.
- కానీ ఓటర్లు అన్నీ గమనిస్తున్నారని, నిన్నామొన్నటిదాకా బీజేపీతో అంటకాగిన ఎంఎన్ఎఫ్‌ను వారు క్షమించే ప్రసక్తే ఉండబోదని కాంగ్రెస్ అంటోంది.
- సంక్షేమం, ఉపాధి కల్పనలో పెద్దగా చేసిందేమీ లేకపోవడం ఎంఎన్ఎఫ్‌కు ప్రతికూలంగా మారవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. ఈ అంశమే తమను గట్టెక్కిస్తుందని కాంగ్రెస్ ఆశ పడుతోంది.



ముక్కోణపు మిజోరంలో... గెలుపెవరిదో!



జోరాం థంగా | లాల్‌సావ్తా | లాల్‌డుహోమా

కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ హోరాహోరీ ● దీటుగా పోటీ ఇస్తున్న జెడ్‌పీఎం
అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఎన్నికలు ● బీజేపీకి మళ్లీ నాలుగో స్థానమే! ● రేపే పోలింగ్

2008

కాంగ్రెస్ 32 స్థానాలు నెగ్గి పదేళ్ల అనంతరం మళ్లీ అధికారం చేపట్టింది. లాల్ తన్హావ్లా నాలుగోసారి సీఎం అయ్యారు. ఎంఎన్ఎఫ్ కేవలం 3 స్థానాలకు పరిమితమైంది. సీఎం థంగాపై ముసురుకున్న అవినీతి ఆరోపణలు, విచారణలు బాగా చేటు చేశాయి. దాంతో ఆయన పోటీ చేసిన రెండుచోట్లా ఓటమి చవిచూశారు. జెడ్ఎన్‌పీ మళ్లీ 2 సీట్లతో సరిపెట్టుకోగా ఎంపీసీ 3 సీట్లకు పడిపోయి క్షీణ దశకు చేరింది.

2013

కాంగ్రెస్ ఈసారి రాష్ట్ర చరిత్రలో అత్యధికంగా 44.63 శాతం ఓట్లతో ఏకంగా 34 సీట్లు నెగ్గి అధికారం నిలుపుకుంది. నూతన భూ విధానం వంటి పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించింది. తన్హావ్లా ఐదోసారి సీఎం అయ్యారు. ఎంఎన్ఎఫ్ 5 స్థానాలతో సరిపెట్టుకుంది. ఎంపీసీతో కలిసి పోటీ చేసినా లాభం లేకపోయింది. ఎంపీసీ ఒకే ఒక్క స్థానం గెలవగా జెడ్ఎన్‌పీ 17.42 శాతం ఓట్లు సాధించి కూడా ఖాతాయే తెరవలేదు! దాంతో ఎంపీసీ నేత సైలో రాజకీయాల నుంచే రిటైరయ్యారు! జోరాం థంగాతో పాటు లాల్‌డుహోమా కూడా ఓటమి చవిచూశారు.

గత నాలుగు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
(మొత్తం అసెంబ్లీ స్థానాలు 40)

పార్టీ	2003	2008	2013	2018
ఎంఎన్ఎఫ్	21	3	5	26
కాంగ్రెస్	12	32	34	5
జెడ్ఎన్‌పీ/జెడ్‌పీఎం	2	2	0	8
బీజేపీ	0	0	0	1
ఇతరులు	5	3	1	0
ఓట్ల శాతం				
ఎంఎన్ఎఫ్	31.69	30.65	28.65	37.7
కాంగ్రెస్	30.06	38.89	44.63	29.98
జెడ్ఎన్‌పీ/జెడ్‌పీఎం	14.7	10.22	17.42	22.9
బీజేపీ	1.87	0.44	0.37	8.09

(నోట్: లాల్‌డుహోమా సారథ్యంలోని జోరాం నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్‌పీ), ఇతర పార్టీలు 2018లో పరస్పరం విలీనమై జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం)గా ఆవిర్భవించాయి)

విశేషాలెన్నో...

- 1987లో మిజోరం రాష్ట్రంగా మారినప్పటి నుంచీ కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ మాత్రమే అధికారంలో ఉంటూ వస్తున్నాయి.
- రాష్ట్రంలోని 40 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 39 ఎస్టీ రిజర్వుడు స్థానాలే!
- అలాగే రాష్ట్ర జనాభాలో ఏకంగా 87 శాతం క్రైస్తవులే
- బంగ్లాదేశ్, మయన్మార్‌లతో మిజోరం సరిహద్దులను పంచుకుంటుంది.
- ఈ రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటిదాకా ఫలించలేదు.
- రాష్ట్ర చరిత్రలో బీజేపీ ఇప్పటిదాకా నెగ్గింది ఒక్కటంటే ఒక్క ఎమ్మెల్యే స్థానం. అది కూడా 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనే.
- కేంద్రంలోని అధికార ఎన్డీఏ భాగస్వామి అయిన ఎంఎన్ఎఫ్ రాష్ట్రంలో మాత్రం బీజేపీని దూరం పెడుతూ వస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మిజోరంలో ముగిసిన ఎన్నికల ప్రచారం

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీకి ఈ నెల 7వ తేదీన జరగనున్న పోలింగ్‌కు గాను ఎన్నికల ప్రచారం గడువు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ఓటింగ్ ముగిసేవరకు అన్ని రకాల ప్రచార కార్యక్రమాలపై కఠిన ఆంక్షలుంటాయని చీఫ్ ఎలక్టోరల్ అధికారి హెచ్ లియాంజెలా చెప్పారు. రాష్ట్రంలోని 1,276 పోలింగ్ స్టేషన్లకుగాను మారుమూల ప్రాంతాల్లో 149 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉన్న30 పోలింగ్ స్టేషన్లను అత్యంత సమస్యాత్మకంగా గుర్తించినట్లు ఆయన వివరించారు. మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంట భద్రతను పెంచినట్లు వెల్లడించారు. రాష్ట్ర అసెంబ్లీలోని 40 స్థానాల్లో 174 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

సాక్షి కరీంనగర్

సోమవారం। 6। నవంబర్। 2023

విప్లవవీరుల పెద్దపల్లి

విప్లవవీరులను అందించిన పెద్దపల్లికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వామపక్ష ఉద్యమానికి ఊపిరులూదిన మల్లోజుల సోదరులు కిషన్‌జీ ఉరఫ్ మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్‌రావు పెద్దపల్లి బిడ్డలే. వీరేకాకుండా అనేకమంది అగ్రనేతలుగా ఎదిగారు.

-10లో▸



న్యూస్‌రీల్

నేడు బండి సంజయ్ నామినేషన్

- హాజరుకానున్న ప్రకాశ్ జవదేకర్, రాజాసింగ్



కరీంనగర్‌టౌన్: భారతీయ జనతాపార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నేత ప్రకాశ్‌జవదేకర్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అతిథులుగా హాజరుకానున్నారు. నామినేషన్ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ప్రారంభం కానున్న బైక్ ర్యాలీ కమాన్‌చౌరస్తా, వెంకటేశ్వర టెంపుల్, రాజీవ్ చౌక్, కోర్టు చౌరస్తా, శివటాకీస్, జ్యోతి నగర్, రాంనగర్, గీతాభవన్ చౌరస్తా వరకు సాగనుంది. అక్కడి నుంచి పాదయాత్ర ర్యాలీ ద్వారా సంజయ్ కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు.

అలరించిన జాతీయస్థాయి కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కరీంనగర్ కల్చరల్: భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కవి సమ్మేళనం అలరించింది. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు గంటా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాల్లో కవుల పాత్ర ఎనదగినదని అన్నారు. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పద్య కథా సౌరభం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ట్యాగ్‌లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి మాట్లాడుతూ ప్రపంచం నిద్రపోతున్నప్పుడు కవి మేల్కొంటాడని, కవి సమాజహితం కోసమే జీవిస్తారన్నారు. కంద సార్వభౌమ డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ పద్యం సజీవంగా ఉంటుందని, జీవించినంత కాలం పద్యాన్ని ప్రేమిస్తానన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత గులాబీల మల్లారెడ్డి కవి సమ్మేళనం నిర్వహించిన ప్రభాకర్‌ను అభినందించారు. అనంతరం పలువురు కవులు కవితా పఠనం చేశారు. కవితా గాండీవి, నాట్య శ్రీనాథ, అభినవ తెనాలి రామకృష్ణ, పద్య విద్యామణి డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ అద్భుతమైన బిల్వమంగళ ప్రదర్శించారు. ప్రముఖ కవి ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు, గిడుగు రామమూర్తి పురస్కార గ్రహీత కళారత్న పొట్లూరి హరికృష్ణ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కవి ఉంటేనే చరిత్ర ఉంటుందని అన్నారు. కవులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, దాస్యం సేనాధిపతి, చౌదూరి నరసింహారావు పాల్గొన్నారు.

శ్రీహితకు అరుదైన అవకాశం



వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరైన శ్రీహిత

కొత్తపల్లి(కరీంనగర్): జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీల్లో సత్తా చాటి జిల్లా పేరును ఇనుమడింపజేసింది ఓ విద్యార్థిని. కొత్తపల్లి మండలంలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి వి.శ్రీహితకు ఈనెల 5 నుంచి 11 వరకు జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించే సకూర వైజ్ఞానిక కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం లభించిందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. శ్రీహిత రెండేళ్ల క్రితం 8వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన పోటీల్లో జిల్లా నుంచి పాల్గొని కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగంలో అవార్డు అందుకుంది. అలాగే బెంగళూరులో పలు రాష్ట్రాల వైజ్ఞానిక ప్రదర్శనలో పెడల్ పవర్డ్ మల్టీపర్పస్ మెషీన్ (బహుళ ప్రయోజకర బైస్కిల్) గూర్చి వివరించి ఎస్ఐఎస్ ఇస్రో అధికారుల ప్రశంసలు పొంది ల్యాప్‌టాప్ బహుమతిగా అందుకుంది. ఈసందర్భంగా శ్రీహితకు డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కాగా వివిధ దేశాల నుంచి పాల్గొనే ఈ కార్యక్రమంలో శ్రీహితకు అవకాశం రావడం సంతోషంగా ఉందని నరేందర్‌రెడ్డి తెలిపారు.

సీ విజిలేస్తున్నారు

వంద నిమిషాల్లోనే సమస్య పరిష్కారం

- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదులు
- రాష్ట్రంలోనే జిల్లా మూడోస్థానం
- ఇప్పటికే 124 ఫిర్యాదులు..

కరీంనగర్ అర్బన్:

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయడంతో పాటు ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. కుగ్రామాలకు కూడా అండ్రాయిడ్ ఫోన్ల వాడకం విస్తరించగా ఫోన్‌లోనే ఫిర్యాదు చేసేలా సీ– విజిల్ యాప్‌ను రూపొందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలో కంట్రోల్ రూంను గత నెలలో ఏర్పాటు చేయగా యువత ఫిర్యాదులను సంధిస్తోంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై జిల్లావ్యాప్తంగా ఫిర్యాదులొచ్చాయి. ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం సిబ్బంది ప్రత్యేక బృందాలను అప్రమత్తం చేస్తున్నారు. వంద నిమిషాల్లోనే బృందాలు క్షేత్రస్థాయికి చేరి చర్యలు చేపట్టడం తప్పనిసరి. సదరు సమయంలోనే సమస్య పరిష్కారం చేయడంతో పాటు వీడియోను కంట్రోల్ రూంకు పంపాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేయండిలా..

సీ–విజిల్ ఇప్పుడు ఎన్నికల్లో కీలకపాత్ర పోషిస్తున్న యాప్. ఎవరైనా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు చేయవచ్చు. ఉన్నచోట నుంచే ఫోన్ ద్వారా ప్రక్రియ చేపట్టవచ్చు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు రాజకీయ పార్టీలు ఉపక్రమిస్తుంటాయి. ఇప్పుడు ఉల్లంఘనులు తప్పించుకోవడానికి వీల్లేదు. నిబంధనలు విస్మరించిన చోటు నుంచే ఫిర్యాదు చేసే అవకాశం ఎన్నికల సంఘం ఈ యాప్ ద్వారా కల్పించింది. సీ విజిల్ యాప్‌లో ఉల్లంఘనులకు సంబంధించిన చిత్రాలను తీసి ఫిర్యాదు చేస్తే సరి. నిమిషాల వ్యవధిలోనే సంబంధిత అధికారులు చర్యలకు ఉపక్రమించాలి. లేదంటే వారే బాధ్యులవుతారు. ఓటు వేయమని ఇబ్బందులకు గురిచేయడం, డబ్బులు ఆశ చూపి ప్రలోభపెట్టడం, మద్యాన్ని ఓటరుకు సరఫరా చేయడం, నేరపూరిత చర్యలకు దిగినా, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారం చేసినా ఫొటోలు, వీడియోలు తీసి పంపిస్తే సరి. గూగుల్ లేదా ప్లేస్టోర్‌లో సీవిజిల్ యాప్ అని టైపు చేసి డౌన్లోడ్ చేసుకుంటే సరి.



కరీంనగర్‌లోని కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న సీ విజిల్ సిబ్బంది



సీ విజిల్‌కు నియోజకవర్గాల వారీగా వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం

నియోజకవర్గం	ఫిర్యాదులు	పరిష్కారం	ఫేక్
చొప్పదండి	20	15	3
హుజూరాబాద్	49	43	6
కరీంనగర్	23	18	5
మానకొండూరు	32	21	11
మొత్తం	124	97	25

వంద నిమిషాల్లోనే పరిష్కారం

రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో పాటు సాధారణ ప్రజలు చేసిన ఫిర్యాదు 5 నిమిషాల్లో జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి ఐదు నిమిషాల్లో క్షేత్ర పరిశీలనలోని ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు చేరుతుంది. వారు 15 నిమిషాల్లో క్షేత్రస్థాయి విచారణ చేస్తారు. ఆ నివేదికను 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి వెళ్లేలా చూస్తారు. దానిని రిటర్నింగ్ అధికారి 45 నిమిషాల్లో పరిశీలిస్తారు. అక్కడ నిర్ధారణ కాకపోతే ఫిర్యాదు జిల్లా ఎన్నికల అధికారి పరిష్కరిస్తారు. వచ్చిన ప్రతి ఫిర్యాదు వంద నిమిషాల్లోనే పరిష్కారం చూపుతారు.

అత్యధికం హుజూరాబాద్‌లోనే

సీ విజిల్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికం హుజూరాబాద్ నియోజకవర్గం నుంచే ఉండటం విశేషం. జిల్లావ్యాప్తంగా 124 ఫిర్యాదులు వస్తే అందులో 49 హుజూరాబాద్ నియోజకవర్గం నుంచే ఉన్నాయి. గోడలకు రాతలు తీసివేయలేదని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయలేదనే ఫిర్యాదులే వచ్చాయి. ఓటర్లకు బహుమతులు పంపిణీ చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చిత్రపటాన్ని తొలగించలేదని, పలు అంశాలపై చిత్రాలతో ఫిర్యాదు చేశారు.



మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. అందుకే దేవుడిమీద కానీ.. మహానుభావుల మీదకాని ఆధారపడొద్దు.– బీఆర్ అంబేడ్కర్

మీకు తెలుసా?

సహకార నేతకు తప్పని ఓటమి

కరీంనగర్: జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ముల్కనూర్ కో–అపరేటివ్ బ్యాంకు అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపకులైన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన అల్గిరెడ్డి కాశీవిశ్వనాథ్‌రెడ్డి(హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తండ్రి) హుజూరాబాద్ శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల రాజేశ్వర్‌రావు చేతిలో ఓటమి చెందగా, 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దుగ్గిరాల వెంకట్‌రావు చేతిలో రెండవసారి ఓటమి పాలయ్యారు.

1989 ఎన్నికల్లో స్వతంత్రులదే హవా

కరీంనగర్: శాసనసభ సాధారణ ఎన్నికల్లో 1989లో ఉమ్మడి జిల్లాలో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించి ఔరా అనిపించారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా వెలిచాల జగపతిరావు, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా కేతిరి సాయిరెడ్డి, బుగ్గారం ఎమ్మెల్యేగా జువ్వాడి రత్నాకర్‌రావు, సిరిసిల్ల ఎమ్మెల్యేగా నీరడి వెంకటక్రిష్ణయ్యలు గెలుపొందారు. కరీంనగర్, హుజూరాబాద్, బుగ్గారం కాంగ్రెస్ టికెట్ల కోసం పోటీ పడి టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులుగా పై ముగ్గురు పోటీకి దిగి విజయం సాధించారు. సిరిసిల్లలో మాత్రం సీపీఐ(ఎంఎల్)జనశక్తి మద్దతుతో ఎన్.వీ క్రిష్ణయ్య విజయం సాధించి అప్పట్లో సంచలనం సృష్టించారు.

రాశులు కలవాలి.. విజయం వరించాలి

- మంచి ముహూర్తానికి సంప్రదింపులు
- నామినేషన్లకు ఐదు రోజులే గడువు



కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ముహూర్తాలు చూసుకుంటున్నారు. మంచి రోజు, బలమైన ముహూర్తం చూడాలని పండితులను సంప్రదిస్తున్నారు. ఈనెల 3నుంచి నామినేషన్ల ప్రక్రియం ప్రారంభమైంది. పదోతేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు తుది గడువు ఉంది. ఇంకా ఐదురోజులు మాత్రమే నామినేషన్లకు ముహూర్తం ఉంది. ఏ రోజు, ఏసమయం బాగుందో చూసి చెప్పండి అంటూ పురోహితుల వెంట తిరుగుతూ... బీఫాంలు అందుకున్న అభ్యర్థులు తమ జాతకాలను పరిశీలించుకుంటున్నారు.

ఏ రోజు ఎలాగుందంటే...

నామినేషన్ల దాఖలు గడువుకు ఇంకా ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అభ్యర్థి జన్మ నక్షత్రం ప్రకారం అనువైన తిథి, నక్షత్రం ఆధారంగా ముహూర్తం చూసుకుని నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు పురోహితులను కలుస్తున్నారు.

- 6వ తేదీ నవమి. ఆశ్లేష నక్షత్రం నామినేషన్ల దాఖలుకు ఇష్టపడరని పండితులు చెబుతున్నారు.
- 7న మంగళవారం కావడంతో చాలా మంది నామినేషన్ వేయరంటున్నారు.
- 8న ఏకాదశి, పుష్యనక్షత్రం కావడంతో ఎక్కువ మంది నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
- 9న ఏకాదశి ఉదయం 10.30 వరకు ఉండడంతో నామినేషన్లు అధికంగా దాఖలు కావొచ్చని చెబుతున్నారు.
- 10న రాహుకాలం అధికంగా ఉండడంతో నామినేషన్లు పెద్దగా దాఖలు కాకపోవచ్చు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్/కరీంనగర్‌రూరల్: అభివృద్ధిని చూసి ఓటేయాలని, తనకు మరోసారి అవకాశమిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తానని కరీంనగర్ బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్‌లో జరిగిన భగత్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వానికే పట్టం కట్టాలని కోరారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు సంధి అనంతరెడ్డి, జలపతిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆధ్వర్యంలో..

పేద ప్రజలు సంతోషంగా ఉండాలని, దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా పింఛన్లు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కమలాకర్ అన్నారు. పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ.6016 పింఛన్ అందిస్తామని పేర్కొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేకపోవడంతో గులాబీ పార్టీలో పెద్ద ఎత్తున కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేరుతున్నారని మంత్రి కమలాకర్ అన్నారు. మంత్రి గంగుల నివాసంలో బొమ్మకల్, మల్కాపూర్, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం అభినందనీయమని మంత్రి అన్నారు. అనంతరం నగరంలోని 4,5,27వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే అంధకారమే అన్నారు. బీఆర్ఎస్ పక్కా సెక్యులర్ ప్రభుత్వం అని తెలిపారు. కమలాకర్ వెంట మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు తోటరాములు, ఆకుల నర్మదా నర్సయ్య, కోల సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కరీంనగర్ రూరల్ మండలంలోని దుబ్బపల్లి, జూబ్లీనగర్ గ్రామాల్లో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు ప్రచారం నిర్వహించారు. కమలాకర్ సతీమణి రజిత, సోదరుడు సుధాకర్, కుటుంబసభ్యులు ఇంటింటా ఓట్లు అభ్యర్థించారు.



గజమాలతో సత్కరిస్తున్న దివ్యాంగులు

దొంగ ఓటేస్తే కటకటాలే..

- స్థానికంగా లేనివారు, మృతుల పేర్లతో ప్రత్యేక జాబితా
- ఇంటింటా బీఎల్వోల జల్లెడ

కరీంనగర్‌అర్బన్: దొంగ ఓటేయాలనుకుంటే ఇక కటకటాలే. సదరు అవకాశమే లేకుండా ఎన్నికల సంఘం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారున్నారు. ఓట్లు మాత్రం ఇక్కడే ఉండగా వ్యయప్రయాసల వల్ల పోలింగ్ రోజు చాలా మంది నిరాసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సదరు ఓటర్ల ఓటు వేరే వారు వేస్తున్నారు. గత నెలలో విడుదల చేసిన రెండో ప్రత్యేక సవరణ జాబితా (ఎస్ఎస్ఆర్) 2023లో పలుచోట్ల చనిపోయిన వారి పేర్లు అలాగే జాబితాలో ఉండగా జాబితా మారే అవకాశం లేకపోవడంతో వారి పేరు మీద ఇతరులు ఓటు వేసే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో దొంగ ఓట్ల సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి మరోసారి జల్లెడ పడుతున్నారు.

పక్కాగా తనిఖీ

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి ఉన్నాయి. రెండో ఎస్ఎస్ఆర్ 2023 ఓటరు జాబితా ప్రకారం మొత్తం 10,34,186 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 509498 పురుషులు, 524630 మహిళలు, ఇతరులు 58 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,338 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పలు కేంద్రాల పరిధిలో వలస ఓటర్లు, మృతులు, చిరునామాలు మార్చినవారిని జాబితా నుంచి తొలగించలేదు. వీరి స్థానంలో ఇతరులు వచ్చి దొంగ ఓటు వేయకుండా ఎన్నికల అధికారులు ఏఎస్‌డీ(అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్) జాబితా తయారు చేస్తున్నారు. రెండో ఎస్ఎస్ఆర్–2023 ఓటరు జాబితాలో ఎక్కడైనా ఈ మూడు విభాగాల వారు ఉంటే ఏఎస్‌డీ జాబితాలో చేరుస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాలో పేరుండి స్థానికంగా లేనివారు, మృతిచెందినవారు, ఆ ఇంటి చిరునామాలో లేనివారిని గుర్తించి జాబితా రూపొందిస్తున్నారు. తదుపరి జాబితాను పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారికి అందిస్తారు. జాబితాలో పేరున్న వారు ఓటేసేందుకు వస్తే ప్రత్యేకంగా పరిశీలిస్తారు. గుర్తింపు కార్డులు సరిగా ఉంటే అనుమతిస్తారు. జాబితాలో పేరున్న వ్యక్తి ఓటు వేసేందుకు మరొకరు వస్తే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు. నాలుగైదు ఏళ్లలో జిల్లాలో మరణించిన ఓటర్లు వేలల్లో ఉన్నారు. బీఎల్వోలు ఇంటింటి పరిశీలనలో మరణించిన వారి పేర్లకు టిక్ పెట్టారు. రెవెన్యూ అధికారులు మాత్రం డెత్ సర్టిఫికెట్ ఉండాలని, అలా ఉంటేనే జాబితా నుంచి తీసివేయొచ్చని చెబుతున్నారు. సదరు సర్టిఫికెట్లు సమర్పించకపోవడంతో జాబితాల్లో వారి పేర్లు కూడా 1500 వరకు ఉంటాయని సమాచారం.

అచేతనులకు ఇంటి నుంచి ఓటు

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశమివ్వగా నడవలేనివారికి మాత్రమే ఈ అవకాశం. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో 80 ఏళ్లు నిండిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేయడానికి ఆస్కారముంది. 'ఫామ్ 12 డీ' పత్రం ఉంటుంది. ఇందుకోసం ఎన్నికల అధికారులు పోలింగ్ పార్టీస్ పేరుతో బృందాలు ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు 80 ఏళ్ల నిండిన, వైకల్యం ఉన్న ఓటర్ల ఇంటికి వెళ్లి పరిశీలిస్తాయి. నడవలేని స్థితిలో ఉన్నవారికి మాత్రమే ఫామ్ 12డీ పత్రం అందిస్తారు. ఫాం పొందిన వాళ్లు మాత్రమే ఇంటి నుంచి ఓటు వేస్తారు.



ఇంటింటా సర్వేలో బీఎల్వో

> **దొంగ ఓట్లకు ఆస్కారం లేదు**
>
> ఎన్నికల్లో దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నాం. దీంతో దొంగ ఓట్లకు పూరిస్థాయిలో అడ్డుకట్ట పడుతుంది. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నాం.
>
> – కుందారపు మహేశ్వర్, కరీంనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి

నియోజకవర్గాల వారీగా ఓటర్లు	
కరీంనగర్	3,41,913
హుజూరాబాద్	2,44,514
మానకొండూరు	2,18,413
చొప్పదండి	2,29,346

ఇక నుంచి జనరల్ ఆస్పత్రిగా..

- కళాశాల ఏర్పాటుతో మెరుగుపడనున్న వైద్యం
- మెడికల్ హబ్‌గా కరీంనగర్

కరీంనగర్‌టౌన్: జిల్లా ఆస్పత్రి ఇకపై జీజీహెచ్(గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్)గా సేవలు అందించనుంది. ఇన్నాళ్లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్న జిల్లా ప్రధాన ఆస్పత్రి ద్వారా పేదలకు వైద్య సేవలు అందించారు. కరీంనగర్‌కు మెడికల్ కళాశాల రావడంతో జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాల ఆధీనంలోకి వెళ్లింది. ఇటీవల జిల్లా ఆస్పత్రి బోర్డును మెడికల్ కళాశాలగా మార్చారు.

మెడికల్ హబ్‌గా..

ఉత్తర తెలంగాణకు కేంద్రబిందువుగా ఉన్న కరీంనగర్ మెడికల్ హబ్‌గా మారింది. హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వందలాది ప్రైవేటు ఆస్పత్రులతో పాటు రెండు ప్రైవేటు, ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా వైద్యసేవలు అందుతున్నాయి. కరీంనగర్‌తో పాటు పక్కజిల్లాల ప్రజలు వైద్యం కోసం కరీంనగర్ వస్తున్నారు. ఇన్నాళ్లు ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీతో విసిగిపోయిన ప్రజలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఒక వరంగా మారనుంది. ఇప్పటికే నిరుపేదలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడి చికిత్సలు పొందుతున్నారు. ఈ సేవలు మరింత మెరుగుపడేలా ప్రభుత్వ మెడికల్ కళాశాల పనిచేయనుంది.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

అందుబాటులోకి సూపర్‌స్పెషాలిటీ సేవలు

ఇప్పటి వరకు జిల్లా ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, దంత, కంటి, సైకియాట్రీ వంటి సేవలు మాత్రమే అందాయి. జీజీహెచ్‌గా మారడంతో కార్డియాలజీ, న్యూరో వంటి సూపర్‌స్పెషాలిటీ సేవలు కూడా అందనున్నాయి. అన్ని రకాల శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ప్రతీరోజు 600 నుంచి 700 వరకు ఔట్ పేషెంట్(ఓపీ) సేవలు అందుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తే వెయ్యి వరకు ఓపీ పెరిగే అవకాశముంది.

ఇన్‌పేషెంట్ సేవలు విస్తృతం

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీతో పాటు ఇన్‌పేషెంట్ సేవలు విస్తృతం కానున్నాయి. ప్రసుతం జనరల్ విభాగం 350 పడకలు, ఎంసీహెచ్‌లో 150 పడకలు, మొత్తం 500 పడకలతో ఆస్పత్రి నడుస్తోంది. జీజీహెచ్‌లో పడకలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మెడికల్ కళాశాలకు చెందిన 35మంది, జిల్లా ఆస్పత్రికి చెందిన 15 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఈ సంఖ్య రెండింతలు అవుతుందని వైద్య కళాశాల అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది పెరగనున్న నేపథ్యంలో ఎల్లవేళలా అన్ని రకాల సేవలు అందనున్నాయి.

> **సేవలను సద్వినియోగం చేసుకోవాలి**
>
> మెడికల్ కళాశాల కరీంనగర్‌లో ఏర్పాటు కావడం వల్ల వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుతున్నాయి. నిరుపేదలు ప్రైవేటుకు వెళ్లి ఆర్థిక దోపిడీకి గురికాకుండా ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> – డాక్టర్ కృష్ణప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్

విప్లవవీరుల పెద్దపల్లి

- ఎన్నికలపై నక్సల్స్‌ ప్రభావం
- తొలి ఎమ్మెల్యే పీడీఎఫ్‌ అభ్యర్థి
- శ్రీరాంసాగర్‌ జలాలతో 'వరి' సిరులు
- ఎస్సారెస్పీ కాలువపై జల విద్యుత్‌ కేంద్రాలు
- పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ముఖచిత్రం



పెద్దపల్లిరూరల్‌: విప్లవవీరులను అందించిన పెద్దపల్లికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వామపక్ష ఉద్యమానికి ఊపిరులూదిన మల్లోజుల సోదరులు కిషన్‌జీ ఉరఫ్‌ మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్‌రావు పెద్దపల్లి బిడ్డలే. వీరేకాకుండా అనేక మంది అగ్రనేతలుగా ఎదిగారు.

పెత్తందారీ వ్యవస్థపై పోరు

- అప్పటి పీపుల్స్‌వార్‌(ప్రస్తుత మావోయిస్టు) పార్టీ పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక ప్రభావం చూపేది.
- ఈక్రమంలోనే పెత్తందారీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు సాగించింది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోనే తొలిసారి పెద్దపల్లిలో డీఎస్పీ స్థాయి అధికారి బుచ్చిరెడ్డిని అప్పటి పీపుల్స్‌వార్‌ నక్సల్స్‌ హతమార్చడం సంచలనం సృష్టించింది.
- పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి 1952లో జరిగిన తొలిఎన్నికల్లో ఎల్‌.ముత్తయ్య పీడీఎఫ్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.

తొలి ఎన్నికలు 1952లో..

1952లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారితం. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు ద్వారా అందే సాగునీటితో వరి సిరులు కురిపిస్తోంది. ఎస్సారెస్పీ డీ–83 ప్రధానకాలువ పెద్దపల్లి నుంచి మంథనికి, డీ– 86 ద్వారా సుల్తానాబాద్‌, కాల్వశ్రీరాంపూర్‌, ఓదెల మండలాల్లోని దాదాపు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అంతేకాదు.. కాలువలపై ఆరు చోట్ల జల విద్యుత్‌ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి.

వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్‌..

- పెద్దపల్లిలో వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్‌ అందుబాటులోకి వచ్చింది.
- ఈప్రాంత రైతులు అత్యధికంగా వేరుశనగ, కంది సాగుచేసేవారు. వరంగల్‌ తర్వాతి స్థానంలో అతిపెద్ద మార్కెట్‌గా పెద్దపల్లికి ఇప్పటికీ గుర్తింపు ఉంది.

ఓటర్ల తీర్పు విలక్షణం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పెద్దపల్లి ఓటర్లు విలక్షణమైన తీర్పునిచ్చేవారు. వరుసగా రెండోసారి ఎవరినీ ఎన్నుకునేవారు కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో టీఆర్‌ఎస్‌ నుంచి దాసరి మనోహర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. 2018లోనూ ఆయనే విజయం సాధించి గతరికార్డులను బద్దలు కొట్టారు. మూడోసారి తన అదృష్టం పరీక్షించుకునేందుకు బరిలో నిలిచారు.

'గోనె' ప్రత్యేక ముద్ర

1983లో జరిగిన పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షమైన సంజయ్‌ విచార్‌ మంచ్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరుమాసాలకే తన పదవికి రాజీనామా చేసిన గోనె ప్రకాశరావు.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అప్పటినుంచి నేరుగా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. అయితే దివంగత సీఎం వైఎస్సార్‌ ఆయనను ఆర్టీసీ చైర్మన్‌గా నియమించారు.

1952 నుంచి 2018 వరకు ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1952	ఎల్‌.ముత్తయ్య	పీడీఎఫ్‌
1962	బుట్టి రాజారాం	కాంగ్రెస్‌
1967	జిన్న మల్లారెడ్డి	స్వతంత్ర
1972	జిన్న మల్లారెడ్డి	కాంగ్రెస్‌
1978	గొట్టిముక్కుల రాజిరెడ్డి	కాంగ్రెస్‌
1983	గోనె ప్రకాశ్‌రావు	సంజయ్‌ విచార్‌మంచ్‌
1983	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్‌
1985	కాల్వ రామచంద్రారెడ్డి	టీడీపీ
1989	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్‌
1994	బిరుదు రాజమల్లు	టీడీపీ
1999	గుజ్జుల రామకృష్ణారెడ్డి	బీజేపీ
2004	గీట్ల ముకుందరెడ్డి	టీఆర్‌ఎస్‌
2009	విజయరమణారావు	టీడీపీ
2014	దాసరి మనోహర్‌రెడ్డి	టీఆర్‌ఎస్‌
2018	దాసరి మనోహర్‌రెడ్డి	టీఆర్‌ఎస్‌

కాంగ్రెస్‌ అభ్యర్థిగా 'గీట్ల'

పెద్దపల్లి నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసిన గీట్ల ముకుందరెడ్డి తొలుత సంజయ్‌ విచార్‌ మంచ్‌ అభ్యర్థి గోనె ప్రకాశ్‌రావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత అనూహ్యంగా గోనె ప్రకాశ్‌రావు తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికల్లో సమీప టీడీపీ అభ్యర్థి వేముల రమణయ్యపై గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి పోటీపడ్డారు. 2004 ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయరమణారావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ నుంచి టికెట్‌ ఆశించిన గీట్ల ముకుందరెడ్డిని కాదని భానుప్రసాదరావుకు పార్టీ అధిష్టానం టికెట్‌ ఇవ్వడంతో మనస్తాపానికి గురయ్యారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన బీఆర్‌ఎస్‌

- కేసీఆర్‌ నియంత పాలనపై పోరాడి కరీంనగర్‌ ఆత్మగౌరవాన్ని దేశానికి చాటిన చరిత్ర నాది
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌


మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్‌

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు యావత్‌ తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ అన్నారు. ఆదివారం సప్తగిరి కాలనీలోని ఓ ఫంక్షన్‌ హాలులో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. ఓట్ల కోసం బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే దారుస్సలాంపోయి కరీంనగర్‌ ప్రజల ఆత్మగౌరవాన్ని ఓవైసీకి తాకట్టు పెట్టిండని విమర్శించారు. పొరపాటున మళ్లీ ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కార్పొరేషన్‌ ఎన్నికల్లో కరీంనగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌పై ఎంఐఎం జెండా ఎగరేసే ప్రమాదం ఉందన్నారు. అదే జరిగితే కరీంనగర్‌ ప్రజలు బొట్టుపెట్టుకుని, కంకణం కట్టుకుని తిరిగే అవకాశం కూడా ఉండదని హెచ్చరించారు. అంతకుముందు నగరంలోని 11, 32, డివిజన్లకు చెందిన వేణు, విజయ్‌, సాయిచరణ్‌, రామ్మోహన్‌, రాకేశ్‌, రాజేశ్‌, ఫయాజ్‌, మల్లేశం, నర్సయ్య, రమేశ్‌, మందసాయిచరణ్‌, సాయి, చింటూ, సన్నీ చరణ్‌ సహా యువకులు భారీ ఎత్తున సంజయ్‌ సమక్షంలో బీజేపీలో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మోదీ సభకు తరలిరండి..

నగరంలోని శుభమంగళ్‌ గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్‌, ఉమ్మడి ఆదిలాబాద్‌, ఉమ్మడి వరంగల్‌ జిల్లాల ముఖ్య నాయకులతో బండి సంజయ్‌కుమార్‌ సమావేశమయ్యారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగబోయే బీసీల ఆత్మగౌరవ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో జన సమీకరణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. మూడు జిల్లాల నుంచి భారీ ఎత్తున ప్రజలను సమీకరించాలని, ముఖ్యంగా బీసీలు భారీ సంఖ్యలో వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

'నేనెప్పుడూ మీ బిడ్డనే.. నిండు మనసుతో దీవించండి'

ఎంపీ సంజయ్‌కుమార్‌ కరీంనగర్‌ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో ఎంపీగా, రాష్ట్ర అధ్యక్షుడిగా తాను చేసిన పోరాటాలు, కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులను ప్రస్తావిస్తూ రూపొందించిన కరపత్రం ప్రజలను ఆకర్షిస్తోంది. ×నేనెప్పుడూ మీ బిడ్డనే.. నిండు మనసుతో దీవించండి₹ పేరిట రూపొందించిన 2 పేజీల కరపత్రాలను బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ×నేనెప్పుడూ మీ బిడ్డను.. మీ కళ్ల ముందు పెరిగిన. మీ కాళ్ల మధ్య తిరిగిన. మీ దీవెనలతోనే ఇంతటివాడినయ్యా. కరీంనగర్‌ గల్లీల్లో తిరిగిన సామాన్యుడికి పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం కల్పించారు. పోరాటాల, చైతన్యాల కరీంనగర్‌ గడ్డపై పుట్టిన బిడ్డగా దేశం కోసం, ధర్మం కోసం కాషాయ జెండా పట్టుకుని ప్రజల పక్షాన పోరాడిన₹ అంటూ కరపత్రాన్ని రూపొందించారు. అంతేగాకుండా ఎంపీగా గెలిపించాక కరీంనగర్‌ అభివృద్ధికి చేసిన కార్యక్రమాలు, తెచ్చిన నిధులతోపాటు తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజల పక్షాన చేసిన పోరాటాలను, జైలుకు వెళ్లిన సందర్భాలను కరపత్రంలో ప్రస్తావించారు. కాగా కరపత్రంపై ప్రజల్లో సానకూల చర్చ జరుగుతోంది.

గోపాల్‌పూర్‌లో కరపత్రాల పంపిణీ

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఆదివారం మండలంలోని గోపాల్‌పూర్‌లో కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ముందుగా ఎంపీగా సంజయ్‌, కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచురించిన కరపత్రాలకు హన్మాన్‌ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ కమలంపువ్వు గుర్తుకు ఓటేసి సంజయ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి, నాయకులు అనుముల తిరుపతి, శ్రీనివాస్‌, పెంతల నారాయణ, ఒరిగెల రమేశ్‌, పత్తెం ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి


58వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్‌: 'బండి సంజయ్‌ గెలుపు.. కరీంనగర్‌కు మలుపు' అని బీజేపీ రాష్ట్ర నాయకురాలు గంద్ర నళిని పేర్కొన్నారు. కేసీఆర్‌ నియంత పాలనపై అలుపెరగని పోరాటం చేసిన సంజయ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆదివారం 58వ డివిజన్‌ కార్పొరేటర్‌ రాపర్తి విజయ ఆధ్వర్యంలో నళిని విస్తృతంగా ప్రచారం చేశారు. డివిజన్‌ అధ్యక్షుడు గుంటి కుమార్‌, గొట్టముక్కల వేణు, శ్రీనివాస్‌, ఏనుగుల బాలమ్మ, శివాని, శిరీష, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు ప్రచారం

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా బీజేపీ విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్‌ లాల మురళి ఆధ్వర్యంలో ఎస్సారార్‌ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం వాకర్స్‌ని కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని ఉద్యోగ పెన్షనర్లను చిన్నచూపు చూస్తుందన్నారు. ఈ ప్రభుత్వం మొదటి తారీకు వేతనాలు ఇవ్వడం లేదని, అప్పుల తెలంగాణ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో పశ్చిమ జోన్‌ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, సెల్‌ జాయింట్‌ కన్వీనర్‌ రాగి సత్యనారాయణ, రొంటాల కేశవరెడ్డి, వై.రామచంద్రారెడ్డి, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


సంతోష్‌ (ఫైల్‌)

మానకొండూర్‌: మండలంలోని దేవంపల్లికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై, అనారోగ్యానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట లక్ష్మికి ఐదుగురు కుమారులు. నాల్గో కుమారుడు కోట సంతోష్‌ (28) రోజూ గ్రామం నుంచి వెళ్తూ కరీంనగర్‌లో మోటార్‌ మెకానిక్‌గా పని చేసేవాడు. ఐదేళ్లుగా మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. గురువారం తల్లి తన నలుగురు కుమారులతో కలిసి దైవ దర్శనానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనస్తాపానికి గురైన సంతోష్‌ ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీపీ, షుగర్‌ అదుపులో ఉంటేనే ఆరోగ్యం


మాట్లాడుతున్న డాక్టర్‌ కిరణ్‌కుమార్‌

కరీంనగర్‌టౌన్‌: మారుతున్న జీవన ప్రమాణాల కారణంగా 30 ఏళ్లు దాటినవారికి బీపీ, షుగర్‌, గుండె జబ్బులు రావడం సర్వసాధారణమైందని, ఈ పరిస్థితుల్లో బీపీ, షుగర్‌ అదుపులో ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని కార్డియాలజిస్టు డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ కొండపాక పేర్కొన్నారు. కరీంనగర్‌ మెడికవర్‌ ఆసుపత్రి, ఐఎంఏ, ఎస్సారార్‌ కళాశాల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ఎస్సారార్‌ కళాశాలలో వాకర్స్‌ కోసం ఏర్పాటు చేసిన హెల్త్‌టాక్‌ కార్యక్రమంలో డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ కొండపాక, ఎండోక్రైనాలజిస్టు డాక్టర్‌ కొండచైతన్య పాల్గొని వ్యాధులు, వాటి నివారణ చర్యలపై వివరించారు. పలువురు వాకర్స్‌ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. ఏ లక్షణాలు లేకుండా సంక్రమించే బీపీ, షుగర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల హార్ట్‌ ఎటాక్‌, కిడ్నీ ఫెయిల్యూర్‌ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. నిద్రలేమి, ఒత్తిడితో బాధపడేవారు, ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవాళ్లు రెగ్యులర్‌ స్క్రీనింగ్‌ చేసుకోవడం మేలన్నారు. చిన్న వయస్సులో హార్ట్‌ఎటాక్‌లు రావడానికి ఆహారపు అలవాట్లు, ఒత్తిడే కారణమని తెలిపారు. మొబైల్‌తోనే ప్రారంభమై మొబైల్‌తోనే రోజంతా గడిచిపోతుందని, అందులో కొంత సమయాన్ని వ్యాయామం కోసం కేటాయిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ రాంకిరణ్‌ మాట్లాడుతూ, ప్రతి నెలా మొదటి ఆదివారం ఎస్సారార్‌ కళాశాలలో నిర్వహించే ఆరోగ్య అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికవర్‌ సెంటర్‌ హెడ్‌ గుర్రం కిరణ్‌, సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్‌హెడ్‌ కర్ణాకర్‌, హర్షిత, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాలు


గాయపడిన హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పోలీసులకు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలో జరిగింది. ఎస్సై రాజకుమార్‌ వివరాల ప్రకారం.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్‌ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌ బైరి శ్రీనివాస్‌, హోంగార్డ్‌ రాజేందర్‌ప్రసాద్‌ బైక్‌పై సిరిసేడు గ్రామం నుంచి ఇల్లందకుంటకు వస్తుండగా మార్గమధ్యలో ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌ కాలు, చేయి విరగగా, రాజేందర్‌ప్రసాద్‌ కాలి మడిమ వద్ద గాయమైంది. ఎస్సై రాజకుమార్‌ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. గాయపడినవారిని ఏసీపీ జీవన్‌రెడ్డి, రూరల్‌ సీఐ కిషోర్‌, పట్టణ సీఐ రమేశ్‌ పరామర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు


పట్టుబడిన మద్యంతో సీఐ, సిబ్బంది

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో నాటుసారా, గంజాయి, గుడుంబా, అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్‌ ఎక్సైజ్‌ సీఐ ఇంద్రప్రసాద్‌ అన్నారు. ఆదివారం నల్లగొండ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా మార్క రాములు తన ద్విచక్ర వాహనంపై 24 మద్యం బాటిళ్లు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. విచారణ చేస్తే అక్రమ మద్యం రవాణా చేస్తున్నాడని తెలుసుకొని వాహనంతో పాటు మద్యం బాటిళ్లను సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అక్రమ రవాణా, అమ్మకాలకు పాల్పడితే 87126 58810 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సీఐ వెంట ఎస్సై సరిత, సిబ్బంది కొండల్‌రెడ్డి, రజిత, సురేశ్‌ తదితరులున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్‌

కరీంనగర్‌క్రైం: నగరంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్‌ పోలీసులు తెలిపారు. ఓ లాడ్జిలో ఆరుగురు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ.11,450 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట మున్సిపల్‌ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన బాలిక అదృశ్యమైంది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్‌ తెలిపారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

కరీంనగర్‌క్రైం: రేషన్‌ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. వన్‌టౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌ ఆటోనగర్‌కు చెందిన టి.మల్లేశం తన వాహనంలో 3.3 క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేశారు. అతడు తక్కువ రేట్‌కు కొనుగోలు చేసి ఎక్కువ రేట్‌కు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


గంగాధర్‌ మృతదేహం

చొప్పదండి: మండలంలోని రాగంపేట శివారు పందివాగు సమీపంలో ట్రాక్టర్‌ ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మల్యాల మండలానికి చెందిన బాసవేని చిన్న గంగాధర్‌ (40) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గంగాధర్‌ ఇటీవలే గల్ఫ్‌ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఆర్నకొండలోని బంధువుల ఇంటికి వచ్చి మ్యాడంపల్లికి ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా రాగంపేట గ్రామంలో ఇసుకను అన్‌లోడ్‌ చేసి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో గంగాధర్‌ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాబ్బాబు.. జర నా మాట విను!

- నేతలు దిగివచ్చిన వేళ.. ఎన్నికల సిత్రాలు

కోరుట్ల: ఏమైందిరా రాజు.. ఎన్నడు లేంది ఇయ్యాల మన చిన్న లీడరు ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ వస్తుంది. ఎక్కడున్నడో ఎమో.. గీ ఎలచ్చన్ల ఏమన్న ఎంజాయ్‌ చేద్దామంటే దొరుకుతలేడేంది రా.. అంటూ తన దోస్తుని పలకరించిండు శ్రీను. గీ పలకరింపుతో ఇద్దరు జర దూరంగా పోయి గుసగుస మొదలెట్టిండ్రు. గ ముచ్చట సంగతేంటో తెలుసుకుందాం.



రాజు: ఏమైందిరా శీను ఒక్కసారిగా గా మందిల కెళ్లి నన్ను మూలకు పట్టుకొచ్చి ముచ్చట మొదలెట్టిన్‌..?

శ్రీను: అరె రాజు గీ ముచ్చట అందరిలో చెప్పేది కాదురా. వారం నుంచి మనూరి చిన్న లీడరు ఫోన్‌ కలుస్తలేదు. నేను కూడా మస్తుసార్ల కొట్టిన. ఎందుకు కలుస్త లేదో తెలుసా..?

రాజు: ఎందుకు ఫోన్‌ కలుస్తలేదని నిన్ను అడిగితి. మళ్లీ నాకెట్లా తెలుస్తది నువ్వే చెప్పు ఎం కథనో..?

శ్రీను: ఇగో ఎవల్లతోని అనకు గానీ మన చిన్న లీడరు పార్టీ మారుదమని చూస్తున్నడు. ఇది తెలిసి ఇప్పుడున్న పార్టీ మనుషులు గీ ఎలచ్చన్ల టైమ్‌లో ఎట్ల మారుతవ్‌ అని మస్తు ఒత్తిడి తెస్తుండ్రు. గందుకే మనోడు సెల్‌ఫోన్‌ స్విచ్చాఫ్‌ పెట్టి చుట్టాలింటికి పోయిండు.

రాజు: గట్లనా ఇప్పుడున్న పార్టీకి ఏమైందిరా, ఎందుకు మారుతడట. గీ ముచ్చట నాకు ఎప్పుడు ఇనవడలే..?

శ్రీను: ఏడాది నుంచి మన చిన్న లీడరు వాళ్ల పార్టీ పెద్ద సారును ఓ పని అడిగితే గాయిన నానబెట్టుకుంట వచ్చిండట. మందికి ఏం చేసినా చేయకపోయినా సరే కానీ నేను చెప్పిన పని కాకపోయే అని అలిగి ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ పెట్టి వేరే పార్టోళ్లతోటి మంతనాలు మొదలెట్టిండని తెలిసింది.

రాజు: అవునా మరి నాకైతే ఏం తెల్వలే. మొన్న మన చిన్న లీడరు పార్టీ పెద్ద సారు మన ఊరికి వచ్చిండు గానీ ఆయన ప్రచారం కోసం వచ్చిండని అనుకున్నా.

శ్రీను: ప్రచారం లేదు ఏం లేదు. మన చిన్న లీడరు పార్టీ ఎక్కడ ఇడిసిపెడతడోనని వాళ్ల పార్టీ పెద్దసారు గడిబిడ అయిండు. మన చిన్న లీడరుకు ఫోన్‌ చేస్తే కల్వలేదు. డౌటచ్చి పెద్ద లీడరు సీదా మనోని ఇంటికి వెళ్లిండు. గప్పుడు మనోడు గా ముచ్చట..గీ ముచ్చట చెప్పి మూడు గంటలు బతిమాలిచ్చుకున్నడు. చివరికి ఇద్దరు కలిసి పళ్లికిలిచ్చుకుంట ఓ ఫొటో దిగిండ్రు. గప్పుడు పెద్ద లీడరు మనసు తిరమైంది.

రాజు: గీ ముచ్చటంత నాకు తెల్వకపోయే. పార్టీ పెద్ద సారు వచ్చి మూడు రోజులాయే, మరి ఇంకా మన చిన్న లీడరు ఫోన్‌ కలుస్తలేదు కదా..?

శ్రీను: ఇగో..గీడ మరో తిరకాసు జరిగింది. చిన్న లీడరు పార్టీకి చెందిన పెద్ద లీడరు వచ్చి మాట్లాడి పోయిండో లేదో గీ ముచ్చట తెలిసి ఎక్స్‌పార్టీ లీడరు వెంటనే మనోని ఇంటికి వచ్చిండు. అగో మాతోని వస్తనని అంటివి కదా..మా పార్టీలోకి రా..అనంగనే మనోడు మళ్లీ బతిమాలించుకుని ఎక్స్‌పార్టీ లీడరుతో పళ్లికిలిచ్చుకుంట ఫొటోలు దిగిండు. ఇగ ఆ తర్వాత గీ తలనొప్పి ఎందనుకుని ఫోన్‌ స్విచ్‌ఆఫ్‌ చేసిండు. ఎట్లయితే ఏందిరా..ఎన్నడు రాని పెద్ద లీడర్లను మనోడు ఇంటికి రప్పించుకున్నడు, బతిమాలించుకున్నడు.

బైక్‌ అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి..

- ఒకరు మృతి.. మరొకరి తీవ్రగాయాలు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని చెందోళి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఆత్రం సాయికుమార్‌ (24) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన సాయికుమార్‌ వరుసకు తమ్ముడైన శడమాకి నాగబాబుతో కలిసి జగిత్యాలలో పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో చందోళి శివారులో బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరూ ఎగిరి కిందపడ్డారు. ఈ క్రమంలో సాయికుమార్‌ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. సాయికుమార్‌ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో బీట్‌ ఆఫీసర్‌కు తీవ్రగాయాలు

కథలాపూర్‌(వేములవాడ): మండలంలోని ఇప్పపెల్లి శివారులో ఆదివారం రాత్రి టాటా ఏస్‌ వాహనం బైక్‌ను ఢీకొట్టగా అటవీశాఖ బీట్‌ ఆఫీసర్‌ కారం శ్రీనివాస్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్‌ పోతారం బీట్‌ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇప్పపెల్లి శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ వాహనం ఢీకొట్టింది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మిల్క్.. నగర్!

- వినియోగదారుడి చెంతకే స్వచ్ఛమైన పాలు
- కొనుగోలు చేస్తున్న నగర వాసులు
- నగరంలో పెరుగుతున్న పాల విక్రేతలు
- కొనుగోలు దారులకు ఆరోగ్యం.. పాడి రైతులు లబ్ధి

కరీంనగర్ అర్బన్: పాలు.. చిన్నారుల ఎదుగుదలకు మానవ మనుగడకు అవసరం. కానీ కల్తీ పాలు నీడలా వెంటాడుతున్నాయి. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న పలువురు అక్రమార్కులు పాలను కల్తీ చేసి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజావసరాలకు తామైనా కొంత మేరకు దోహదపడాలని భావించారీ పాడి రైతులు. డెయిరీలు, హోటళ్లు, ఇతరత్రా వాటికి కాకుండా నేరుగా వినియోగదారులకే పాలు విక్రయిస్తున్నారు. చుక్క నీరు కలపకుండా నాణ్యమైన పాలను అందిస్తుండటంతో నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.


కరీంనగర్‌లో పాలు విక్రయిస్తున్న రైతు శ్రీనివాస్‌రెడ్డి

నగరంలో పలు చోట్ల విక్రయాలు

నగరంలో ఎస్సారార్ కాలేజీ, అంబేడ్కర్ స్టేడియం, కశ్మీర్‌గడ్డ, వావిలాలపల్లి, రాంనగర్, మంకమ్మతోట, గోదాం గడ్డ, మారుతీనగర్, విద్యానగర్, రేకుర్తి తదితర ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని పాలను విక్రయిస్తున్నారు. నగర శివారు ప్రాంతాలు, తిమ్మాపూర్, మానకొండూరు, రామడుగు ప్రాంతాల్లో పాడి గేదెలు, ఆవులను పెంచుతున్నారు. డెయిరీలకు విక్రయిస్తే లాభాలు అంతంతమాత్రమే కావడంతో నేరుగా ప్రజలకే విక్రయిస్తున్నామని వారు వివరించారు. నేరుగా విక్రయం వల్ల అదనపు ఆదాయం లభించడమే కాకుండా ప్రజాసేవలా ఉంటుందన్న కారణంతో పాడి పరిశ్రమలో భాగస్వాములయ్యారు. శివారు ప్రాంతాల్లో గడ్డిని పెంచడం, రైతులు, మిల్లుల వద్ద తౌడు కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచుతున్నారు.

సొంతంగా పాల వ్యాపారం

ఉత్పత్తి అయిన పాలను డెయిరీల్లో కాకుండా సొంత వ్యాపారం చేస్తున్నారు. ఒక్కో గేదె వాటి జాతిని బట్టి పాలిస్తుండగా కనిష్టంగా మూడు లీటర్లు గరిష్టంగా 8 లీటర్లు ఇస్తున్నాయి. వీటిని సొంతంగా మార్కెటింగ్ చేస్తున్నారు. నాణ్యమైన పాలు కావడం.. రైతులే విక్రయిస్తుండటంతో కల్తీ ఉండదన్నది కొనుగోలుదారుల నమ్మకం. పూర్తి సహజ పద్ధతిలో పాల ను ఉత్పత్తి చేస్తున్నారు. ఉదయం పాల విక్రయం.. సాయంత్రం పాలు తీయడం వీరి పని. పాడిగేదెల సపర్యలకు కార్మికులను ఏర్పాటు చేసుకుని వారికి చేతినిండా పని కల్పిస్తున్నారు. డెయిరీలకు విక్రయించడం వల్ల ఫ్యాట్ పేరుతో తక్కువ ధర కడుతున్నారని, ఇచ్చే డబ్బులు కూడా పక్షం రోజులకోసారి వస్తుంటాయని కర్శకులు వివరించారు. నేరుగా ప్రజలకే విక్రయించడం ఎప్పటికప్పుడు డబ్బులు వస్తుండగా చుక్క నీరు పోయకుండా అమ్ముతుండటంతో వినియోగదారులు లీటరు పాలను లీటరున్నరగా తయారు చేసుకోవచ్చని అంటున్నారు.

సొంతంగా విక్రయమే మేలు



పాడి గేదెలను కష్టపడి పోషించి వాటి నుంచి వచ్చే పాలను డెయిరీలకు విక్రయిస్తే మా పాలతో వారు వ్యాపారం చేస్తున్నారు. మా దగ్గర లీటరు పాలను రూ.60కి కొనుగోలు చేసి ఆ పాలతో పలు రకాలుగా వ్యాపారం చేస్తున్నారు. మేమే వినియోగదారులకు నేరుగా పాలను విక్రయిస్తే మాకు ధర గిట్టుబాటు అవుతుండగా వారికి నాణ్యమైన పాలు అందుతాయన్న ఆలోచనతో విక్రయిస్తున్నా. తక్కువ పాల ఉత్పత్తితో ఒక్కోసారి వినియోగదారులకు అందించలేకపోతున్నా.
– గంభీరావుపేట రవి, పాడి రైతు, మల్కాపూర్

పదిహేనేళ్లుగా పాలమ్ముతున్నా



15 ఏళ్లుగా అంబేడ్కర్ స్టేడియం వద్ద పాలమ్ముతున్నా. చుక్క నీరు కలిపేది లేదు. గేదె, ఆవు నుంచి తీసిన పాలను అలాగే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నాం. వినియోగదారుల్లో నమ్మకం ఏర్పడింది. మా పాలను ఎప్పుడైనా పరీక్షించుకోవచ్చు.
– శ్రీనివాస్‌రెడ్డి, పాడి రైతు, తిరుమల్‌నగర్

సంతృప్తి



పాడి గేదెలను పెంచక ముందు ఇంట్లో అవసరాలకు పాలను కొనేది. నీళ్లతో కూడిన పాలు కావడంతో అవి తాగితే నీళ్లు తాగినట్లే అనిపించేది. ఇంటి ఆవరణలో ఖాళీ స్థలముంది కాబట్టి అదే ప్రాంతంలో పాడిగేదెలను పెంచుతున్న. ఇంట్లో అందరం నాణ్యమైన పాలు తాగుతున్నం. మంకమ్మతోట వద్ద రోజూ పాలను విక్రయిస్తుంటా. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలను అందించలేకపోతున్నా. మరిన్ని గేదెలను కొనుగోలు చేస్తా.
– రాజయ్య, వచ్చునూరు

ఎప్పటికప్పుడు డబ్బులు



వ్యవసాయంతో పాటు పాడి గేదెలతో ఉపాధి పొందుతున్న. నగరంలోని ఎస్సారార్ కళాశాల వద్ద పాలను విక్రయిస్తున్న. ఉదయం, సాయంత్రం పాలను ఎప్పటికప్పుడు విక్రయిస్తుండగా నగదు చేతికి చేరుతోంది. వచ్చే నగదుతో వ్యవసాయానికి వినియోగిస్తున్న.
– ఆంజనేయులు, పాడి రైతు, మొగ్దుంపూర్

వరికోతలు ముమ్మరం


చెర్లభూత్కూర్‌లో వరికోస్తున్న హార్వెస్టర్

- మబ్బులు పడుతున్న ఆకాశం
- ఆందోళనలో రైతాంగం

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. రెండు రోజుల నుంచి ఆకాశంలో మబ్బులు పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వరిపచ్చిగా ఉన్నప్పటికీ హార్వెస్టర్లతో యుద్ధప్రాతిపదికన కోతలు పూర్తి చేస్తున్నారు.

12వేల ఎకరాల్లో వరిసాగు

వానాకాలం సీజన్‌లో కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల పరిధిలో 12 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేయగా సుమారు 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ముందస్తుగా వరి నాట్లేసిన రైతులు పదిరోజుల నుంచి వరికోతలు చేపట్టారు. ప్రస్తుతం మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, దుర్శేడ్, ఇరుకుల్ల, నగునూరు, ఎలబోతారం తదితర గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం హార్వెస్టర్ కిరాయి గంటకు రూ.1,800 నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులతో పలువురు రైతులు వరికోతలు త్వరగా పూర్తి చేసేందుకు హార్వెస్టర్ల కోసం తిరుగుతున్నారు. అయితే రెండురోజుల నుంచి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లను చేపట్టారు. ఇప్పటికే వరిపంటకు మొగిపురుగు, తెల్లకంకి, అగ్గితెగులు ఆశించడంతో దిగుబడి అనుకున్నంతగా రావడం లేదని పలువురు రైతులు తెలిపారు.

అమ్మాయిలకు ఆత్మరక్షణ అవసరం


కరాటే బెల్టులు ప్రదానం చేస్తున్న విజయలక్ష్మి

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుత రోజుల్లో ప్రతీ అమ్మాయికి ఆత్మరక్షణ అవసరమని డాక్టర్ విజయలక్ష్మీ అన్నారు. నగరంలోని సప్తగిరికాలనీలో గల సప్తగిరి హైస్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులకు నిర్వహించిన కరాటే పోటీల్లో వివిధ స్థాయి బెల్టులు సాధించిన విద్యార్థులకు ఆదివారం బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. ప్రతి అమ్మాయి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొంది ఉండాలని అన్నారు. ఒకినావా సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ మాట్లాడుతూ కరాటే పోటీ పరీక్షల్లో వివిధ విద్యా సంస్థలకు చెందిన సుమారు 160 మంది విద్యార్థులు పాల్గొని వివిధ స్థాయి బెల్టులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.నగేశ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి


మాట్లాడుతున్న నీలం మొండయ్య

కరీంనగర్: కరీంనగర్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంగుల కమలాకర్ మద్దతుగా ఈనెల 7న పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని నాయీబ్రాహ్మణులు తరలిరావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య అన్నారు. ఆదివారం వావిలాలపల్లిలోని సంఘం నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.బీఆర్‌ఎస్ హయాంలో కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ స్థలాలను కేటాయించి నిధులు సమకూర్చి, బహుజనుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసిన సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలిచేందుకు బీసీ కులాలు చేపడుతున్న ఆత్మీయ సమ్మేళనాన్ని అనుకరిస్తూ నాయీబ్రాహ్మణ సంఘీయులు ఏర్పాటు చేస్తున్న సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు గడ్డం మోహన్, తూముల శ్రీనివాస్, ఎర్రబొజ్జు నర్సయ్య, పగడాల జయరాం, జంపాల సంపత్, కంది వెంకటేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిగా సంతోష్


రుద్ర సంతోష్

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కరీంనగర్ జిల్లాకు చెందిన రుద్ర సంతోష్ నియమితులయ్యారు. గంగాధర మండలం ఆచంపల్లికి చెందిన సంతోష్ ఆరు నెలలుగా లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం)పై విస్తృతంగా పనిచేస్తూ బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా పర్యవేక్షణ చేశారు. ఎల్‌డీఎం యాప్‌ను డెవలప్ చేసి 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పురోగతి సాధించేందుకు చేసిన కృషిలో భాగంగా సంతోష్‌ను పార్టీ ఇన్‌చార్జిగా ఏఐసీసీ నియమించింది. కాగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 31 ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలకు సంతోష్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజేశ్ లిలోతియా తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో దళితులను చైతన్యపరిచి వ్యూహాత్మక విధానాలతో పార్టీని గెలిపించాలని సూచించారు. సంతోష్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యాలయాన్ని నాయకుడు తునికి వసంత్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విశ్వరూప మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ముప్పై ఏళ్లుగా పెండింగ్ లో ఉందన్నారు. వర్గీకరణను పార్లమెంటు ద్వారా చట్టం చేసి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రుద్రారపు రామచంద్రం, రేణిగుంట్ల సాగర్, మారేపల్లి శ్రీనివాస్, వేల్పుల రత్నం, బొరగాల సారయ్య, డాక్టర్ తడికమళ్ల శేఖర్, ఎర్ర ఆదిత్య, అంబాల రాజు, తూర్పాటి రాజు, దేవునూరి రవీందర్, ఎర్ర మొగిలి, ఎర్ర రమేశ్, ఎర్ర రాజ్‌కుమార్, ఎర్ర శ్రీధర్, ఎర్ర నాగరాజు, తునికి సమ్మయ్య, ఇల్లందుల సమ్మయ్య, బత్తుల రాజలింగం తదితరులు ఉన్నారు.

రూ.65 కోట్లతో హెచ్‌బీ కాలనీ అభివృద్ధి


కాలనీవాసులతో మేయర్ సునీల్‌రావు

- నెలరోజుల్లో 24 గంటల తాగునీటి సరఫరా
- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీని రూ.65 కోట్లతో అభివృద్ధి చేశామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. నెలరోజుల్లో కాలనీలో 24 గంటల తాగునీటి సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఆదివారం హౌసింగ్‌బోర్డుకాలనీని సందర్శించి స్థానికులతో సమావేశమయ్యారు. కాలనీలోని ఓపెన్‌జిమ్‌ను పరిశీలించారు. ఆదరణ ఎక్కువగా ఉండడం, సమీప కాలనీవాసులు కూడా వస్తుండడంతో మరో జిమ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఇందుకు స్పందించిన మేయర్ ఓపెన్ జిమ్ ప్రక్కనే మహిళలకు ప్రత్యేకంగా జిమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హౌసింగ్ బోర్డుకాలనీని నగరంలో ఓ మోడల్ కాలనీగా అభివృద్ధి చేశామని అన్నారు. నెలరోజుల్లో 24 గంటల తాగునీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు. మొదటిదఫాలో నాలుగు వేల నల్లా కనెక్షన్‌లకు సరఫరా చేస్తామని అన్నారు. అలాగే కాలనీ మొత్తానికి కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు, మహిళా సంఘం భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్, జాజాల మోహన్‌రావు, గర్రెపల్లి సత్యనారాయణరావు, తోట రాజేందర్, ఆకుల సుదర్శన్, నరసింహాచారి, వాసు గౌడ్, భాస్కర్‌రావు, వసంత్, షాకీర్, రవీందర్‌రెడ్డి, ఆకుల ఉదయ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా నగునూరి రాజేందర్


రాజేందర్‌కు నియామక పత్రం అందజేసి సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కరీంనగర్: ఆర్యవైశ్య సంఘం కరీంనగర్ పట్టణ అధ్యక్షుడిగా నగునూరి రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో ఏకైక అభ్యర్థిగా మిగిలిన నగునూరి రాజేందర్‌ను అధ్యక్షుడిగా ప్రకటిస్తూ ఆర్యవైశ్య మహాసభ జిల్లా శాఖ ప్రతినిధులు వెల్లడించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన రాజేందర్‌ను ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ఎన్నికల కన్వీనర్ రాచమల్ల ఆంజనేయులు, కోకన్వీనర్ ఏవీ మల్లికార్జున్, ఎన్నికల న్యాయసలహాదారు బండ శివకుమార్, ఎన్నికల పర్యవేక్షకులు చంద రాజు, శివనాథుని శ్రీనివాస్, అభ్యుదయ సంఘాల అధ్యక్షులు, ప్రముఖ వైశ్యుల సమక్షంలో సన్మానించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగునూరి రాజేందర్ మాట్లాడుతూ 15ఏళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గౌరవం దక్కిందని, ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తూ పేద ఆర్య వైశ్యులకు అందుబాటులో ఉంటూ సహకారాలు అందిస్తానని తెలిపారు.

గంజాయి పట్టివేత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందులలో గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఎలగందులలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మార్కారవ ప్రతాప్‌పూర్ గ్రామానికి చెందిన సోనం కుమార్ తన రాష్ట్రం నుంచి ఐదు నెలల క్రితం తీసుకువచ్చిన 500 గ్రాముల గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదివారం రాత్రి పట్టుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.12,500 ఉంటుందని, కుమార్‌ను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం ..

రామడుగు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని రామడుగు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన దుర్మట్ల రాజు ఆదివారం మధ్యాహ్నం రూ.3,300 విలువ చేసే మద్యం బాటిళ్లు తరలిస్తుండగా దత్తోజీపల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

‘అన్నివిధాలుగా అండగా ఉంటాం’

రామడుగు: తండ్రి కరోనా బారిన పడి మృతి చెందాడు. తల్లి తన ఇద్దరు కూతుళ్లను చదివించేందుకు హోటల్‌లో పనిచేస్తోంది. విషయం తెలిసిన కరీంనగర్‌కు చెందిన శ్రీవాయుతేజ్ డెవలపర్స్ వారు ఆర్థిక సాయం అందించారు. రామడుగు మండలంలోని వెలిచాల గ్రామ పరిధిలోనికి కిష్టారావుపల్లికి చెందిన బొల్లి బాలకిషన్ మూడేళ్లక్రితం కరోనాతో మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈక్రమంలో పెద్దకూతురు వివాహం కుదిరింది. విషయం తెలుసుకున్న శ్రీవాయుతేజ్ డెవలపర్స్ వారు ఆదివారం వారిని కరీంనగర్‌లోని కార్యాలయానికి పిలుచుకొని రూ.11వేల విలువ గల చెక్కును వివాహ ఖర్చుల కోసం అందజేశారు. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని, చిన్న కూతురు సంధ్య చదువు ఖర్చులు కూడా భరిస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన సంగెం బాలు ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సాక్షి యూనిట్ ఎడిటోరియల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగులు రూ.20 వేలు సమకూర్చారు. ఆదివారం మృతుడి భార్య, తల్లిదండ్రులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో సోమగల్ల వీర్రాజు, పాశం బాలరాజు, ఎలుక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కార్యదర్శికి.. | కళాశాల పోటీల బాధ్యతలు

- ఇంటర్ విద్యాశాఖ కొత్త నిర్ణయం
- గురుకుల పీడీకి నో చెప్పిన వైనం
- ఒక్క ఉమ్మడి జిల్లాలోనే ఇలా..
- ఎస్జీఎఫ్ క్రీడల్లో ఇంటర్ విద్యార్థులు నష్టపోతారంటున్న పీడీలు



ఇంటర్ విద్యాశాఖ కార్యాలయం

కరీంనగర్ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏటా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్న విషయం విదితమే. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి 80కి పైగా క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. కరోనా వైరస్ నేపథ్యంలో మూడేళ్ల అనంతరం ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. కాగా, కళాశాల స్థాయి పోటీల నిర్వహణకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ ఎస్జీఎఫ్ కళాశాల కార్యదర్శిని నియమించడం ఆనవాయితీ. కానీ 2023–24 విద్యాసంవత్సరానికి గానూ కొత్త తరహాలో నియామకం చేపట్టారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే పాఠశాల కార్యదర్శికి కళాశాల పోటీల బాధ్యతలు అప్పగించి, చేతులు దులుపుకుంది.

ఇష్టారాజ్యంగా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరంగా ప్రభుత్వ కళాశాలలో ఒకరు, గురుకుల కళాశాలల్లో 8 మంది పీడీలుగా పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కళాశాల పీడీని కార్యదర్శిగా నియమించాలి. కానీ, కొన్నేళ్లుగా ఒక్కరే కార్యదర్శిగా కొనసాగుతుండటంతో ఇంటర్ విద్యాశాఖ మరోసారి కార్యదర్శిగా కొనసాగేందుకు అనుమతినివ్వలేదు. మంథనిలోని గురుకుల కళాశాల పీడీ క్రీడా పోటీల బాధ్యతలు తనకివ్వాలని కోరుతూ డీఐఈవోకు వినతిపత్రం ఇచ్చారు. నిజానికి సంగారెడ్డి, నల్గొండ ఉమ్మడి జిల్లాల కళాశాల కార్యదర్శులుగా గురుకుల కళాశాల పీడీలు కొనసాగుతున్నారు. ఆ ఉత్తర్వులను చూపించినా పట్టించుకోకుండా ఎస్జీఎఫ్ఐ స్కూల్ గేమ్స్ కార్యదర్శికి కళాశాల పోటీల నిర్వహణ బాధ్యతలు ఇవ్వడం కొసమెరుపు.

అంతర్యమేమిటో?

ఉమ్మడి జిల్లాలోని తమను కాదని పాఠశాల కార్యదర్శికి క్రీడాపోటీల నిర్వహణను అప్పగించడంలో అంతర్యమేంటోనని పలువురు గురుకులాల పీడీలు అంటున్నారు. దీంతో కళాశాలల విద్యార్థులకు ఏ క్రీడలో ఎప్పుడు పోటీలను నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. దీనివల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

కరీంనగర్ టీంకు ఎంట్రీ ఇవ్వలే..

అక్టోబర్‌లో సంగారెడ్డి జిల్లాలో అండర్ –19 బాలబాలికల కబడ్డీ పోటీలు జరిగాయి. అప్పటికీ ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శి నియామకం చేపట్టలేదు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు పీడీలు తమ క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్లారు. అక్కడ కరీంనగర్ టీంకు ఎంట్రీ లేదని చెప్పి, వెనక్కి పంపించారు. సంగారెడ్డి జిల్లా కార్యదర్శికి ఫోన్ చేసి, తమ జిల్లాకు ఎంట్రీ ఇవ్వండని చెప్పే నాథులే ఆ సమయంలో లేరు. కాగా, కబడ్డీతో పాటు రగ్బీ, ఫుట్‌బాల్ క్రీడల్లో జిల్లా జట్లు పాల్గొనకపోవడం ఇంటర్ విద్యాశాఖ అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని పలువురు క్రీడా విశ్లేషకులు అంటున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

సైదాపూర్: మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. వెన్నంపల్లి, సైదాపూర్, దుద్దెనపల్లి, ఆకునూర్, ఘనపూర్, అమ్మనగుర్తి, బొమ్మకల్, రాయికల్‌ను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలించి, సమస్యలు రాకుండా అందరూ సహకరించాలని ఏసీపీ గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా...

12న తిరుమలలో దీపావళి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన 'దీపావళి ఆస్థానం'టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తర్వాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. కాగా, దీపావళి ఆస్థానం కారణంగా ఆ రోజు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

మూడు రోజులు వానలు!
పలుచోట్ల మోస్తరుగా కురిసే చాన్స్



సాక్షి, విశాఖపట్నం: చాలా రోజుల తర్వాత రాష్ట్రంలో వానలు కురుస్తున్నాయి. రానున్న మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర తమిళనాడు, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్రంపైకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. అదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు చురుకుదనాన్ని సంతరించుకున్నాయి. వాటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. నగరి (చిత్తూరు)లో 5.5 సెం.మీ.లు, యలమంచిలి (అనకాపల్లి) 5.2, సత్తెనపల్లి (పల్నాడు) 5.1, ముతుకుల (ప్రకాశం) 4.3, బ్రాహ్మణపల్లి (ఎస్పీఎస్సార్ నెల్లూరు) 4.2, మొగులూరు (ఎన్టీఆర్) 4.1, వడమాలపేట (తిరుపతి) 3.4, చిన్నతిప్పసముద్రం (అన్నమయ్య), పెందుర్తి (విశాఖపట్నం)లో 3.2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

చిట్‌ఫండ్ మోసాలకు కళ్లెం

ఆన్‌లైన్‌లో చిట్‌ఫండ్ కంపెనీల పర్యవేక్షణ

- అందుబాటులోకి ఈ–చిట్స్ అప్లికేషన్
- అన్ని కంపెనీలు చిట్ల వివరాలు ఇందులో నమోదు చేయాల్సిందే
- కొత్త విధానంలో ఆన్‌లైన్‌లోనే చిట్లకు అనుమతులు ఇవ్వనున్న అధికారులు
- చందాదారులకు ప్రతి విషయం తెలిసేలా ఏర్పాట్లు
- చిట్లు కట్టే చందాదారుల భద్రతే ప్రధాన లక్ష్యం
- ఇప్పటికే ఉన్న కంపెనీలు సైతం ఈ విధానం పరిధిలోకి రావాల్సిందే



సాక్షి, అమరావతి: 'మార్గదర్శి' వంటి కంపెనీల మోసాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటికి కళ్లెం వేస్తోంది. చిట్‌ఫండ్ వ్యవహారాలను కట్టుదిట్టం చేసేందుకు.. ఈ సంస్థల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. సదరు కంపెనీలు నిర్వహించే చిట్ల వివరాలన్నీ ప్రజలకు తెలిసేలా ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించి 'ఈ–చిట్స్' అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. వివిధ చిట్‌ఫండ్ కంపెనీల్లో చిట్లు కట్టే చందాదారుల భద్రతే ప్రధాన లక్ష్యంగా దీన్ని అమలుచేస్తోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఒక ఆప్షన్ ఇచ్చింది. ఇకపై చిట్‌ఫండ్ కంపెనీలు తమ చిట్స్ వివరాలన్నింటినీ ఈ అప్లికేషన్‌లో నమోదు చేయాల్సిందే. మొన్నటివరకు చిట్స్ రిజిస్ట్రార్ల అనుమతితో ఆ కంపెనీలు రికార్డులు నిర్వహించేవి. గ్రూపుల వారీగా అనుమతి తెచ్చుకుని వాటి రిజిస్టర్లను తమ ఇష్టానుసారం మార్చుకుంటున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ రిజిస్టర్లకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోకపోవడం, తీసుకున్నా వాటిని సరిగ్గా నిర్వహించకపోవడం, ఆ వివరాలను చందాదారులకు తెలియకుండా దాచడం వంటి అనేక ఉల్లంఘనలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల ఆ కంపెనీల్లో ఏం జరుగుతుందో బయటకు తెలియని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే పలు చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేయడం, లక్షలాది మంది చందాదారులు తమ శ్రమను ధారపోసి కట్టిన సొమ్మును నష్టపోవడం చాలా సందర్భాల్లో జరిగాయి. ఇలాంటి చిట్‌ఫండ్ కంపెనీల మోసాలకు సంబంధించి ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా పలు కేసులు నమోదయ్యాయి.

మోసాలు అరికట్టడమే లక్ష్యం..

దీంతో.. రాష్ట్రంలో చిట్‌ఫండ్ మోసాలను అరికట్టే లక్ష్యంతో ఆన్‌లైన్ చిట్స్ పర్యవేక్షణ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహించే ఈ నూతన ఎలక్ట్రానిక్ విధానాన్ని రాష్ట్రంలోని చిట్‌ఫండ్ కంపెనీలన్నీ తప్పనిసరిగా అనుసరించాల్సిందేనని స్పష్టంచేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు తమ లావాదేవీలను ఈ అప్లికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాల్సి వుంటుంది. ఏదైనా చిట్‌ఫండ్ కంపెనీ తమ చిట్లకు అనుమతులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. వాటిని చిట్ రిజిస్ట్రార్లు ఆన్‌లైన్‌లోనే పరిశీలించి ఆమోదిస్తారు. ప్రతి చిట్‌కు సంబంధించిన గ్రూపు వివరాలు, మార్పులు, చేర్పులు, ప్రతినెలా జరిగే వేలం పాటలు వంటివన్నీ ఆన్‌లైన్‌లోనే పొందుపరుస్తారు. ఈ వివరాలన్నింటినీ చందాదారులు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. ప్రతినెలా తాను కట్టే చిట్ వివరాలను ఆన్‌లైన్‌లోనే చూసి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుంది. చిట్‌ఫండ్ కంపెనీల మోసాలను అరికట్టడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. చిట్‌ఫండ్ కంపెనీలను సమర్థవంతంగా నియంత్రించడంలోనూ వ్యాపారంలో పారదర్శకత తీసుకురావడంలోనూ ఈ నూతన విధానం ఎంతగానో దోహదపడుతుందంటున్నారు. ఇప్పటికే ఉన్న చిట్ గ్రూపుల వివరాలను కూడా త్వరలో ఈ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో నమోదు చేయనున్నారు. చందాదారులు తమ అనుమానాలను దీనిద్వారానే నివృత్తి చేసుకోవచ్చు. ఏవైనా సమస్యలున్నా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



ఇది మన స్వాభిమాన ఆత్మగౌరవ యాత్ర

- వైఎస్సార్‌సీపీ వచ్చాకే సామాజిక సాధికారత
- పేదలు తలెత్తుకుని బతికేలా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు
- కాశీబుగ్గ సామాజిక సాధికార యాత్రలో తమ్మినేని, ధర్మాన, సీదిరి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



చర్చా కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల ప్రముఖులు

బెయిల్ నిబంధనలు బేఖాతర్!

- కొందరు స్వార్థం కోసం న్యాయ వ్యవస్థను అభాసుపాల్జేస్తున్నారు
- చంద్రబాబు విషయంలోనూ అదే జరిగింది
- బెయిల్ మంజూరుపై జాతీయ స్థాయిలో చర్చ అవసరం
- ఏపీ ఇంటెలెక్చువల్స్– సిటిజన్స్ ఫోరం చర్చా వేదికలో న్యాయవాదులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం న్యాయ వ్యవస్థను అభాసుపాల్జేస్తున్నారని పలువురు న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య కారణాలతో కండిషనల్ బెయిల్‌పై వచ్చిన వ్యక్తి న్యాయస్థానం విధించిన నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించి విజయోత్సవాలు చేసుకోవడం ద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారు తప్పులు చేసి పట్టుబడినా చట్టాల నుంచి తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారని దుయ్యబట్టారు. ఇందుకు చంద్రబాబు విషయమే ఉదాహరణగా పేర్కొన్నారు. 'చంద్రబాబు వ్యవహార శైలి– బెయిల్ నిబంధనల ఉల్లంఘన– శిక్షలు'అంశంపై ఏపీ ఇంటెలెక్చువల్స్– సిటిజన్స్ ఫోరం(ఎపిక్) ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, న్యాయవాదులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు. బెయిల్ మంజూరు విషయంలో జాతీయ స్థాయిలో చర్చ జరగాలని, కోర్టు నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో ఓ వర్గం పెత్తందారి, నియంతృత్వ పోకడలకు పోతోందని, కోర్టులను, న్యాయమూర్తులపైనా ఆరోపణలు చేస్తోందన్నారు. చంద్రబాబు కేసులో తాము చెప్పినట్టుగా తీర్పు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగిన తీరు ఇటీవల కోర్టులో చూశామన్నారు. తీవ్ర నేరాలు చేసిన చంద్రబాబు, రామోజీరావులు తాము చట్టాలకతీతమన్నట్టుగా వ్యవహరిస్తూ.. వాటి నుంచి తప్పించుకునేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

బాబు కోర్టునే ఆదేశిస్తున్నారు

తన రాజకీయ జీవితంలో కోర్టులను చంద్రబాబు మాత్రమే మేనేజ్ చేసినట్టు అనేక సందర్భాల్లో రుజువైంది. న్యాయస్థానాలు చట్ట ప్రకారం పనిచేస్తుంటే మాత్రం దుష్ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు తీవ్రమైన ఆర్థిక నేరం కేసులో జైలుకు వెళితే.. తాము చెప్పినట్టు తీర్పు ఇవ్వలేదని ఆయన వర్గం వారు న్యాయమూర్తులపైనా తీవ్రమైన ఆరోపణలు చేశారు. చివరికి బెయిల్ రాకపోయేసరికి 'అనారోగ్యం'సాకుగా చూపారు. కోర్టు కండిషన్లు పెట్టి బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి బయటికొచ్చాక ఆస్పత్రికో, ఇంటికో వెళ్లాల్సి చంద్రబాబు.. 14 గంటల పాటు ర్యాలీ చేశారు. ప్రసంగాలు చేశారు. ఇది పూర్తిగా బెయిల్ నిబంధనలు ఉల్లంఘించడమే. కోర్టు చెప్పిన దానికి పూర్తి వ్యతిరేకంగా చంద్రబాబు వ్యవహరించినందున బెయిల్‌ను రద్దు చేయాలి.

– విజయ్‌బాబు, ఎపిక్ ఫోరం వ్యవస్థాపకుడు

బెయిల్ నిబంధనలపై చర్చ అవసరం

దేశంలో రూల్ ఆఫ్ లా సరిగా అమలు కావడం లేదు. ఏదైనా కేసులో అండర్ ట్రైల్ కింద జైలుకు వెళ్లిన వారు బెయిల్ కోసం అప్లై చేసుకోవడం వారి హక్కు. కానీ ఇక్కడ అందరికీ ఈ హక్కు లభించడం లేదు. వ్యవస్థలను మేనేజ్ చేసుకునే వారికి, ఆర్థికంగా శక్తిమంతమైన వారికి సులభంగా బెయిల్ వచ్చేస్తోంది. కానీ చాలామంది సామాన్యులు అండర్ ట్రైల్‌లోనే ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతున్నారు. బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేయాలి. ప్రభుత్వంలో ఉండి ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి బెయిల్ ఇవ్వకూడదు. ముఖ్యంగా వైద్యం కోసం బెయిల్‌కు దరఖాస్తు చేసునేటప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వ వైద్యుల అభిప్రాయం తీసుకునేలా నిబంధనలు పెట్టాలి.

– కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఇది పూర్తిగా న్యాయ ధిక్కరణే

చంద్రబాబు కేసులో దాదాపు 53 రోజులు దేశంలో ప్రముఖ న్యాయవాదులు కేసును వాదించారు. చివరికి 'వైద్యం'పేరుతో అబద్ధం చెప్పి బెయిల్ తీసుకుని రాజకీయ ర్యాలీలు, ప్రసంగాలు చేశారు. ఇది పూర్తిగా న్యాయ ధిక్కరణ. ఆయన బెయిల్ రద్దు చేయాలి. లేకుంటే తప్పు చేసిన ప్రతి ఒక్కరూ ఇలాగే బయటకొచ్చే అవకాశం ఉంది.

– పిల్లా రవి, న్యాయవాది

రాష్ట్రీయం

జనసేనకు బీజేపీ 8 సీట్లు కేటాయింపు
వాటిలో 6 ఖరారు... 2 పెండింగ్‌లో..

సాక్షి, హైదరాబాద్: జనసేనతో పొత్తు, ఉమ్మడి పోటీలో భాగంగా ఆ పార్టీకి ఎనిమిది సీట్లు కేటాయించేందుకు అంగీకారం కుదిరినట్టు బీజేపీ వర్గాల ద్వారా తెలుస్తోంది. వీటిలో ఆరు సీట్లపై ఏకాభిప్రాయం కుదరడంతో... జనసేనకు కూకట్‌పల్లి, కొత్తగూడెం, ఖమ్మం, వైరా, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్ స్థానాలను కేటాయించినట్టు విశ్వసనీయ సమాచారం. పెండింగ్‌లో పడిన సీట్లలో శేరిలింగంపల్లి, తాండూరు, నాంపల్లి, ఖమ్మం జిల్లాలో ఒక సీటు ఉన్నట్లు తెలిసింది. శేరిలింగంపల్లి సీటు ఇవ్వలేని పక్షంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మరోసీటును ఇవ్వాలని జనసేన డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 7న ఎల్బీ స్టేడియంలో ప్రధాని మోదీ బీసీ గర్జన సభలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పాల్గొంటారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ, జనసేన అభ్యర్థుల తరఫున ఆయన ప్రచారం నిర్వహిస్తారని పార్టీ నాయకులు చెబుతున్నారు. జనసేనకు కేటాయించే సీట్లపై రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్‌తో పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ చర్చలు జరిపారు. ఈ భేటీలో ఆ పార్టీకి కేటాయించే సీట్లపై స్పష్టత వచ్చినట్టుగా పార్టీ వర్గాల సమాచారం.

కేసీఆర్ కుటుంబ ఆస్తులు జప్తు చేస్తాం

ఎంపీ బండి సంజయ్
- కమీషన్ల సొమ్మునంతా వసూలు చేస్తాం
- రేవంత్‌రెడ్డిని చూస్తే జాలేస్తోంది
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను బంగాళాఖాతంలో కలిపేయాలి




విలేకరులతో మాట్లాడుతున్న సంజయ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ కుటుంబ ఆస్తులు జప్తు చేస్తామని ప్రకటించారు. కమీషన్ల పేరుతో దోచుకున్న సొమ్మునంతా వసూలు చేస్తామన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిన విషయంపై వాస్తవ నివేదిక ఇచ్చిన కేంద్ర బృందంపై అవాకులు చవాకులు పేలుతున్నారని మంత్రి కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. ''డేట్, టైం ఫిక్స్ చేయ్.. ఇరిగేషన్ నిపుణులతో కలసి మేడిగడ్డకు వస్తా.. వాస్తవమని నిరూపిస్తా''అంటూ సవాల్ విసిరారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని చూస్తే జాలేస్తోందని అన్నారు. రేవంత్‌రెడ్డిని సీఎం కానీయొద్దని ముస్లిం పెద్దలంతా వెళ్లి రాహుల్ గాంధీని కలిశారని, అందుకు ఆయన సైతం అంగీకరించినట్లు తనకు సమాచారం ఉందని చెప్పారు. సోమవారం కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు తెలిపిన బండి సంజయ్, తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఆదివారం మధ్యాహ్నం ఎస్సారార్ కళాశాల వద్దకు వచ్చిన బండి సంజయ్ వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులను కలిశారు. వాలీబాల్ పోటీల్లో గెలిచిన ఆటగాళ్లకు బండి సంజయ్ చేతుల మీదుగా నిర్వాహకులు కప్‌ను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 7న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీల ఆత్మగౌరవ సభకు ప్రధాని మోదీ హాజరవుతున్నారని చెప్పారు. ఈ సభకు ప్రజలంతా తరలిరావాలని కోరారు. బీసీని సీఎంగా చేస్తామని బీజేపీ ప్రకటిస్తే కూడా మద్దతు తెలపకుండా కొందరు విమర్శించడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు. 'బీజేపీలో సీఎం ఎవరనే అంశాన్ని మేం ప్రకటించబోం, ప్రజాస్వామ్యబద్ధంగా సీఎంను ఎన్నుకుంటాం. బండి సంజయ్ సీఎం అయ్యే అవకాశాలున్నాయని కర్ణాటక ఎమ్మెల్యే మనప్ప చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం. నేను మాత్రం హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటా' అని ఆయన అన్నారు.

వేలంపాటలా ఉచిత పథకాలు ప్రకటిస్తున్నారు..

బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు వేలం పాట మాదిరిగా పోటీ పడి ఉచిత పథకాలు ప్రకటిస్తున్నాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. ఎన్నికల నేపథ్యంలో ఇష్టానుసారం నాలుకకు నరం లేనట్లుగా హామీలు గుప్పిస్తున్నాయని మండిపడ్డారు. కర్ణాటకలో ఆరు నెలల్లోనే కాంగ్రెస్ హామీలపై చేతులెత్తేసిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించాలని కోరారు. ఆదివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ఈ రెండు పార్టీల హామీలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోవద్దని విజ్ఞప్తిచేశారు. ఉచిత పథకాలతో తీరని నష్టం జరుగుతుందని, కూర్చొని తింటే కొండలు అయినా కరిగిపోతాయన్నారు. ప్రస్తుతం అక్కడ సంక్షేమ పథకాల అమల్లో ఆంక్షలు పెడుతున్నారని లక్ష్మణ్ తెలిపారు. ఉచిత హామీలతో మోసపోయామని కర్ణాటక ప్రజలు గుర్తించారని, బీజేపీ ప్రభుత్వమే మేలు అనే అభిప్రాయానికి వచ్చేశారని చెప్పారు. ఎన్డీయేలో జనసేన భాగస్వామి అని, తెలంగాణలో ఆ పార్టీతో బీజేపీ పొత్తు ఖరారైందని వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో పవన్‌కల్యాణ్ పాల్గొంటారని, ఏపీ, తెలంగాణలో జనసేనతో బీజేపీ కలిసి ముందుకెళ్తుందన్నారు.

ఊపిరున్నంత వరకు బీజేపీలోనే..

జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారుతున్నట్లు కొన్ని వార్తా పత్రికలు, మీడియా చానళ్లు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. బీజేపీ నుంచి వలసలను ప్రోత్సహించాలని కాంగ్రెస్ నాయకులు కొన్ని ప్రసార మాధ్యమాల ద్వారా ఈ పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. తన నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారంలో పాల్గొంటున్న విషయం కొన్ని పత్రికలు, చానళ్లకు కనిపించడం లేదా? అని అరుణ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, ఊపిరి ఉన్నంత వరకు బీజేపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ విషయమై మరోసారి మీడియా తమ ఇష్టానుసారంగా ప్రచారాలు చేస్తే న్యాయ విచారణకు సిద్ధంగా ఉండాలని ఆమె హెచ్చరించారు.

కూతురు ముందే పిస్టల్‌తో కాల్చుకుని..

- ఏఆర్ ఎస్సై ఫజల్ అలీ ఆత్మహత్య
- మృతుడు మంత్రి సబితా ఇంద్రారెడ్డి వద్ద ఎస్కార్ట్ ఆఫీసర్
- ఆర్థిక ఇబ్బందులే కారణమని ప్రాథమిక నిర్ధారణ



ఘటనా స్థలంలో డీసీపీ జోయల్ డేవిస్... ఇన్‌సెట్‌లో మహ్మద్ ఫజల్ అలీ

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: 'గోలీ కొట్టుకుంటా'.. అంటూ రెండుమూడు రోజులుగా సన్నిహితుల వద్ద చెపుతున్న రాచకొండ ఏఆర్ ఎస్సై మహ్మద్ ఫజల్ అలీ (59) పిస్టల్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎస్కార్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అలీ, తన చిన్న కుమార్తెతో కలసి ఆదివారం ఉదయం డ్యూటీలో చేరడానికి వచ్చి, ఆమె సమక్షంలోనే ఉసురు తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఆర్థిక కారణాల నేపథ్యంలో అలీ సూసైడ్ చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. హుస్సేనీఆలం ప్రాంతానికి చెందిన ఫజల్ అలీ రాచకొండ కమిషనరేట్‌లో ఏఆర్ ఎస్సైగా పని చేస్తున్నారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసినా.. భర్తలతో విడాకులు తీసుకున్న వీళ్ల ప్రస్తుతం పుట్టింట్లోనే ఉంటున్నారు. డిగ్రీ పూర్తి చేసిన కుమారుడు ఓ దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. చిన్న కుమార్తె వివాహం చేయాలని భావించిన అలీ.. అందుకోసం బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.10 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయనకు కేవలం రెండేళ్లు మాత్రమే సర్వీసు ఉండటంతో బ్యాంకు అధికారులు రుణ దరఖాస్తును తిరస్కరించారు. రెండు వారాల క్రితం బ్యాంకు అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగిన ఫజల్ అలీ, రుణం ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించారు.

నోట్ బుక్‌లో రాసుకుని..

ఈ క్రమంలో రెండుమూడు రోజులుగా తన సన్నిహితులు, సహోద్యోగుల వద్ద ఆర్థిక ఇబ్బందులు, రుణం సమస్య గురించి చెప్పుకుంటున్న ఫజల్ అలీ నిరాశతో 'గోలీ కొట్టుకుంటా'అంటూ వాపోయారు. ఓ నోట్ బుక్‌లోనూ తన ఆర్థిక పరిస్థితుల విషయం రాసి ఆ పేజీని తన వెంట ఉంచుకున్నారు. ఆదివారం ఉదయం చిన్న కుమార్తె ఫాతిమాను తీసుకొని శ్రీనగర్ కాలనీలోని మంత్రి ఇంటి వద్దకు డ్యూటీ కోసం వచ్చారు. ముందుగా ఆ సమీపంలో ఒక హోటల్ వద్ద కూతురిని దించి మంత్రి ఇంటికి వెళ్లారు. డ్యూటీ ఎక్కిన తర్వాత తన సర్వీస్ పిస్టల్ (9 ఎంఎం క్యాలిబర్) తీసుకొని కుమార్తె ఉన్న చోటుకి వచ్చారు. వీడియో తీయాల్సిందిగా కుమార్తెకు చెప్పి తన సెల్‌ఫోన్ ఇచ్చారు. కొన్ని మాటలు నవ్వుతూ చెప్పిన అలీ, ఆపై ఫోన్ తీసుకుని, ఆమెను వెళ్లమని చెప్పారు. కుమార్తె వెనక్కు తిరిగిన వెంటనే ఫోన్ జేబులో పెట్టుకుని పిస్టల్‌తో తలపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చుకున్నారు. కుడి చెవిపై నుంచి దూసుకుపోయిన తూటా ఎడమ వైపు నుంచి బయటకు వచ్చేసింది. ఆర్థిక ఇబ్బందులతోనే ఫజల్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అలీ కుటుంబీకులకు అప్పగించారు. కాగా, ఫజల్ అలీ తండ్రి ఇబ్రహీం అలీ కూడా గతంలో హైదరాబాద్‌లో ఏఆర్ ఎస్‌ఐగా పని చేశారు. ఆయన కూడా ఇలాగే కుటుంబ, ఆర్థిక సమస్యల కారణంతో 1986లో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్‌ఐ ఫజల్ మృతి పట్ల మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫజల్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ వస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే!

▶ మొదటి పేజీ తరువాయి

నాయకత్వం ఆదేశించిందన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సరైన తీర్పు ఇవ్వాలి

కాంగ్రెస్ ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు, బీఆర్‌ఎస్‌కు వేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టే. ఈ రెండింటికి వేస్తే ఎంఐఎంకు వేసినట్టే. కేసీఆర్ అవినీతి, నయా రాచరిక పాలనతో ఒక కుటుంబం చేతిలో రాష్ట్రం బందీ అయింది. దేశంలోని అన్ని సమస్యలకు, దోపిడీ, అవినీతి రాజకీయాలకు కారణమైన కాంగ్రెస్.. తెలంగాణలో గ్యారంటీలు నెరవేర్చుతామంటే ఎలా నమ్ముతారు? ప్రజలు ప్రలోభాలకు గురికావద్దు. ఓటు ఆయుధంతో సరైన తీర్పు ఇవ్వాలి.

నేరం చేసినవారు జైలుకు వెళ్లాల్సిందే..

ఎమ్మెల్సీ కవిత అరెస్టో, సోనియాగాంధీ అరెస్టో.. ఏదైనా విచారణ సంస్థల బాధ్యత. అది బీజేపీకి సంబంధం లేని అంశం. తప్పు జరిగిన చోట ఆధారాలతో వ్యవస్థ ముందుకెళ్తుంది. నేరం చేసిన వారెవరైనా జైలుకెళ్లాల్సిందే. కాళేశ్వరంగానీ మరే పథకంలోగానీ అవినీతి జరిగిందని భావిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కోరితేనో లేదా హైకోర్టు, సుప్రీంకోర్టులు ఆదేశిస్తేనో సీబీఐ విచారణకు అవకాశం ఉంటుంది. తమ అనుమతి లేకుండా సీబీఐ రాకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు ఇస్తుండటమే దీనికి కారణం. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోసం మధ్యాహ్నం 2గంటలకు కేసీఆర్ సంతకం పెడితే.. 4 గంటలకల్లా సీబీఐ టీమ్‌ను సిద్ధం చేయించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది.

కేసీఆర్ వద్ద అంత డబ్బు ఎక్కడిది?

తానే ఓ సూపర్ ఇంజనీర్ అన్నట్టుగా కేసీఆర్ నిపుణుల సూచనలను కాదని కట్టడంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. 30వేల కోట్ల ఈ ప్రాజెక్టు అంచనా లను రూ.1.30 లక్షల కోట్లకు పెంచి.. వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తన నాయకత్వాన్ని అంగీకరిస్తే అన్ని రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చును భరిస్తానని కేసీఆర్ చెప్పినట్టు ఒక సీనియర్ రిపోర్టర్ వెల్లడించారు. అంత పెద్ద ఎత్తున తెలంగాణ ప్రజల డబ్బు ఒక సీఎం చేతుల్లో ఉందంటే పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చు.

బీసీలంతా కలసి గెలిపించుకుంటారు

తెలంగాణలో బీసీలకు రాజ్యాధికార సాధన లక్ష్యంతోనే మేం పనిచేస్తున్నాం. దేశంలో మొదటిసారిగా బీసీ నేతను సీఎం చేస్తామని ప్రకటించాం. రాష్ట్ర జనాభాలో 55శాతం ఉన్న బీసీలు తమ వాడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటే.. వాళ్లే గెలిపించుకుంటారు. ఈ విషయంలో ఎవరి ప్రభావం పనిచేయదు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీలను అవహేళన చేస్తున్నాయి. జనసేన ఎన్డీయే భాగస్వామ్య పార్టీ. పొత్తుధర్మంగా వారిని కలుపుకొని ముందుకెళ్తాం.

కేసీఆర్ ఓటమి ఖాయం

తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలి, తన కొడుకును సీఎం చేయాలన్న ఆలోచనే తప్ప ప్రజల బాగోగులను కేసీఆర్ పూర్తిగా విస్మరించారు. తనతోనే తెలంగాణ వచ్చినట్టు కేసీఆర్ గొప్పలు చెప్పుంటారు. బీజేపీ ఎంపీల మద్దతు లేకుండా ప్రత్యేక రాష్ట్రంఏర్పడేదా? ఉద్యమాలతో అధికారంలోకి వచ్చి.. మరెవరూ ఉద్యమాలు చేయకుండా, తమ గోడు చెప్పుకొనే అవకాశం లేకుండా గొంతు నొక్కేస్తున్నారు. ఈ తీరుపై ప్రజలు విసిగిపోయారు. వచ్చే ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి రెండుచోట్లా కేసీఆర్ ఓటమి ఖాయం. కేసీఆర్ హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చుచేసి విఫలమయ్యారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే తరహా తీర్పు రిపీట్ కాబోతోంది.

వ్యక్తిగత అవసరాల కోసమే వీడుతున్నారు

పార్టీని వీడేవారు వ్యక్తిగత అవసరాల కోసం వెళ్తున్నారు. అయినా ఏం ఇబ్బంది లేదు. ప్రజలు మాతోనే ఉన్నారు. నామినేషన్ల విత్‌డ్రా తర్వాత మేనిఫెస్టో విడుదల చేయడం మా సంప్రదాయం. ఇప్పటికే అందరితో మాట్లాడి సలహాలు తీసుకున్నాం. ఏం చెబుతామో అది చేసి చూపిస్తాం.

ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మారుస్తాం

అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుంది. దుబారా తగ్గించి, అవినీతిని పూర్తిగా అరికడుతుంది. కేసీఆర్ కుటుంబభవన్‌గా మారిన ప్రగతిభవన్‌ను ప్రజా ప్రగతి భవన్‌గా మారుస్తాం. ప్రజలకు అందుబాటులో ఉండే సీఎంను తీసుకొస్తాం. డబుల్ ఇంజన్ సర్కారు వస్తే ఎలాంటి అభివృద్ధి జరుగుతుందో చూపిస్తాం. అవినీతి రహిత వ్యవస్థను నిర్మిస్తాం. ఉద్యోగ నియామకాల కోసం జాబ్ క్యాలెండర్ ఇస్తాం.

మంచిమాట



స్వభావం

"బట్టతలకి స్వభావానికి మందు లేదు." అన్న మాట అందరికీ తెలిసినదే. స్వభావం అంటే ఏమిటి? 'స్వ' అంటే తన యొక్క 'భావం' అంటే సహజ లక్షణం, లేదా సహజ గుణం. 'సహ' అంటే కలిసి 'జ' అంటే పుట్టి నది. అంటే, ఒక వ్యక్తితో పాటు పుట్టేది అని అర్థం.

ఒక గురువుగారు శిష్యులతో కలిసి ప్రయాణం చేస్తున్నారు. దారిలో ఒక ఏరు దాటవలసి వచ్చింది. ప్రవాహం మధ్యలో ఒక తేలు నీటిలో కొట్టుకు పోతూ కనిపించింది. ఒక ఆకు మీద దానిని ఎక్కించారు. పట్టు కోగానే అది కుట్టింది. బాధగా వేలిని రుద్దుకున్నారు. కొద్దిసేప టికి అది మళ్ళీ నీళ్ళలో పడిపోయింది. తిరిగి అదే పని చేశారు. అది కూడా తన పని తాను చేసింది. చేతిని గట్టిగా విదిలిం చారు. మూడోసారి మళ్ళీ నీళ్ళలో పడిపోయింది. ఈలోపు గట్టు వచ్చింది. తేలుని పట్టు కుని నేల మీద వదిలారు. మళ్ళీ ముద్దు పెట్టుకుంది. ఒక శిష్యుడికి సందేహం కలిగింది. గురువుగారు మేధావి కదా! ఇంత తెలివి తక్కువగా ఎందుకు ప్రవ ర్తించారు? అని. "రెండు మార్లు కుట్టినా మూడో మారు కూడా ఎందుకు కాపాడారు?" అని అడి గాడు. "కుట్టటం దాని స్వభావం. దానిని తేలు మార్చుకోలేదు. కాపా డటం అనే నా స్వభావాన్ని నేను ఎందుకు మార్చుకో వాలి?" అని సమాధానం చెప్పారు.

స్వభావం అంటే తన యొక్క, 'భావం' తత్త్వం. తనతనం. అది పుట్టుకతో వస్తుంది. "పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోనే" అనే సామెత తెలుసు కదా! అంటే మారదు అని అర్థం. దీనిని వంకగా పెట్టుకుని తమలో ఉన్న చెడు స్వభావాన్ని మార్చుకునే ప్రయత్నం చేయరు చాలా మంది. ఇదే మనిషి పురోభివృద్ధిని నిర్ణయించే ప్రధాన అంశం. సుమారుగా అందరికీ చాలా విషయాలు తెలుసు. ఏది మంచి ఏది చెడు అన్నదీ తెలుసు. తెలిసిన దానిని ఎంత వరకు ఆచ రణలో పెట్టారు? అన్న దాని వల్ల పురోభి వృద్ధిలో వ్యత్యాసం వస్తుంది. దానికి కారణం స్వభావం.

> మంచి పనులు చేయటం ద్వారా మంచి స్వభావాన్ని పెంపొందించుకోవచ్చు. కనీసం మంచికి, మందికి ఉపయోగ పడ వచ్చు. ఉదాహరణకి దేనిని చూసినా సొంతం చేసుకోవాలనే గుణం ఉంది అనుకుందాం. తప్పు అని తెలిసినా మనసు అదుపులో ఉండదు. అటువంటి వారిలో దొంగతనం అనే రోగం పోగొట్టటం ఎట్లా? వారి చేత ఇతరులకి ఇప్పిస్తూ ఉండాలి. అది తనదే కానక్కర లేదు. తీసుకున్న వారి ముఖంలో కనపడే ఆనందం చూసి 'సెరిటోనిన్' అనే హార్మోను విడుదల అయి వారికి ఆనందం కలిగిస్తుంది. అప్పుడు ఇతరుల వస్తువులని తీసుకోవాలనే స్వభావం క్రమక్రమంగా దూరమవుతుంది. కనీసం ఆలోచన ఆచరణ రూపం ధరించదు.

స్వభావం సరిదిద్దుకో వలసినది అయితే చాలా ప్రయత్నం చేయ వలసి ఉంటుంది. ముందుగా మార్చుకోవాలి అనే సంకల్పం ఉండాలి. క్రమంగా, నిలకడగా ప్రయత్నం చేయాలి.

మూతిని కట్టేసినా మాట్లాడకుండా ఉండ లేని వారి చేత పాఠాలని చదివించిన ఉపాధ్యా యులని చూశాం. పెరిగాక వారిని యాంక ర్లుగా చేస్తే సరి. పాఠం చదవటం వల్ల ఉచ్చా రణ స్పష్టంగా ఉంటుంది. ఆగకుండా మాట్లాడి మంచి పేరు తెచ్చుకుంటారు. స్వభావాన్ని అనుకూలంగా ఉపయోగించు కునే మార్గం ఇది. అదేవిధంగా అబద్ధాలు ఆడే పిల్లవాడు ఉంటే, వాడి చేత కథలు రాయిస్తే వాడి సృజనాత్మకత అంతా అక్కడ చూపించటం జరుగుతుంది. నోరు విప్పని వారు ఉంటారు కొందరు. వారు రహస్యసమాచార శాఖలలో రాణి స్తారు. వ్యక్తి స్వభావాన్ని అనుసరించి తగినమా ర్గంలో పెడితే ఉన్నతస్థితికి చేరుకుంటారు. ఏదీ పనికి రానిది అని చెప్పటానికి వీలు లేదు. 'స్వభావో దురతిక్రమః'' మారదు కనుక మలచుకోవచ్చు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

వాగ్గేయకార వైభవం

గింజనే చూస్తే.... గింజవయిపోతావు

'వాగురయని తెలియక మగ గణములు వచ్చి తగులురీతి యున్నది..'' వాగుర అంటే వల. వల వేసేవాడు వల ఒక్కటే వేయడు. కింద గింజలు వేసి వలేస్తాడు. ఆకలిమీద ఉన్న ప్రాణి కిందున్న గింజలనే చూస్తుంది. రివ్వున వచ్చి వలలో చిక్కుకుని తినేవాడికి అదే గింజయి పోతుంది. తన ఆహారం కోసం వెళ్ళి వేరొకడికి ఆహారమయి పోతుంది. తాను ఏది పొందడానికి వచ్చాడో అది పొందకపోగా వేరొక దానిచేత దానిని పొంద బడుతున్నాడు. కారణం – మత్సరం.

అప్పటికి నా అంతటి వాడు లేడు.. అని అహంకరించడం. మరొక డిని తక్కువ చేయడం, హేళన చేస్తూ తనను తాను గొప్పవాడిగా భావించుకోవడంలో ఒక చిన్న సంతోషం ఉంది. కానీ నిజానికి అది పతనం చేసే సంతోషం. మృగ గణ ములు వచ్చి తగులుకున్న రీతిగా నాకు హెచ్చరిక అందట్లేదు. అదే నాకు అప్పటికి సుఖకారణమనిపించి వలకు చిక్కినట్టు నన్ను కట్టిపడేస్తు న్నదంటున్నాడు త్యాగయ్య. ఒకసారి పక్షులన్నీ వలలో చిక్కుకుపోయి ఉంటే... అటునుంచి ఒక రుషి వెళ్ళిపోతున్నాడు. రక్షిం చమని అవి వేడుకున్నాయి. విడిపిస్తాగానీ నేనొక మాట చెబుతా వింటారా...అనడి గితే సరే అన్నాయి. "గిం జలు కనబడగానే వాల రాదు". ఇది బాగా గుర్తుపె ట్టుకుంటే మీకు మళ్ళీ ఇలాటి ఆపద రాదని చెప్పి ఆయన వెళ్ళి పోయాడు. మరో పది రోజుల తరువాత ఆయన మళ్ళీ అటుగా వస్తుంటే...మళ్ళీ అవే పక్షులు వలలో చిక్కుకుని 'రక్షించమని వేడుకు న్నాయి. నా మాట మీరెందుకు విన లేదని ఆయన అడిగాడు. వినకపోవ డమేమిటి... మీరు చెప్పినట్లే కదా చేసాం... అన్నాయి...అంటూ 'గిం జలు కనబడగానే వాలరా దు' అందుకే వెంటనే వాలలేదు కదా... అన్నాయి... అలాగే వాగ్గేయకారుల కీర్తనలు ఎన్నిసార్లు పాడుకున్నాం, ఎన్నిసార్లు విన్నాం, ఎన్నిసార్లు చదివాం ... అని కాదు. అది అర్థం కావాలి. అర్థమయితే సుఖం. ఎంత బాగా పాడావు అన్నదానికన్నా... దానిలోని తత్త్వాన్ని ఎంత బాగా అర్థం చేసుకున్నావన్నది కదా ముఖ్యం. తత్త్వం అర్థమయితే అరిషడ్వర్గాలు గురువుగారి అనుగ్రహం వల్ల వెంటనే పోయినట్టే కదా! అప్పుడు ఆయన సద్గురువు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



అందుకే కీర్తన చివరన మదమత్సరమను తెరదీ యగరాదా... అన్నాడు. ఎక్కడ మత్సరం ఉంటుందో అక్కడ మదం కూడా ఉంటుంది. అది నాకు కదా దక్కాలి... అన్నప్పుడు కామం ఉంది. వాడికే ఎందుకు దక్కాలి ... అన్న ప్పుడు క్రోధం ఉంది. నాకు ఉండాలన్నప్పుడు లోభం ఉంది. దీనికంతా కారణ అజ్ఞానం అన్నప్పుడు మోహం ఉంది. అరి షడ్వర్గాలు అక్కడ పుట్టాయి. అందు వల్ల తెర అంత దట్టంగా ఉంది.'నీలో మత్సరమను తెర ఉంది. అది తొలగించు కో' అని ఆయన అన లేదు. తన మీద పెట్టుకు న్నాడు. శంకరభగవత్పా దులు రాసిన శ్లోకాల్లో నాకు అంటూంటారు. అంటే ఆయనకు కాదు. ఆ శ్లోకం ఎవరు చదువుతుంటే వాళ్ళకు–అని. వాళ్ళకు దైవాను గ్రహం కలగాలి. అలాగే త్యాగరాజస్వామి తనకు అన్వయం చేసుకుని చెప్పారు. మత్సరం ... మద మత్సరం... అసూయ వినాశ హేతువు. ఆ తెర తీయమంటున్నాడు.

బౌద్ధవాణి

ప్రేమతో గెలవాలి

బుద్ధుని కాలంలో నిగంఠనాథ పుత్రుడు అనే సాధుగురువు ఉండే వాడు. అతనికి చాలా మంది శిష్యులు ఉండే వారు. వారిలో దీర్ఘ తపస్వి అనే సాధువు ఒకడు. మనస్సు, వాక్కు, శరీరం అనే మూడింటిలో శరీరమే ప్రధానం అనేది నిగంఠుని సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని దీర్ఘ తపస్వి చాలా బలీ యంగా ప్రచారం చేసేవాడు. దానితో నిగంఠుని శిష్యుల్లో శ్రేష్ఠుడయ్యాడు. ఈ దీర్ఘ తపస్వికి ఉపాలి అనే గృహస్తు మంచి అనుయాయి. ఉపాలి మంచి జ్ఞాని, ధనవంతుడు నిఘంటుని సాధు సంఘాన్ని అతనే పోషించేవాడు. అదే సమయంలో...

బుద్ధుడు తన బౌద్ధ సంఘంతో నలం దకు వచ్చాడు. శరీరం, మనస్సు, వాక్కుల్లో బుద్ధుడు మనస్సుకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు. మనిషి చేసే కర్మలన్నింటికీ మనో కర్మే మూలం. మనసే అన్ని కర్మల్ని నడిపిస్తుంది అనేది బుద్ధుని సిద్ధాంతం. ఈ విషయం తెలిసి దీర్ఘ తాపసి కోపంతో... "నేను ఇప్పుడే వెళ్ళి, ఆ గౌతముణ్ణి వాదంలో ఓడించి వస్తాను'' అని మండిప డ్డాడు. అప్పుడు ఉపాలి "గురు వర్యా! ఈ మాత్రం దానికి తమరెందుకు! నేను చాలు. బలమైన ఏనుగు నీటి తటాకంలో దిగి, ఆ నీటిని చెల్లా చెదురు చేసినట్లు గౌతముణ్ణి నా వాదంతో చెల్లా చెదురు చేసి వస్తాను'' అని బయ లుదేరాడు. బుద్ధుని దగ్గ రకు వెళ్ళాడు. వాదానికి దిగాడు. అతి కొద్ది సేప టికే వాదం ముగిసింది. ఉపాలి చివరికి అన్నిం టికీ మనస్సే ముఖ్యం. మనసే మూలం అని అంగీకరించాడు.



ఒక వ్యక్తి తనని కర్రతో కొట్టితే... తాను ఇంత కాలం ఆ నేరం "కొట్టిన కర్రది" అనుకున్నానని గ్రహించాడు. ఆ తప్పు కొట్టిన చేతిది కూడా కాదు. ఆ వ్యక్తి హింసా ప్రవృత్తే కారణం అని తెలుసుకున్నాడు. ఆ ప్రవృత్తి కేంద్రం మనస్సే అనే సత్యాన్ని నిర్ధారించుకున్నాడు.

తాను ఇంతకాలం.. ఆ కర్రను పట్టుకుని వేలాడుతూ ఉన్నానని'' గ్రహించాక, వెంటనే, బుద్ధునికి ప్రణమిల్లాడు. సముద్రం లోతులు చూడాలని, సముద్రంలో దిగిన ఒక ఉప్పు బొమ్మ, తాను కరిగిపోయి, ఆ సముద్రంలో లీన మైపోయినట్లు ఉపాలి మాత్రమే కాదు... ఎందరో బుద్ధుని మానవీయ సిద్ధాంతంలో కరిగి పోయారు. ఆ ధర్మ సాగరంలో బిందువుల య్యారు. ద్వేషం కంటే ప్రేమ గొప్పది. సంకుచి తత్వం కంటే విశాల దృక్పథం గొప్పదని చెప్పిన తథాగత బుద్ధుడు సర్వదా శ్లాఘనీయుడే!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



● నాగార్జున

మైసూర్‌లో నా సామిరంగ

హీరో నాగార్జున కొన్ని రోజులు మైసూర్‌కు మకాం మార్చారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున హీరోగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'నా సామిరంగ'. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ మైసూర్‌లో ప్రారంభమైందని సమాచారం. నాగార్జున, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణ ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో 'అల్లరి' నరేశ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని, ఆషికా రంగనాథన్, మిర్నా మీనన్ హీరోయిన్స్‌గా యాక్ట్ చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది.



● కార్తికేయన్, ఎస్‌జే సూర్య, వెంకటేశ్, రాఘవ లారెన్స్, కార్తీక్ సుబ్బరాజ్


ట్రైలర్ అదిరిపోయింది

– వెంకటేశ్

"జిగర్ తండ డబుల్ ఎక్స్' సినిమా ట్రైలర్ అదిరిపోయింది. కార్తీక్ సుబ్బరాజ్ టేకింగ్ ఎలా ఉంటుందో మరోసారి ఈ ట్రైలర్‌తో చూపించాడు. సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుందనే గట్టి నమ్మకం ఉంది'' అని హీరో వెంకటేశ్ అన్నారు. రాఘవ లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ నెల 10న విడుదల అవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ–"లారెన్స్, ఎస్‌జే సూర్య వంటి ప్రతిభ ఉన్న నటులు ఈ సినిమాలో నటించారు. కార్తీక్ సుబ్బరాజ్ కల్ట్ డైరెక్టర్. నాకోసం తను త్వరలోనే ఓ స్క్రిప్ట్ తయారు చేస్తాడనుకుంటున్నాను'' అన్నారు. రాఘవ లారెన్స్ మాట్లాడుతూ–"తమిళనాడులో నేను ట్రస్ట్ పెట్టి సేవలు చేస్తున్నాను. ఇకపై తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆ ట్రస్ట్ సేవలు అందించబోతున్నాను'' అన్నారు. "అందరూ మా సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారు'' అన్నారు ఎస్‌జే సూర్య. "మా చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అని కార్తికేయన్ సంతానం అన్నారు. "జిగర్ తండ డబుల్ ఎక్స్' నాకు ఎంతో ప్రత్యేకం. నాలుగున్నరేళ్ల తర్వాత థియేటర్స్‌లోకి విడుదలవుతున్న నా సినిమా ఇది'' అన్నారు కార్తీక్ సుబ్బరాజ్. ఈ వేడుకలో సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, డైరెక్టర్ శైలేష్ కొలను, నటుడు నవీన్ చంద్ర మాట్లాడారు.

మసాలా రెడీ

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని 'దమ్ మసాలా' సాంగ్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ పాట పూర్తి లిరికల్ వీడియోను ఈ నెల 7న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. జగపతిబాబు, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది.



● మహేశ్‌బాబు

ఒక టికెట్‌తో ఇద్దరు సినిమా చూడొచ్చు

– రక్షిత్ అట్లూరి

"నరకాసుర' సినిమాతో నటుడిగా నేను మరో మెట్టు ఎక్కానని ప్రేక్షకులు, సినీ విమర్శకులు చెబుతుండటం చాలా సంతోషాన్నిస్తోంది. మా చిత్రం ఇంకా మరింతమందికి చేరువ కావాలని, నేటి నుంచి మా సినిమాను ఒక టికెట్‌పై ఇద్దరు చూసేలా అవకాశం కల్పిస్తున్నాం'' అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్



● శ్రీనివాస్, రక్షిత్, సెబాస్టియన్

దర్శకుడు. రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్స్‌గా నటించిన సినిమా 'నరకాసుర'. డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ మాట్లాడుతూ–"ట్రాన్స్ జెండర్స్‌ను చిన్న చూపు చూడకూడదు.. మనుషులంతా ఒక్కటే అని 'నరకాసుర' తో మేము ఇచ్చిన సందేశం ప్రేక్షకులకు చేరువవుతోంది'' అన్నారు. "మా సినిమా చూసినవారెవరూ బాగోలేదని చెప్పడం లేదు'' అన్నారు అజ్జా శ్రీనివాస్. "నరకాసుర' ని హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు అపర్ణా జనార్దన్, సంకీర్తన విపిన్.



● సమంత

క్రయోథెరపీ!

హీరోయిన్ సమంత గత కొన్నాళ్లుగా మయోసైటిస్ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఏడాదిపాటు సినిమా లకు దూరంగా ఉంటానంటూ ప్రకటించారు కూడా. ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు ఆమె పలు రకాల వైద్య చికిత్సా పద్ధతులు అనుసరి స్తున్నారు. వైద్య చికిత్సలో భాగంగా తాజాగా క్రయోథెరపీ చేయించుకుంటు న్నారామె. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు సమంత. క్రయోథెరపీలో భాగంగా గడ్డ కట్టేంత చల్లని నీటి టబ్‌లో మెడ భాగం వరకూ మునిగి ఉన్నారు సమంత. "క్రయోథెరపీ వల్ల వ్యాధి కారక క్రిములతో పోరాడే తెల్ల రక్త కణాల సంఖ్య బాగా పెరగడంతో పాటు రక్తప్రసరణ కూడా సక్రమంగా జరుగుతుంది. అదేవిధంగా ఈ థెరపీ శరీరానికి సరికొత్త శక్తిని ఇవ్వడంతో పాటు మానసిక ప్రశాంతత కలిగిస్తుంది'' అని పేర్కొన్నారు. ఇక సమంత సినిమాల విషయానికొస్తే.. రాజ్ –డీకే ద్వయం తెరకెక్కించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో నటించారు. ఈ వెబ్ సిరీస్ కోసం ఆమె అభిమానులు ఎదురు చూస్తున్నారు.

జపాన్ సంతృప్తి ఇచ్చింది

– నిర్మాత ఎస్ఆర్ ప్రభు



"మా డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఒక దానికొకటి భిన్నమైన చిత్రాలను నిర్మిస్తూ ప్రేక్షకుల ఆదరణ పొందడం నిర్మాతగా చాలా ఆనందాన్ని ఇస్తోంది. 'జపాన్' సినిమా పట్ల యూనిట్ అంతా చాలా సంతృప్తిగా ఉన్నాం. సినిమా తప్పకుండా ప్రేక్ష కుల్ని అలరిస్తుంది'' అని నిర్మాత ఎస్ఆర్ ప్రభు అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న విడుదలవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ–"రాజు మురుగన్ ఏదైనా విషయాన్ని నవ్విస్తూనే ఆలోజింపజేసేలా చెబుతారు. 'జపాన్' లో మాన వత్వం గురించి చెప్పారు. ఇందులో కార్తీగారి జపాన్ పాత్ర ప్రేక్షకుల మనసులో చాలా కాలం నిలిచిపోతుంది. నాగార్జునగారు 'జపాన్' టీజర్, ట్రైలర్ చూసి 'ఇలాంటి వైవిధ్య మైన కథలు, పాత్రలు ఎలా చేయగలుగుతున్నావ్' అంటూ కార్తీగారిని అభినందించారు. సినిమా విషయంలో నిర్మాత సుప్రియగారు, మా ఆలోచనలు ఒకేలా ఉంటాయి'' అన్నారు.

చేతిలో చెయ్యేసి...



● అమలాపాల్, జగత్ దేశాయ్

జీవితంలో మరో కొత్త అధ్యాయాన్ని మొదలు పెట్టారు హీరోయిన్ అమలాపాల్. వ్యాపారవేత్త జగత్ దేశాయ్‌తో కలిసి ఆమె వైవాహిక జీవితాన్ని ప్రారంభించారు. స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో జగత్, అమలాపాల్‌ల వివాహం కొచ్చిలోని ఓ హోటల్‌లో జరిగినట్లుగా తెలుస్తోంది. "రెండు ఆత్మలు. ఒక విధి.. జీవితాంతం ఆమె చేతిలో చేయ్యేసి నడుస్తాను. దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' అంటూ తమ పెళ్లికి సంబంధించిన ఫోటోలను జగత్ దేశాయ్ షేర్ చేయగా, అవి వైరల్ అవుతున్నాయి. గత నెలలో(అక్టోబరు) అమలాపాల్‌కు జగత్ దేశాయ్ లవ్‌ని ప్రపోజ్ చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. మరోవైపు దర్శకుడు-నిర్మాత ఏఎల్ విజయ్‌ను తొలి వివాహం చేసుకు న్నారు అమలాపాల్. అయితే ఇద్దరు 2017లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు.

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలో బుధవారం రాత్రి జరిగిన సంగతి తెలిసిందే. ఆదివారం హైదరాబాద్‌లో వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరోలు చిరంజీవి, వెంకటేశ్, దర్శకులు ముత్యాల సుబ్బయ్య, గుణశేఖర్, సుకుమార్, నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్'రాజు, శివలెంక కృష్ణప్ర సాద్, డీవీవీ దానయ్య, రామ్ ఆచంట-గోపీ ఆచంట, వై.రవిశంకర్, నటీనటులు జయసుధ, రాజేంద్ర ప్రసాద్, నాగచై తన్య, అలీ, మాజీ ఎంపీ టి.సుబ్బరామి రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.



● టి.సుబ్బరామిరెడ్డి, వరుణ్‌తేజ్, లావణ్యా త్రిపాఠి

సూర్యవన్షీ సాహసం

బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లో తెర కెక్కుతున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. ఈ చిత్రంలో అజయ్ దేవగన్, రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకొనె, కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ మొదలైందని తెలుస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి అక్షయ్‌కుమార్ లుక్‌ను రిలీజ్ చేసి, వీర్ సూర్యవన్షీ పాత్రలో ఆయన నటిస్తున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. అలాగే రోహిత్ శెట్టి దర్శకత్వంలో అక్షయ్‌కుమార్ హీరోగా నటించిన 'సూర్యవన్షీ' (2021) చిత్రం విడుదలై ఆదివారంతో రెండేళ్లు పూర్తి చేసుకోవ డంతో, 'సింగమ్ ఎగైన్' సినిమాలోని అక్షయ్ లుక్‌ను విడుదల చేసినట్లుగా రోహిత్ శెట్టి పేర్కొన్నారు. ఇందులో అక్షయ్ లుక్ చూస్తుంటే పోలీసాఫీసర్‌గా మరోసారి ఆయన సహసాలు చేయనున్నట్లు తెలుస్తోంది. 'సింగమ్ ఎగైన్' చిత్రం వచ్చే ఏడాది ఆగస్టులో విడుదల కానుంది.



● అక్షయ్ కుమార్

"చాలా బాగా ఆడావు విరాట్. నాకు 49 నుంచి 50 వరకు చేరేందుకు (వయసు) 365 రోజులు పట్టాయి. కానీ నువ్వు రాబోయే కొద్ది రోజుల్లోనే 49 నుంచి 50కి చేరుకొని (సెంచరీలు) నా రికార్డు బద్దలు కొడతావని ఆశిస్తున్నా. నీకు నా అభినందనలు.
-సచిన్ టెండూల్కర్



భారత్ తరఫున ఆడేందుకు వచ్చే ప్రతీ అవకాశం గొప్పదే. నా హీరో రికార్డును సమం చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నా. బ్యాటింగ్‌లో ఆయన అన్ని విధాలా పర్‌ఫెక్షనిస్ట్. నాకు భావోద్వేగ క్షణమిది. ఇంత ఆనందాన్ని ఒకేసారి తట్టుకోవడం కష్టంగా ఉంది. సచిన్ అభినందన ఎంతో ప్రత్యేకం. నేను టీవీలో ఆయనను చూసిన రోజులు, ఆట మొదలు పెట్టిన రోజుల నుంచి చూస్తే ఇప్పుడు స్వయంగా ఆయన ప్రశంసలు అందుకోవడం నా దృష్టిలో అమూల్యం. నా పుట్టిన రోజున శతకం సాధించడం కలగా ఉంది. అభిమానులు దీనిని మరింత ప్రత్యేకంగా మార్చారు. ఇలాంటివి నాకు దక్కినందుకు దేవుడికి కృతజ్ఞతలు."
-విరాట్ కోహ్లి

9 వన్డేల్లో విరాట్ కోహ్లి తొమ్మిది వేర్వేరు దేశాలపై సెంచరీలు సాధించాడు. శ్రీలంకపై అత్యధికంగా 10 సెంచరీలు చేసిన కోహ్లి... వెస్టిండీస్‌పై 9, ఆస్ట్రేలియాపై 8, న్యూజిలాండ్‌పై 5, బంగ్లాదేశ్‌పై 5, దక్షిణాఫ్రికాపై 5, పాకిస్తాన్‌పై 3, ఇంగ్లండ్‌పై 3, జింబాబ్వే పై ఒక సెంచరీ సాధించాడు.

కోహ్లి శతకం... జడేజా మాయాజాలం

భారత్ ప్రతాపం | దక్షిణాఫ్రికా దాసోహం

243 పరుగులతో భారత్ బ్రహ్మాండ విజయం

రోహిత్ జట్టుకు వరుసగా ఎనిమిదో గెలుపు

49వ సెంచరీతో సచిన్ రికార్డును సమం చేసిన కోహ్లి

ఐదు వికెట్లతో మెరిసిన జడేజా

ఈడెన్ గార్డెన్స్ పిచ్ కష్టపెట్టింది. ఆరంభంలో రో'హిట్స్'తో పరుగులు సులువైనా... తర్వాత గగనమైంది. 'రన్ మెషిన్' విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ కనిపెట్టుకొని పరుగులు పేర్చితే జట్టు స్కోరు 300 మార్కు దాటింది. 'బర్త్‌డే బాయ్' విరాట్ సెంచరీ పర్వాన్ని చూపిస్తే... ఆ తర్వాత బౌలర్లు వికెట్ల కూల్చివేతల్లో త్వరపడ్డారు. దీంతో వార్ వన్‌సైడ్ అయిన ఈ మ్యాచ్‌లో భారత్ ఘనవిజయాన్ని నమోదు చేసుకుంది. ఈ టోర్నీలో వరుసగా ఎనిమిదో విజయంతో రోహిత్ శర్మ బృందం మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 16 పాయింట్లతో 'టాప్ ర్యాంక్'ను ఖరారు చేసుకుంది.


జడేజా


బవుమా

కోల్‌కతా: అదేంటో ఈ ప్రపంచకప్‌లో యుద్ధం తప్పదనుకున్న మ్యాచ్‌ల్లోనే భారత్ సులువుగా దండయాత్ర చేసి గెలుస్తోంది. ఆస్ట్రేలియాతో మొదలైన టీమిండియా తొలి మ్యాచ్, క్రికెట్ ప్రపంచం గుడ్లప్పగించి చూసిన పాక్‌తో సమరం... భారీస్కోర్లతో చేలరేగుతున్న దక్షిణాఫ్రికాతో తాజా పోరు... ఇవన్నీ కూడా పోటాపోటీగా సాగుతాయనుకుంటే భారత్ వీరంగంతో ఏకపక్షమయ్యాయి. దీంతో ఆతిథ్య జట్టు కాస్తా అజేయ శక్తిగా మారిపోయింది. ఈ ప్రపంచకప్‌లో భారత జట్టు తర్వాత జోరుమీదున్న దక్షిణాఫ్రికా టీమిండియా దూకుడుకు దాసోహమైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్ 243 పరుగులతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. కోహ్లి పుట్టినరోజు (నవంబర్ 5) ఉదయం శుభాకాంక్షలతో మొదలైతే... సాయంత్రం వచ్చేసరికి శతక ప్రదర్శనతో ప్రశంసలు వెల్లువెత్తాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 326 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (121 బంతుల్లో 101 నాటౌట్; 10 ఫోర్లు) సచిన్‌కు సరిసమానమైన 49వ వన్డే సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ (87 బంతుల్లో 77; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 83 పరుగులకే కుప్పకూలింది. జాన్సెన్ (14) టాప్ స్కోరర్! రవీంద్ర జడేజా (5/33) తన స్పిన్‌తో దక్షిణాఫ్రికాను చుట్టేశాడు. కుల్దీప్ యాదవ్, షమీ చెరో 2 వికెట్లు తీశారు. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను ఈనెల 12న బెంగళూరులో నెదర్లాండ్స్ జట్టుతో ఆడుతుంది.

రో'హిట్స్'తో మొదలై...

కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ (24 బంతుల్లో 40; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఎదురుదాడికి దిగడంతో స్కోరు సగటున 10 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. 6వ ఓవర్లోనే రబడ అతని వేగానికి కళ్లెం వేయగా... కోహ్లి, శుబ్‌మన్ గిల్ (24 బంతుల్లో 23; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగానే ఆడటంతో 10 ఓవర్లలో భారత్ 91/1 స్కోరు చేసింది. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌కు దిగగానే పరిస్థితి ఒక్కసారిగా 'స్విచ్చాఫ్' చేసినట్లు మారింది. గిల్‌ను అవుట్ చేసి... సహకరించే పిచ్‌పై స్పిన్నర్ కేశవ్ మహరాజ్ కట్టడి చేయడంతో తర్వాతి 16 ఓవర్లలో భారత్ 60 పరుగులే చేయగలిగింది. 26 ఓవర్లు ముగిసే సరికి భారత్ 151/1 స్కోరుతో వేగంలో వెనుకబడింది.

'శత'క్కొట్టిన కోహ్లి

పిచ్ సంగతి అర్థమైన కోహ్లి... కేశవ్ బౌలింగ్ ప్రమాదకరమని గుర్తించాడు. అవతలివైపు అయ్యర్‌నూ అలర్ట్ చేసి సింగిల్స్, డబుల్స్‌తోనే స్కోరును ముందుకు సాగనిచ్చాడు. కానీ షమ్సీని మాత్రం వదల్లేదు. చక్కగా బౌండరీలు బాదారు. కోహ్లి 67 బంతుల్లో, అయ్యర్ 64 బంతుల్లో ఫిఫ్టీలు సాధించారు. ఈ జోడి మూడో వికెట్‌కు 134 పరుగులు జతచేశాక అయ్యర్ ఆటను ఎన్గిడి ముగించాడు. రాహుల్ (8) వచ్చివెళ్లాడు. ఆఖరి దశలో సూర్యకుమార్ (14 బంతుల్లో 22; 5 ఫోర్లు) జోరును షమ్సీ అడ్డుకోగా... జడేజా (15 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) వచ్చాకే భారత్ పుంజుకొని 300 దాటింది. కోహ్లి (119 బంతుల్లో) శతకం సాధించాడు. ఈ మేటి బ్యాటర్ క్రీజులో ఉన్నా కూడా... కేశవ్ పూర్తి కోటా వేసినా... ఒక్క బౌండరీ ఇవ్వకపోవడం విశేషం.

సఫారీ పేకమేడలా...

ఈ టోర్నీలోనే బాగా సెంచరీలు, భారీగా స్కోర్లు చేస్తున్న జట్టు... రన్‌రేట్‌లో ముందున్న జట్టు దక్షిణాఫ్రికానే! కానీ ఈ జట్టు కూడా భారత బౌలింగ్‌కు కుదేలైంది. ఇంకా చెప్పాలంటే వికెట్లు రాలిన ఉదంతాన్ని చూస్తే ఓ క్రికెట్ కూననే తలపించింది. సిరాజ్ డెలివరీకి డికాక్ (5) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. జడేజా ముందుగానే రంగంలోకి దించితే తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా క్రమం తప్పకుండా సఫారీ మేటి బ్యాటర్లను పడగొట్టేశాడు. బవుమా (11), క్లాసెన్ (1), మిల్లర్ (11)లను స్పిన్ ఉచ్చులో ఉక్కిరి బిక్కిరి చేయగా... మరోవైపు షమీ పేస్‌తో డసెన్ (13), మార్క్‌రమ్ (9)లను పెవిలియన్ చేర్చాడు. కుల్దీప్ కూడా తనవంతు మ్యాజిక్ చూపడంతో 40 పరుగులకే 5 వికెట్లను... 83 పరుగులకే దక్షిణాఫ్రికా మొత్తం వికెట్లను కోల్పోయి ఆలౌటైంది.


కోహ్లి

స్కోరు వివరాలు


భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) బవుమా (బి) రబడ 40; గిల్ (బి) కేశవ్ 23; కోహ్లి (నాటౌట్) 101; అయ్యర్ (సి) మార్క్‌రమ్ (బి) ఎన్గిడి 77; రాహుల్ (సి) డసెన్ (బి) జాన్సెన్ 8; సూర్యకుమార్ (సి) డికాక్ (బి) షమ్సీ 22; జడేజా (నాటౌట్) 29; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 326. వికెట్ల పతనం:** 1-62, 2-93, 3-227, 4-249, 5-285. **బౌలింగ్:** ఎన్గిడి 8.2-0-63-1, జాన్సెన్ 9.4-0-94-1, రబడ 10-1-48-1, కేశవ్ మహరాజ్ 10-0-30-1, షమ్సీ 10-0-72-1, మార్క్‌రమ్ 2-0-17-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) సిరాజ్ 5; బవుమా (బి) జడేజా 11; డసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 13; మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) షమీ 9; క్లాసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 1; మిల్లర్ (బి) జడేజా 11; జాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 14; కేశవ్ (బి) జడేజా 7; రబడ (సి అండ్ బి) జడేజా 6; ఎన్గిడి (బి) కుల్దీప్ 0; షమ్సీ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (27.1 ఓవర్లలో ఆలౌట్) 83. వికెట్ల పతనం:** 1-6, 2-22, 3-35, 4-40, 5-40, 6-59, 7-67, 8-79, 9-79, 10-83. **బౌలింగ్:** బుమ్రా 5-0-14-0, సిరాజ్ 4-1-11-1, జడేజా 9-1-33-5, షమీ 4-0-18-2, కుల్దీప్ 5.1-1-7-2.

కోహ్లి=సచిన్

సచిన్ టెండూల్కర్ రికార్డును అందుకోవాలంటే మళ్లీ సచినే దిగి రావాలి... మాస్టర్ బ్యాటర్ ఘనతల గురించి ఒకప్పుడు వినిపించిన వ్యాఖ్యల్లో ఇదొకటి. సచిన్ రికార్డుల స్థాయి, అతను అందుకున్న అసాధారణ మైలురాళ్లను చేరుకోవడం దాదాపు అసాధ్యమనే భావన ఇందులో కనిపించింది... కానీ వాటిలో ఒక అరుదైన రికార్డును విరాట్ కోహ్లి ఇప్పుడు అందుకున్నాడు... తనకే సాధ్యమైన అద్భుత ఆటతో వన్డే క్రికెట్‌కు ముఖచిత్రంగా మారిన కోహ్లి 49వ సెంచరీని సాధించడం అనూహ్యమేమీ కాదు... ప్రపంచకప్‌కు ముందు 47 వద్ద నిలిచిన అతను మెగా టోర్నీలో కనీసం రెండు సెంచరీలు సాధించగలడని అందరూ నమ్మారు... బంగ్లాదేశ్‌పై సెంచరీ తర్వాత మరో రెండుసార్లు చేరువగా వచ్చీ శతకానికి దూరమైన అతను ఈసారి విజయవంతంగా ఫినిషింగ్ లైన్‌ను దాటాడు. విరాట్ కోహ్లి నుదుటి రాతను దేవుడు రాయడు... అతనే స్వయంగా తన రాత రాసుకుంటాడు... కోహ్లి శతకం అందుకున్న క్షణాన కామెంటేటర్ అన్న ఈ మాట అక్షరసత్యం. ప్రపంచకప్ మ్యాచ్‌లో తన 35వ పుట్టిన రోజున సచిన్ సెంచరీల సరసన నిలవడం వంటి అద్భుత స్క్రిప్ట్ నిజంగా కోహ్లికే సాధ్యమైంది. ప్రపంచకప్ గెలిచిన క్షణంలో సచిన్‌ను భుజాల మీదకు ఎత్తుకున్న కోహ్లి... పుష్కరం తర్వాత భుజం భుజం కలుపుతూ అతని సరసన సమానంగా నిలిచాడు.

సాక్షి క్రీడా విభాగం




వన్డే క్రికెట్‌ను విరాట్ కోహ్లి చదువుకున్నంత గొప్పగా మరెవరి వల్లా సాధ్యం కాలేదేమో! ఇన్నింగ్స్‌ను ఎలా ప్రారంభించాలి, మధ్య ఓవర్లలో ఎలాంటి ఆట ఆడాలి, చివర్లో ఎంతగా దూకుడు జోడించాలి... సరిగ్గా తాసులో కొలిచి లెక్కించినట్లుగా అతను ఈ ఫార్మాట్‌లో తన ఆటను ప్రదర్శించాడు. రుచికరమైన వంటకం కోసం వేర్వేరు దినుసులను సరిగ్గా ఎలా కలపాలో బాగా తెలిసిన షెఫ్ తరహాలో వన్డేల్లో విజయం కోసం ఎలాంటి మేళవింపు ఉండాలో అతను ఆడి చూపించాడు. ముందుగా బ్యాటింగ్ చేయాల్సి వచ్చినా...లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చినా తన వ్యూహంపై ఉండే స్పష్టత కోహ్లిని అందరికంటే ప్రత్యేకంగా నిలబెట్టింది. సాధారణంగా తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే ఒత్తిడి ఎక్కువగా ఉండే లక్ష్య ఛేదనలో గొప్ప గొప్ప ఆటగాళ్ల రికార్డులు కూడా పేలవంగా ఉంటాయి. కానీ కోహ్లికి మాత్రం పరుగుల వేటలోనే అసలు మజా. ఎంత లక్ష్యాన్నైనా అందుకోవడంలో తనను మించిన మొనగాడు లేడన్నట్లుగా అతని బ్యాటింగ్ సాగింది. తొలి ఇన్నింగ్స్‌లతో (51.15 సగటు, 22 సెంచరీలు) పోలిస్తే ఛేదనలో కోహ్లి రికార్డు (65.49 సగటు, 27 సెంచరీలు) ఘనంగా ఉందంటే అతని ఆట ఎలాంటిదో అర్థమవుతుంది. ఈ 27లో 23 సార్లు భారత్ విజయం సాధించడం విశేషం. తన బ్యాటింగ్‌పై అపరిమిత నమ్మకం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఓటమిని అంగీకరించని తత్వం కోహ్లిని 'ది బెస్ట్'గా తీర్చిదిద్దగా... అసాధారణ ఫిట్‌నెస్, విశ్రాంతి లేకుండా సుదీర్ఘ సమయం పాటు సాగే కఠోర సాధన అతడి ఆటను మరో స్థాయికి తీసుకెళ్లాయి.

కోల్‌కతాలో శతకంతో మొదలై...

ఆగస్టు 18, 2008... కోహ్లి తొలి వన్డే మ్యాచ్ ఆడిన రోజు. కొద్ది రోజుల క్రితమే భారత్‌కు అండర్-19 ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా కోహ్లికి గుర్తింపు ఉండగా... సచిన్, సెహ్వాగ్‌లు విశ్రాంతి తీసుకోవడంతో శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అతనికి తొలి అవకాశం దక్కింది. ఐదింటిలో ఒక మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేసినా సీనియర్ల రాకతో తప్పుకోవాల్సి వచ్చింది. అయితే ఆ తర్వాత దేశవాళీలో, ఆస్ట్రేలియా గడ్డపై ఎమర్జింగ్ టోర్నీలో భారీ స్కోర్లతో చెలరేగిన తనను మళ్లీ ఎంపిక చేయాల్సిన పరిస్థితిని కల్పించాడు. దాంతో ఏడాది తర్వాత మళ్లీ జట్టులోకి పునరాగమనం చేసే అవకాశం దక్కింది. మూడు అర్ధసెంచరీల తర్వాత తన 14వ వన్డేలో శ్రీలంకపై 114 బంతుల్లో చేసిన 107 పరుగుల ఇన్నింగ్స్‌తో అతని ఖాతాలో తొలి సెంచరీ చేరింది. ఈ సెంచరీ కోల్‌కతాలోనే ఈడెన్ గార్డెన్స్‌లో నమోదు చేయడం విశేషం. ఈ మ్యాచ్ తర్వాత మరో మూడు వన్డేలకే మళ్లీ సెంచరీ నమోదు చేసిన కోహ్లికి ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. వన్డే టీమ్‌లో అతను పూర్తి స్థాయిలో రెగ్యులర్ మెంబర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2011 వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో సెహ్వాగ్‌తో పాటు కోహ్లి కూడా సెంచరీ సాధించాడు. అయితే ఫైనల్లో అతని ఇన్నింగ్స్ (35 పరుగులు) కూడా ఎంతో విలువైంది. 31 పరుగులకే సెహ్వాగ్, సచిన్ అవుటైన తర్వాత గంభీర్‌తో మూడో వికెట్‌కు జోడించిన కీలకమైన 83 పరుగులు చివరకు విజయానికి బాట వేశాయి.

ఒకదాన్ని మించి మరొకటి...

విరాట్ కెరీర్‌లో అప్పటికే ఎనిమిది సెంచరీలు వచ్చి చేరాయి. జట్టులో స్థానానికి ఢోకా లేకపోగా, జాగ్రత్తగా ఆడుతూ ఒక్కో పరుగు జత చేస్తూ ఇన్నింగ్స్ నిర్మించే 'క్లాసిక్' ఆటగాడిగా కోహ్లికి అప్పటికి గుర్తింపు వచ్చింది. కానీ అతనిలోని అసలైన దూకుడుకు హోబర్ట్ మైదానం వేదికైంది. శ్రీలంకతో మ్యాచ్‌లో 40 ఓవర్లలో 321 పరుగులు ఛేదిస్తేనే టోర్నీలో నిలిచే అవకాశం ఉన్న సమయంలో కోహ్లి నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. 86 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్స్‌లతో అజేయంగా 133 పరుగులు చేయడంతో 37వ ఓవర్లోనే భారత్ లక్ష్యాన్ని చేరింది. పరిస్థితిని బట్టి కోహ్లి తన ఆటను ఎలా మార్చుకోగలడో ఈ ఇన్నింగ్స్ చూపించగా, తర్వాతి రోజుల్లో ఇలాంటివి ఎన్నో వచ్చాయి. ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై చేసిన అత్యధిక స్కోరు 183, కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాపై 160 నాటౌట్, నేపియర్‌లో కివీస్‌పై 123, పుణేలో ఇంగ్లండ్‌పై 123, మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 117... ఏది గొప్పదంటే ఏమి చెప్పాలి? జైపూర్‌లో ఆస్ట్రేలియాపై 52 బంతుల్లోనే చేసిన శతకం ఇప్పటికీ భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీగా నమోదై ఉంది. అతని ఒక్కో వన్డే ఇన్నింగ్స్‌కు ఒక్కో ప్రత్యేకత ఉంది. ఈ శతకాలు అభిమానులకు పంచిన ఆనందం గురించి ప్రత్యేకంగా చెప్పాలా!



ఎవరు గొప్ప?

అంకెలపరంగా చూస్తే '49' సెంచరీలతో సచిన్, కోహ్లి సమానంగా కనిపిస్తున్నారు. రేపు కోహ్లి దీనిని అధిగమిస్తాడు కూడా. మరి వన్డేల్లో సచిన్ కంటే కోహ్లి గొప్ప బ్యాటరా? నిజానికి రెండు వేర్వేరు తరాల ఆటగాళ్లను పోల్చడమే అసహజం. సులువైన పిచ్‌లు, మారిన నిబంధనలు, ఫీల్డింగ్ పరిమితులు, రెండు బంతుల వాడకం... ఇలా అప్పటి సచిన్‌కంటే ఇప్పుడు కోహ్లికి సహజంగానే కొన్ని అనుకూలతలు ఉన్నాయి. అన్నింటికి మించి సచిన్ సమయంలో అతనొక్కడే జట్టు భారాన్ని సుదీర్ఘ సమయం పాటు మోశారు. రిస్క్‌కు అవకాశం తక్కువ. కానీ కోహ్లికి సమర్థులైన ఇతర సహచరుల అండ ఉండటం అతనిపై ఒత్తిడిని తగ్గించింది. సచిన్ 32 సెంచరీల సమయంలో జట్టులో మరెవరూ సెంచరీలు చేయలేదు. కానీ కోహ్లి 22సార్లు మాత్రమే ఇలాంటి ఫీట్ నమోదు చేయడం ఆ తేడాను చూపిస్తోంది. అయితే ఇదంతా కోహ్లి చేతుల్లో లేనిది. ఇది అతని ఘనతను తగ్గించలేదు. తనకు ఎదురైన ప్రత్యర్థి ఎవరైనా వారిపై విరుచుకుపడటమే అతనికి తెలిసింది. సచిన్ ఓవరాల్ 100 సెంచరీలను కోహ్లి అందుకుంటాడా అనేది ఇక తర్వాతి చర్చ. ప్రస్తుతం కోహ్లి ఖాతాలో 79 శతకాలు ఉన్నాయి. మరో 21 సెంచరీల దూరంలో అతను ఉన్నాడు. టెస్టుల్లో అంతరం చాలా ఎక్కువగా (సచిన్ 51, కోహ్లి 29) ఉండగా... వన్డే ఫామ్‌లో అతను అక్కడికి చేరడం అసాధ్యం కాకపోవచ్చు!

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
శ్రీలంక	7	2	5	4	-1.162
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X బంగ్లాదేశ్
వేదిక: న్యూఢిల్లీ

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ బోపన్న-ఎబ్డెన్ జోడీ



పారిస్: ఈ ఏడాది మూడో డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బోపన్న-ఎబ్డెన్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జంట 2-6, 7-5, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-వాసెలిన్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటన్నరపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఎనిమిది ఏస్‌లు సంధించింది. రన్నరప్‌గా నిలిచిన బోపన్న-ఎబ్డెన్‌లకు 1,48,760 యూరోల (రూ. కోటీ 32 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది బోపన్న-ఎబ్డెన్ జోడీ ఏడు టోర్నీలలో ఫైనల్ చేరి రెండింటిలో టైటిల్ సాధించి, ఐదింటిలో రన్నరప్‌గా నిలిచింది. ఈనెల 12 నుంచి 19 వరకు ఇటలీలో జరిగే సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు కూడా బోపన్న-ఎబ్డెన్ అర్హత సాధించారు.

విజేత భారత్



రాంచీ: స్వదేశంలో తొలిసారి జరిగిన ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా 4-0 గోల్స్ తేడాతో జపాన్ జట్టును ఓడించింది. భారత్ తరఫున సంగీత కుమారి (17వ ని.లో), నేహా (46వ ని.లో), లాల్‌రెమ్‌సియామి (57వ ని.లో), వందన కటారియా (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీని భారత్ నెగ్గడం ఇది రెండోసారి. 2016లో టీమిండియా తొలిసారి ఈ టైటిల్ సాధించింది. విజేతగా నిలిచిన భారత జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యురాలికిగా రూ. 3 లక్షలు చొప్పున అందజేస్తామని తెలిపింది.

ధీరజ్‌కు నాలుగో ర్యాంక్

బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ 682 పాయింట్లు స్కోరు చేసి నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. భారత్‌కే చెందిన తరుణ్‌దీప్ రాయ్ 678 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. టీమ్ విభాగంలో భారత జట్టు 2027 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

చికిత 'పసిడి' గురి...

రష్మిక ఖాతాలో మూడో పతకం


చికిత


రష్మిక

పనాజీ (గోవా): జాతీయ క్రీడల్లో తెలంగాణకు మూడో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన మహిళల ఆర్చరీ కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో తణిపర్తి చికిత పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. పెద్దపల్లి జిల్లా సుల్తానాపూర్ గ్రామానికి చెందిన చికిత ఫైనల్లో 143-142తో ప్రియా గుర్జర్ (రాజస్తాన్)పై గెలిచింది. మరోవైపు మహిళల టెన్నిస్ ఈవెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక మూడో పతకాన్ని దక్కించుకుంది. మహిళల టీమ్ విభాగంలో కాంస్యం నెగ్గిన రష్మిక... డబుల్స్ విభాగంలో శ్రావ్య శివానితో రజతం సాధించింది. ఆదివారం జరిగిన సింగిల్స్ విభాగంలో రష్మిక రజత పతకం సొంతం చేసుకుంది. వైదేహి (గుజరాత్)తో జరిగిన టైటిల్ పోరులో రష్మిక 5-7, 6-7 (3/7)తో పోరాడి ఓడిపోయింది. ప్రస్తుతం తెలంగాణ 3 స్వర్ణాలు, 8 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి 19 పతకాలతో 22వ స్థానంలో ఉంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	283	64,364
నిఫ్టీ ▲	97	19,231

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,478	▲	184
డోజోన్స్	34,061	▲	222
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,418	▽	29
డాక్స్	15,189	▲	46
షాంఘై	3,031	▲	21
నికాయ్	31,950	▲	348

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.99	103.36
€	యూరో	ఎస్‌బీఐ	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.58	56.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.20	62.14
SAR	సౌదీ రియాల్	ఐసీఐసీఐ	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఐసీఐసీఐ	21.78	23.57
¥	చైనా యువాన్	ఐసీఐసీఐ	10.26	12.34

బీమా.. నడిపినోళ్లకు నడిపినంత!

గుప్తా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఢిల్లీలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. వారానికి రెండు రోజులు ఆఫీస్‌కు వెళ్లి వస్తుంటాడు. మూడు రోజులు ఇంటి నుంచే పనిచేస్తుంటాడు. ఢిల్లీకి సమీపంలోని నోయిడాలో నివాసం ఉంటున్నాడు. ఆఫీస్‌కు వెళ్లి వచ్చే సమయంలోనే అతడు కారును ఉపయోగిస్తుంటాడు. తన నివాసం నుంచి ఆఫీస్ 20 కిలోమీటర్ల దూరంలో ఉంది.

30 ఏళ్ల మణి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తుంటాడు. రోజూ ఢిల్లీ నుంచి గురుగ్రామ్‌కు వెళ్లి రావడం అతడు ఉద్యోగంలో భాగం. అంతేకాదు, వారాంతంలో దూర ప్రయాణాలు (లాంగ్ డ్రైవ్) చేయడం అతడికి హాబీ. దీంతో ఏటా 30,000 కిలోమీటర్ల మేర అతడు ప్రయాణం చేస్తుంటాడు. కానీ, గుప్తా ఏడాది మొత్తం తిరిగేది 4,000 కిలోమీటర్లు మించదు.

వీరిలో రిస్క్ ఎవరికి ఎక్కువగా ఉంటుంది? సాధారణంగా ఎక్కువ దూరం ప్రయాణించే వారికి ప్రమాదాల రిస్క్ ఉంటుంది. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారికి రిస్క్ ఉంటుంది. కానీ, ఇక్కడ ఇద్దరూ తమ కారు కోసం ఏటా చెల్లిస్తున్నది ఒకే రకమైన ప్రీమియం. నియమ నిబంధనలను తూ.చా. తప్పకుండా పాటిస్తూ, పరిమిత వేగంతో, తక్కువ దూరం ప్రయాణించే వారిని.. ఎక్కువ దూరం ప్రయాణిస్తూ, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని ఒకే గాటన కట్టడం సహేతుకంగా అనిపించదు. అందుకే నడిపినంత దూరానికే, నడిపే తీరు ఆధారంగా ప్రీమియం చెల్లించే సదుపాయాన్ని బీమా సంస్థలు తీసుకొచ్చాయి.

''రోజూ ఎక్కువ దూరం పాటు ప్రయాణించే వారు, దూర ప్రయాణాలకు తరచుగా వెళ్లే వారితో పోలిస్తే తక్కువ ప్రీమియం చెల్లించడానికే నా ప్రాధాన్యం. ఎందుకంటే నేను కారులో తిరిగేది చాలా తక్కువ దూరం. పైగా నేను ఎంతో జాగ్రత్తగా డ్రైవ్ చేస్తాను. అందుకే నేను చెల్లించే బీమా ప్రీమియం తక్కువగా ఉండాలని కోరుకున్నాను''అని గుప్తా తెలిపారు. అందుకే ఆయన 'పే యాజ్ యూ డ్రైవ్' (పీఏవైడీ), 'పే హౌ యూ యూజ్' (పీహెచ్‌ఐయూ) యాడాన్స్‌ను ఎంపిక చేసుకుని, గతంతో పోలిస్తే తక్కువ ప్రీమియం చెల్లిస్తున్నారు.

గుప్తా వంటి వారికి ఇప్పుడు పీఏవైడీ పాలసీలు ఒక మంచి ఎంపికగా, ఆకర్షణీయంగా మారాయనడంలో సందేహం లేదు. వాహనం ఎంత దూరం ప్రయాణిస్తుందన్న దాని ఆధారంగా బీమా సంస్థలు ప్రీమియం వసూలు చేయడం ఈ పాలసీల్లో ఉన్న వెసులుబాటు. అందుకే తక్కువ నడిపే వారికి, జాగ్రత్తగా నడిపే వారికి ఇవి పెద్ద ఊరటనిస్తున్నాయి. ఈ పీఏవైడీ, పీహెచ్‌యూఐ పాలసీలు ఎలా పనిచేస్తాయి? వీటిని తీసుకునే ముందు తెలుసుకోవాల్సిన అంశాలు? ఈ వివరాలను అందించే కథనమే ఇది.

నడిపిన దూరానికే బీమా రక్షణ

- కారు బయటకు తీసినప్పుడే బీమా అమల్లోకి
- జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే ప్రీమియంలో డిస్కౌంట్
- ఓన్ డ్యామేజ్, థర్డ్‌పార్టీ కవరేజీపై తగ్గింపు
- 25 శాతం వరకు తగ్గనున్న భారం



నేపథ్యం..

మోటార్ బీమా పాలసీలకు సంబంధించి టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలను ప్రవేశపెట్టేందుకు బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) 2022 జూలైలో అనుమతించింది. వినియోగ ఆధారిత వాహన బీమా ప్లాన్లు, రైడర్లు ఆ తర్వాత నుంచి మార్కెట్ ప్రవేశం చేశాయి. టెలీమ్యాటిక్స్ డివైజ్‌లు/గ్యాడ్జెట్ల (పరికరాలు) సాయంతో వాహన వినియోగాన్ని అంచనా వేసి, ఆ మేరకు ప్రీమియాన్ని సాధారణ బీమా సంస్థలు వసూలు చేస్తున్నాయి. కారు నడిపే తీరును కూడా అవి ఈ పరికరాల ద్వారా పరిశీలిస్తాయి. దీంతో సంబంధిత వాహనదారుడి డ్రైవింగ్ తీరు, దూరంపై బీమా కంపెనీలకు కచ్చితమైన సమాచారం లభిస్తుంది. వీటిని విశ్లేషించిన అనంతరం, రిస్క్ ఆధారంగా ప్రీమియం నిర్ణయిస్తాయి. పీఏవైడీ ప్లాన్ల/రైడర్లలో వాహనం తక్కువ నడిపే వారికి ప్రీమియం భారం ఎలా అయితే తగ్గుతుందో.. వాహనం ఎక్కువగా వినియోగించే వారికి ప్రీమియం భారం పెరుగుతుంది. పీఏవైడీ, పీహెచ్‌ఐయూ యాడాన్‌లుగా లభిస్తాయి. ప్రస్తుత ప్లాన్‌కు అనుసంధానంగా తీసుకోవచ్చు. రెన్యువల్ సమయంలో బీమా కంపెనీకి ఈ విషయాన్ని చెబితే చాలు. బీమా ఏజెంట్ లేదంటే నేరుగా బీమా కంపెనీ పోర్టల్ నుంచే వీటిని తీసుకోవచ్చు. దరఖాస్తు పత్రాన్ని నింపి, అప్పటికే కలిగి ఉన్న బీమా ప్లాన్ వివరాలను సమర్పిస్తే చాలు.





పాలసీ కొనుగోలు సమయంలో ఎంపిక చేసుకున్న కిలోమీటర్ల ఆధారంగా పీఏవైడీ పాలసీల ప్రీమియం ఆధారపడి ఉంటుంది. పలు రకాల ప్రీమియం శ్లాబులు ఉంటాయి. వీటి నుంచి పాలసీదారుడు ఎంపిక చేసుకోవచ్చు. ''మన దేశంలో టెలీమ్యాటిక్స్ డివైజ్‌లు కేవలం కొన్ని రకాల కార్ల మోడళ్లకే అందుబాటులో ఉన్నాయి. అందుకని మేము తీసుకొచ్చిన పాలసీలో, ఓడోమీటర్ సాయంతో దూరాన్ని లెక్కిస్తున్నాం. ఓడోమీటర్ రీడింగ్‌ను టెలీమ్యాటిక్స్ డివైజ్ లేదంటే మొబైల్ యాప్ ద్వారా ట్రాక్ చేయవచ్చు''అని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో రిటైల్ బిజినెస్ ప్రెసిడెంట్ పార్థానిల్ ఘోష్ తెలిపారు. సాధారణ ప్రీమియంతో పోలిస్తే బీమా సంస్థలు పీఏవైడీ ప్లాన్ కింద.. 2,500 కిలోమీటర్ల వరకు తిరిగే కార్లకు ప్రీమియంలో 25 శాతం తగ్గింపునిస్తున్నాయి. ఏడాదికి 2,501 కిలోమీటర్ల నుంచి 5,000 కిలోమీటర్ల దూరానికి 17.50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నాయి. ఇక 5,001–7,000 కిలోమీటర్ల పరిధిలో తిరిగే వాహనాలకు ప్రీమియంలో 10 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నాయి. 7,501–10,000 కిలోమీటర్ల దూరం నడిచే కార్లకు ప్రీమియంలో 5 శాతం తగ్గింపు లభిస్తుంది. ఏడాదికి 10,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం పాటు నడిచే కార్లకు ప్రీమియంలో ఎలాంటి

దూరం ఆధారంగా..


రాయితీ ఉండదు. పాలసీ కొనుగోలు చేసే సమయంలో ఉన్న ఓడోమీటర్ రీడింగ్‌ను బీమా సంస్థలు నమోదు చేస్తాయి. తిరిగి రెన్యువల్ సమయానికి తిరిగిన దూరం ఆధారంగా ప్రీమియంను నిర్ణయిస్తాయి.

''ఇలా ఏడాదిలో తిరిగిన దూరం ఆధారంగా మరుసటి ఏడాది ప్రీమియంలో బీమా కంపెనీలు తగ్గింపును ఇస్తాయి. ఒకవేళ పాలసీదారుడు అదే కంపెనీ వద్ద రెన్యువల్ చేసుకోకుండా, మరొక కంపెనీ వద్ద పాలసీ తీసుకున్నా సరే, గడిచిన ఏడాదికి సంబంధించిన డిస్కౌంట్‌ను నెఫ్ట్ ద్వారా పాలసీదారు ఖాతాకు బదిలీ చేస్తాయి. అదే కంపెనీతో కొనసాగితే రెన్యువల్ ప్రీమియంలో తగ్గించి, మిగిలినది చెల్లిస్తే సరిపోతుంది''అని పార్థానిల్ ఘోష్ వివరించారు. పాలసీ తీసుకునే సమయంలో ఎంపిక చేసుకున్న కిలోమీటర్లను ఏడాది కాక ముందే అధిగమించేశారనుకుంటే, అప్పుడు టాపప్ చేసుకోవచ్చు. ఉదాహరణకు ఏడాదికి 6,000 కిలోమీటర్ల కోసం పాలసీ తీసుకుని, రెన్యువల్ గడువుకు ముందే ఈ దూరం దాటేస్తే, అప్పుడు దీన్ని పెంచుకోవచ్చు. ''ఒకటికి మించిన కార్లు ఉన్నవారు లేదా తక్కువ దూరం ప్రయాణించే వారికి పీఏవైడీ ప్లాన్లు మంచి ప్రయోజనాన్నిస్తాయి. ప్రీమియంలో తగ్గింపు అనేది కారు మోడల్, దాని వయసు, రిజిస్ట్రేషన్ అయిన ప్రాంతం ఆధారంగా నిర్ణయం అవుతుంది.

కొన్ని బీమా సంస్థలు రెన్యువల్ సమయంలో అదనపు రివార్డులను కూడా ఇస్తున్నాయి. పాలసీ సంవత్సరంలో కారు తక్కువ వినియోగిస్తాననే స్పష్టత యజమానికి ఉంటే, వాస్తంగా వినియోగించుకున్న మేరకే ప్రీమియం చెల్లించడం సహేతుకంగా ఉంటుంది''అని పాలసీబజార్ మోటార్ ఇన్సూరెన్స్ ఉత్పత్తుల హెడ్ ఆకర్ష్ శర్మ సూచించారు.

నడిపే తీరు కూడా ముఖ్యమే

గుప్తా మాదిరే తాము కూడా డ్రైవింగ్ విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తామని అనుకునే వారు 'పే హౌ యూ యూజ్' (పీహెచ్‌ఐయూ) ప్లాన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో వాహనం నడిపే తీరు ఆధారంగా ప్రీమియం చార్జ్ చేస్తారు. పీఏవైడీ మాదిరే, పీహెచ్‌వైయూ (పే హౌ యు యూజ్) కూడా యాడాన్‌గా వస్తోంది. ''నడిపే తీరు ఆధారితంగా అల్గోరిథమ్ ఇంటర్నల్ స్కోర్‌ను ఇస్తుంది. ఈ స్కోరు ఆధారంగా అండర్‌రైటర్స్ (బీమా అధికారులు) ప్రీమియంను కచ్చితంగా లెక్కిస్తారు. దేశంలో కనెక్టెడ్ కార్లను ప్రారంభించడం పీఏవైడీ ఆఫర్ చేయడానికి అనుకూలం. అవి డ్రైవింగ్ తీరుపై బీమా సంస్థలకు నాణ్యమైన సమాచారాన్ని ఇస్తాయి''అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ మోటార్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ సుభాశిష్ మజుందార్ తెలిపారు. కనెక్టెడ్ కార్స్ అంటే ఇంటర్నెట్‌తో అనుసంధానమైనవి. వీటిల్లో కమ్యూనికేషన్ డివైజ్‌లు, సెన్సార్లు కూడా ఉంటాయి. ఈ ప్లాన్లను తమకు కావాల్సిన విధంగా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. పాలసీని ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు. జునో జనరల్ ఇన్సూరెన్స్ ఆఫర్ చేస్తున్న 'స్విచ్' అనేది ఆన్ డిమాండ్ పాలసీ. పట్టణానికి వెలుపల ఉండి, కారును నడపని సమయంలో పాలసీని ఆఫ్ చేసుకోవచ్చు. దీనివల్ల బీమా ప్రీమియంలో ఆదా చేసుకోవచ్చు. కానీ, ఇలా ఆఫ్ చేసుకున్న సమయంలో కారుకు ఏదైనా నష్టం ఏర్పడితే అందుకు బీమా కంపెనీ నుంచి పరిహారం రాదని (కొన్ని మినహాయింపులు) గుర్తుంచుకోవాలి. కస్టమర్ కారు నడుపుతున్న తీరు ఆధారంగా డ్రైవింగ్ స్కోర్‌ను బీమా సంస్థలు కేటాయిస్తాయి. అధిక వేగం, పరధ్యాన్యంతో డ్రైవింగ్, ఉన్నట్టుండి బ్రేక్‌లు కొట్టడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ స్కోర్ కేటాయిస్తాయి. ఒకవేళ పాలసీని స్విచాఫ్ చేసుకున్న తర్వాత, కారును వినియోగించినట్టయితే ఆ సమయంలో స్విచాన్ చేయడం మర్చిపోయినా.. వారి తరఫున యాప్ ఆ పనిచేస్తుంది.



అన్నింటిపై కాదు..

నడిపినంత దూరం, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంపై వచ్చే డిస్కౌంట్ ఆధారపడి ఉంటుందని గుర్తు పెట్టుకోవాలి. ఇక్కడ ఓన్ డ్యామేజ్ అంటే వాహనానికి ఏదైనా కారణం వల్ల నష్టం వాటిల్లినా లేదా చోరీకి గురైనా పరిహారం ఇచ్చేదని అర్థం చేసుకోవాలి. థర్డ్ పార్టీ అంటే తమ వాహనం వల్ల ఎదుటి వాహనానికి, వ్యక్తులకు జరిగే నష్టానికి రక్షణనిచ్చే కవరేజీ. కొన్ని బీమా కంపెనీలు కేవలం ఓన్ డ్యామేజ్ వరకే ఈ డిస్కౌంట్‌ను ఇస్తున్నాయి. ఐసీఐసీఐ లాంబార్డ్ వంటి సంస్థలు థర్డ్ పార్టీ కవరేజీపైనా డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తున్నాయి. కనుక మొత్తం మీద డిస్కౌంట్ ఎంత వస్తుందన్నది ముందే విశ్లేషించుకోవాలి. ఉదాహరణకు కారు ప్రీమియం రూ.5,000 చెల్లిస్తున్నారనుకుంటే.. అందులో రూ.3,000 ఓన్ డ్యామేజ్ కోసం, రూ.2,000 థర్డ్ పార్టీ కోసం అయితే, ఓన్ డ్యామేజ్ రూ.3,000పై 5–25 శాతం వరకు డిస్కౌంట్ అంటే రూ.150–750 వరకు తగ్గుతుందని అర్థం. ఇక్కడ వాహనదారుడి ప్రయాణ సమాచారం ఎప్పటికప్పుడు బీమా కంపెనీలకు తెలుస్తుందని గుర్తు పెట్టుకోవాలి. గోప్యత కోరుకునే వారు దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ డేటా ఆధారంగానే బీమా సంస్థలు ప్రీమియంపై నిర్ణయానికి వస్తాయి. డిస్కౌంట్ పొందే వారి డ్రైవింగ్ తీరు సైతం బీమా కంపెనీలకు తెలిసిపోతుంది. భవిష్యత్తులో ప్రమాదాల క్లెయిమ్‌లు వచ్చిన సమయంలో ఈ డేటా వాటికి ఉపకరించొచ్చు. రద్దీ సమయాల్లో డ్రైవింగ్, ప్రమాదాలకు అధిక రిస్క్ ఉన్న ప్రాంతాల్లో డ్రైవింగ్‌కు సంబంధించి బీమా కంపెనీలు కొన్ని పరిమితులు విధించే అవకాశం లేకపోలేదు. బీమా కంపెనీ కోరినట్టు టెలీమ్యాటిక్స్, ఇతర పరికరాలు అమర్చుకోవాలంటే, అందుకు కొంత అదనపు వ్యయం అవుతుంది. ఈ పరికరాలకు మెయింటెనెన్స్, మరమ్మతుల ఖర్చు కూడా వాహనదారుడిపైనే పడుతుంది. వాహనంలో ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే.. అందుకు సంబంధించి పాలసీ నియమ, నిబంధనలు ఏంటో ముందే తెలుసుకోవాలి.

వీటికి కవరేజీ..

- సంప్రదాయ బీమాలో మాదిరే అన్ని రకాల రిస్క్‌లను పీఏవైడీ కవర్ చేస్తుంది. అయితే ప్రీమియం చెల్లింపుల్లో వ్యత్యాసం ఉంటుంది.
- ప్రమాదం జరిగితే కారు రిపేర్ లేదంటే రీప్లేస్‌కు అయ్యే ఖర్చును బీమా కంపెనీ భరిస్తుంది.
- చోరీకి గురైతే లేదా చోరీ కారణంగా కారు డ్యామేజ్ అయినా పరిహారం లభిస్తుంది.
- వరదలు, భూకంపాలు తదితర విపత్తుల వల్ల కారుకు నష్టం ఏర్పడినా పరిహారం వస్తుంది.
- థర్డ్ పార్టీ కవరేజీ కూడా పీఏవైడీలతో వస్తుంది.
- కొన్ని పీఏవైడీ పాలసీలు గాయాల రక్షణ కవరేజీని ఆఫర్ చేస్తున్నాయి.

మినహాయింపులు..

- ఉద్దేశపూర్వకంగా చేసుకునే నష్టానికి పరిహారం రాదు.
- మద్యం, డ్రగ్స్ ప్రభావంతో కారు నడుపుతూ ప్రమాదం, నష్టం వాటిల్లితే బీమా సంస్థలు పరిహారం చెల్లించవు.
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కారు నడపడం వల్ల ఎదురయ్యే నష్టానికి పరిహారం రాదు.
- రోజువారీ వినియోగం వల్ల వాహనంలో విడిభాగాలను మార్చాల్సి వస్తే వాటికి పరిహారం రాదు.
- ఎలక్ట్రికల్, మెకానికల్ ఫెయిల్యూర్ వల్ల నష్టం ఏర్పడితే పరిహారం చెల్లించవు.


ప్రీమియం తగ్గించుకునే టిప్స్..

- తక్కువ దూరం నడిపే వారికి పీఏవైడీతో ప్రీమియం ఆదా చేసుకోవచ్చు. దగ్గరి దూరానికి కారును ఉపయోగించుకోకుండా ఉండాలి. కార్యాలయానికి వెళ్లేవారు సహచర ఉద్యోగితో కలిసి చెరొక రోజు కారును వినియోగించుకోవడం వల్ల ఆదా చేసుకోవచ్చు.
- చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి. ఏ సందర్భంలోనూ ట్రాఫిక్ నియామాలు ఉల్లంఘించకూడదు. పరిమిత వేగాన్ని మించకుండా ఉండాలి. సడెన్ బ్రేక్‌లు వేయడం, రిస్క్ తీసుకుని క్రాస్ చేయడం ఇలా ప్రమాదాలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలి.
- ఎయిర్ బ్యాగ్‌ల వంటి భద్రతా ఫీచర్లు ఎక్కువగా ఉన్న కారును ఎంపిక చేసుకోవడం వల్ల కూడా ప్రీమియంలో ఆదా చేసుకోవచ్చు.
- మద్యపానం సేవించే వారు ఆ సమయంలో క్యాబ్ సేవలు వినియోగించుకుని, వ్యక్తిగత డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి.

అదానీ పోర్ట్స్ | మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 795 టార్గెట్: రూ. 1010



ఎందుకంటే: ప్రయివేట్ రంగంలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా నిలుస్తున్న అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్) సరుకు రవాణా(కార్గో) హ్యాండ్లింగ్‌లో 24 శాతానికిపైగా మార్కెట్ వాటాను కలిగి ఉంది. 2010–11లో కేవలం రెండు పోర్టుల(ముంద్రా, దహేజ్)తో కార్యకలాపాలు కొనసాగించిన కంపెనీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14 ఓడరేవుల(పోర్టులు)తో దిగ్గజంగా ఆవిర్భవించింది. వ్యూహాత్మక ప్రాంతాలలోని పోర్టులు, కార్యకలాపాల నిర్వహణా సామర్థ్యం, సరుకు హ్యాండ్లింగ్‌లో భారీ విస్తరణ కంపెనీకి బలాన్నిస్తున్నాయి. హ్యాండ్లింగ్ పరిమాణం 2011తో పోలిస్తే నాలుగు రెట్లుపైగా దూసుకెళ్లింది. ఏపీసెజ్ పోర్టుల ద్వారా వివిధ విభాగాలలో అందుకుంటున్న పురోగతికి పోర్ట్‌ఫోలియో విస్తరణ ద్వారా మరింత జోష్‌ను తీసుకురానుంది. ఫలితంగా మార్కెట్ వాటాను మరింత పెంచుకునే అవకాశముంది. 2023–25 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన సరుకు హ్యాండ్లింగ్ పరిమాణం 12 శాతం చొప్పున పుంజుకోవచ్చని అంచనా. ఇది అటు ఆదాయం, ఇటు నిర్వహణ లాభం(ఇబిటా)లో వార్షిక ప్రాతిపదికన 15 శాతం చొప్పున పురోగతికి కారణమయ్యే వీలుంది.

పిరమల్ ఫార్మా | చాయిస్ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 104 టార్గెట్: రూ. 127



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో పిరమల్ ఫార్మా పటిష్ట ఫలితాలు సాధించింది. మా అంచనాలను మించుతూ ఆదాయం వార్షికంగా 11 శాతం వృద్ధితో రూ. 1,911 కోట్లను అధిగమించింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మ్యాన్యుఫాక్చరింగ్ (సీడీఎంవో) బిజినెస్ దాదాపు 14 శాతం ఎగసింది. త్రైమాసికవారీగా(క్యూ1తో) అయితే 19 శాతం జంప్‌చేసింది. ఈ ఏడాది క్యూ2లో నిర్వహణ లాభం (ఇబిటా) 54 శాతం దూసుకెళ్లి రూ. 266 కోట్లకు చేరింది. వార్షికప్రాతిపదికన మార్జిన్లు 3.87 శాతం బలపడి 13.9 శాతాన్ని తాకాయి. త్రైమాసికవారీగా ఇవి 6.33 శాతం మెరుగుపడ్డాయి. ఇందుకు అధిక నిల్వలు, వ్యయ నియంత్రణలు, నిర్వహణ సామర్థ్య పెంపు చర్యలు తోడ్పాటునిచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాది ఏప్రిల్–జూన్(క్యూ1)లో నష్టాలను వీడి రూ. 5 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది క్యూ2లో రూ. 99 కోట్ల నికర నష్టం నమోదైంది. కాగా.. ఇకపై 64–65 శాతం స్థాయిలో స్థూల మార్జిన్లు నమోదుకాగలవని కంపెనీ అంచనా వేస్తోంది. సీడీఎంవో విభాగంలో పెరుగుతున్న ఆర్డర్లు, ఇతర విభాగాలలో నమోదవుతున్న పురోగతి కారణంగా రానున్న మూడేళ్ల(2023–26) కాలంలో ఆదాయం 13 శాతంపైగా వృద్ధి చెందే అవకాశముంది. స్థూల, నిర్వహణ లాభ మార్జిన్ల మెరుగుతో ఇబిటా 44 శాతం జంప్‌చేసే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఎస్‌బీఐ లాభం అప్

క్యూ2లో రూ. 16,100 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 9 శాతం పుంజుకుని రూ. 16,100 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 8 శాత వృద్ధితో రూ. 14,330 కోట్లను తాకింది. వేతనాలు, పెన్షన్లు సవరించేందుకు కొంత మొత్తాన్ని కేటాయించడంతో లాభాల్లో వృద్ధి పరిమితమైంది. కాగా.. నికర వడ్డీ ఆదాయం 12 శాతంపైగా ఎగసి రూ. 39,500 కోట్లకు చేరింది. అయితే డిపాజిట్ వ్యయాల కారణంగా నికర వడ్డీ మార్జిన్లు 0.12 శాతం నీరసించి 3.43 శాతానికి చేరాయి. వేతనాలు, పెన్షన్లకు ప్రొవిజన్లు రూ. 5,900 కోట్ల మేర పెరగడంతో నిర్వహణ లాభం 8 శాతం క్షీణించి రూ. 19,417 కోట్లకు పరిమితమైనట్లు ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖారా వెల్లడించారు. కాగా.. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) గత దశాబ్ద కాలంలోనే అతితక్కువగా 2.55 శాతాన్ని తాకాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా 600 బ్రాంచీలను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు ఖారా తెలియజేశారు. ఎస్‌బీఐ ప్రస్తుతం 22,400 బ్రాంచీలను కలిగి ఉంది. కనీస మూలధన నిష్పత్తి 14.28 శాతంగా నమోదైంది.

ఎన్‌పీఎస్, ఈపీఎఫ్ ఏది బెటర్..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నాకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల పెట్టుబడులు ఉండగా, వీటిని విక్రయించాను. ఈ లాభం లక్షలోపు ఉంది. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్షలోపు ఉంటే పన్ను చెల్లించక్కర్లేదని విన్నాను. అయితే, ఈ లాభాలను ఆదాయపన్ను రిటర్నుల్లో వెల్లడించాలా? అవసరం లేదా? – గురుమూర్తి

మీ వార్షికాదాయం ఆదాయపన్ను వర్తించే శ్లాబులో ఉంటే తప్పకుండా రిటర్నులు వేయాల్సి ఉంటుంది. రిటర్నులు దాఖలు చేయాల్సిన ప్రతి ఒక్కరూ పన్ను పరిధిలోకి రాని మూలధన లాభం ఉన్నప్పటికీ దాన్ని రిటర్నుల్లో వెల్లడించాల్సిందే. లిస్టెడ్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడులు కలిగినా లేదా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను ఏడాదికి మించి కలిగి ఉంటే, వాటిపై వచ్చే లాభాన్ని దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)గా పేర్కొంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించిన లాభం వస్తే, ఆ మొత్తంపై 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్) ఆధారంగా మీరు దాఖలు చేయాల్సిన వార్షిక రిటర్నుల పత్రాల్లో ఈ వివరాలు ముందుగానే నింపి ఉంటాయి. కనీస ఆదాయపన్ను మినహాయింపు పరిధిలోనే ఆదాయం ఉంటే, పన్ను వర్తించని మూలధన లాభాలను వెల్లడించక్కర్లేదు. ఆదాయపన్ను పాత విధానం కింద సీనియర్ సిటిజన్లు అయితే (60 ఏళ్లు నిండిన) వార్షికాదాయం రూ.3 లక్షలు ప్రాథమిక పన్ను మిహాయింపు పరిమితిగా ఉంది. 80 ఏళ్లు నిండిన వారికి ఇది రూ.5లక్షలుగా ఉంది. మిగిలిన వారికి రూ.2.5 లక్షలుగా ఉంది. నూతన పన్ను విధానంలో వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఆదాయపన్ను మినహాయింపు కనీస పరిమితి రూ.2.5 లక్షలుగానే ఉంది.

వార్షిక ఆదాయ మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షలుగా ఉన్నప్పటికీ, వాస్తవ ఆదాయం ఇంతకంటే తక్కువగా ఉన్న వారు మూలధన లాభాలు (స్వల్పకాల, దీర్ఘకాల) కలిగి ఉంటే, ఆ మొత్తాన్ని కనీస పరిమితి కింద భర్తీ చేసుకోవచ్చు ఉదాహరణకు వార్షికాదాయం రూ.1.8 లక్షలుగానే ఉండి, మూలధన లాభం రూ.లక్ష వచ్చి ఉంటే, అప్పుడు బేసిక్ పరిమితిలో మిగిలిన రూ.70వేలను భర్తీ చేసుకోవచ్చు. ఇది పోను మిగిలిన రూ.30వేలపైనే మూలధన లాభాల పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఇలా కాకుండా మీ ఆదాయం రూ.2.5 లక్షలకు పైన ఉంటే, అప్పుడు మూలధన లాభాలను రిటర్నుల్లో వెల్లడించి నిబంధనల కింద పన్ను చెల్లించాల్సిందే.

ప్రస్తుతం నేను పనిచేస్తున్న సంస్థలో నా నెలవారీ వేతనం నుంచి ఈపీఎఫ్ పథకానికి చందాలు వెళుతున్నాయి. నేను వచ్చే ఏడాది నేను పదవీ విమరణ తీసుకోబోతున్నాను. పీఎఫ్ నిధి సుమారు రూ.50 లక్షలుగా ఉంటుంది. ఈ సమయంలో ఎన్‌పీఎస్‌కు మారేందుకు కార్యాలయం నాకు ఆప్షన్ ఇచ్చింది. మరి నేను ఎన్‌పీఎస్‌కు మారాలా? అది నాకు ప్రయోజనమేనా? – రాజేష్ కుమార్ భాసిన్

రిటైర్మెంట్ ప్రణాళిక కోసం ఎన్‌పీఎస్, ఈపీఎఫ్ రెండూ ముఖ్యమైన పథకాలుగా ఉన్నాయి. ఈపీఎఫ్ అనేది మీ వేతనం నుంచి తప్పకుండా మినహాయించే ప్రావిడెంట్ ఫండ్ ఆప్షన్. రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకోవడమే ఇందులోని ఉద్దేశం. పదవీ విమరణ సమయంలో చేతికి అందే మొత్తంపై పన్ను ఉండదు. ఎన్‌పీఎస్ అనేది స్వచ్ఛంద పథకం. పదవీ విరమణ నిధి ఏర్పాటుకు ఇది కూడా ఒక సాధనం. మీరు మరో ఏడాదిలో రిటైర్మెంట్ తీసుకుంటున్నారు.

ఈపీఎఫ్ ద్వారా ఇప్పటికే నిధిని సమకూర్చుకున్నారు. కనుక ఈ సమయంలో ఎన్‌పీఎస్‌కు మారడం వల్ల వచ్చే అదనపు ప్రయోజనం ఏమీ ఉండదు. వేచి చూసి రిటైర్మెంట్ తర్వాత వచ్చే ఈపీఎఫ్ నిధిని మీ అవసరాలకు అనుగుణంగా ఇన్వెస్ట్ చేసుకోవడం సరైనది. పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం కోరుకునేట్టు అయితే, మీ ఉద్దేశ్యాలకు అనుగుణంగా సాధనాలను ఎంపిక చేసుకోవాలి. క్రమం తప్పకుండా ఆదాయం కోరుకోకపోతే అప్పుడు ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. స్వచ్ఛందంగా అయినా ఎన్‌పీఎస్ ఖాతాను 70 ఏళ్ల వరకు తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.